ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
కరీంనగర్ 21-8-2019 బుధవారం సిటీ సంస్కరణ 46 సంచిక 12
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi
www.eenadu.net
ధర: 6-50. పేజీలు 14+16



5 వరకు కీలక విడిభాగాలపై వారంటీ*
*షరతులు వర్తిస్తాయి.

Hero MotoCorp Ltd. Regd. Office: 34, Community Centre, Basant Lok, Vasant Vihar, New Delhi- 110057, India. CIN: L35911DL1984PLC017354. For more information, contact the nearest Hero MotoCorp's authorised outlet or call Toll Free No: 1800-266-0018 or visit heromotocorp.com. Accessories and features shown may not be a part of standard fitment. Always wear a helmet while riding.

Hero MILEAGE
THODA EXTRA KILOMETERS PER LITRE

Scan the QR code to experience the new Hero Pleasure+

HeroMotoCorp.com
HeroMotoCorpIndia
HeroMotoCorpLimited
TheHeroMotoCorp
HeroMotoCorp

Authorised Dealers: Telangana: Hyderabad: Sri Lakshmi Hero, Malakpet: Ph: 7799766408. **Saroornagar:** Ph: 9246223479. **Vanasthalipuram:** Ph: 9246223423. **Lakshmi Hero,** Somajiguda: Ph: 7799766412. **Masab Tank:** Ph. 9246223413. **Venkateshwara Hero,** Narayanguda: Ph: 7799766345. **Mody Hero,** R.P. Road: Ph: 7799766325. **Bowenpally:** Ph: 27844854. 9885100442. **Phoenix Hero,** Habsiguda: Ph: 7799766415. Ramanthapur: Ph: 27030336. Nagole: Ph: 24034335. **Phoenix Hero,** Kushaiguda: Ph: 9246824193, Bhongir: Ph: 9246394481. **Bhanu Hero,** Erragadda: Ph: 7799766400. Kukatpally: Ph: 23706999. **Phoenix Hero,** Hi-tech City: Ph: 7799766355. Hafeezpet: Ph: 7799017976. **Dealwel Hero,** Nampally: Ph: 7799766416. Asifnagar: Ph: 23536264/65. **Krishna Sai Hero,** Maredpally: Ph: 9849362062. Malkajgiri: Ph: 7799766379. **Sri Venkanna Hero,** Serilingampally: Ph: 9640515185. **Medak: Sri Venkanna Hero,** Patancheru: Ph: 7799766387. **Geeta Hero,** Suchitra Circle: Ph: 8448389696. **Delight Hero,** Sangareddy: Ph: 7799766365. **Sowjanya Hero,** Bahadurpura: 8448481367, **Karimnagar: Bharadwaj Hero,** Ph: 7799766341. **Devesh Hero,** Ph: 7799766346. **Ramagundam: Siddhi Sree Vinayaka Hero -** Ph: 9817009247. **Warangal: Sri Sri Sri Hero,** Ph: 7799766330. **Sree Vaishnavi Hero,** Ph: 7799766351. **Nizamabad: Venkateshwara Hero,** Ph: 7799766420. **Sri Sai Durga Hero,** Ph: 7799766405. **Adilabad: Chandra Hero,** Ph: 7799766397, **Mancherial: Balaji Hero,** Ph: 7799766326. **Delight Hero,** Sangareddy: Ph: 7799766365. **Khammam: Sri Sri Sri Hero,** Ph: 7799766384. **Kothagudem: Rajyalakshmi Hero,** Ph: 7799766390. **Bhadrachalam: Sri Ram Hero,** Ph: 7799766409. **Nalgonda: Venkataramana Hero,** Ph: 7799766404. **Miryalguda: Sree Krishna Hero,** Ph: 7799766371. **Suryapet: Sri Venkata Lakshmi Hero -** Ph: 7799766429. **Mahabubnagar: Ashvini Hero,** Ph: 7799766361, **Ashvini Hero (Ext),** Ph: 99491 11933, **Gadwal: Meghanath Hero,** Ph: 7799766392.

కోర్టు ధిక్కరణ కేసులో ఆర్డీవో, తహసీల్దార్‌కు జైలు

మల్లన్నసాగర్ భూసేకరణ వ్యవహారంలో హైకోర్టు తీర్పు

ఈనాడు, హైదరాబాద్: మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిమిత్తం చేపట్టిన భూసేకరణ వ్యవహారంలో కోర్టు ధిక్కరణ కేసులో గజ్వేల్ ఆర్డీవో డి.విజయేందర్‌రెడ్డికి, కొండపాక తహసీల్దార్ బి.ప్రభుకు రెండు నెలల జైలు శిక్ష రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. అప్పీలు చేసుకోవడానికి వీలుగా 6 వారాలపాటు శిక్షను నిలిపివేసింది. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం తిప్పారం గ్రామానికి చెందిన సి.నారాయణరెడ్డి మరో ముగ్గురు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారించిన జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు ఈమేరకు తీర్పు వెలువరించారు. పరిహారం చెల్లించకుండా, పునరావాసం, పునర్నిర్మాణ పథకం అమలు చేయకుండా భూములను స్వాధీనం చేసుకొంటున్నారంటూ సి.నారాయణరెడ్డి తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారించిన హైకోర్టు.. చట్టప్రకారం పరిహారం, పునరావాస, పునర్నిర్మాణ ప్రయోజనాలు అందించేవరకు పిటిషనర్లను భూముల నుంచి ఖాళీ చేయించరాదంటూ 2018 అక్టోబరు 9న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులున్నప్పటికీ భూములను బలవంతంగా తీసుకుని పనులను చేపట్టడంతో వారు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల భూముల్లోని మామిడిచెట్లను నరికివేశారని వారి తరపు న్యాయవాది బి.రచనారెడ్డి తెలిపారు. పిటిషనర్లు పరిహారం తీసుకోవడానికి నిరాకరించారని, పునరావాసం కింద పరిహారం అందుకోవడానికి అనర్హులని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. వాదనలను విన్న న్యాయమూర్తి మధ్యంతర ఉత్తర్వులు తప్పని అధికారులు నిర్ణయించడం సరికాదని, వారు ఈ కోర్టు ఉత్తర్వులకు అప్పిలేట్ అథారిటీ కాదని, ఇది ఉద్దేశపూర్వక ఉల్లంఘనేనని స్పష్టం చేశారు.

ఆరోగ్యశ్రీ సేవల పునరుద్ధరణ

ఈనాడు - హైదరాబాద్

అయిదురోజులుగా ప్రైవేటు ఆసుపత్రుల్లో నిలిచిపోయిన ఆరోగ్యశ్రీ సేవలు తిరిగి మొదలయ్యాయి. మంగళవారం రాత్రి ఆరోగ్యశ్రీ ట్రస్టు అనుసంధాన ఆసుపత్రుల సంఘం (తన్హా) ప్రతినిధులతో వైద్యమంత్రి ఈటల రాజేందర్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించడంతో సేవల కొనసాగింపునకు అంగీకరిస్తున్నట్లు ప్రైవేటు ఆసుపత్రులు ప్రకటించాయి. ఆరోగ్యశ్రీ, ఉద్యోగులు, పాత్రికేయుల ఆరోగ్య పథకాల కింద తమకు సుమారు రూ. 1,500 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయని, వాటిని వెంటనే చెల్లించాలంటూ తన్హా చేసిన ఆరోపణలపై వైద్యఆరోగ్యశాఖ స్పష్టమైన వివరణ ఇవ్వడంతో వివాదం సమసిపోయింది. నాలుగు రోజుల కిందట చర్చలకు ఆహ్వానించిన మంత్రి ఈటల సమక్షంలో వైద్యశాఖ ఉన్నతాధికారులు చెల్లింపులకు సంబంధించిన గణాంకాలను తన్హా ప్రతినిధుల ముందుంచారు. ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్ఎస్ పథకాల కింద ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 457 కోట్లు మాత్రమే బకాయిలున్నాయని పేర్కొంటూ ఆసుపత్రులవారీగా వివరాలను తన్హా ప్రతినిధులకు అందజేశారు. ఆ సమాచారం తమ వద్దనున్న సమాచారంతో సరిపోకపోవడంతో వాటిని సరిపోల్చుకుని మరోదఫా చర్చలకు హాజరవుతామని తన్హా వెల్లడించింది. మూడు రోజుల్లో దీనిపై విస్తృతంగా చర్చలు జరిపిన తన్హా ప్రతినిధులు చివరకు తాము పేర్కొంటున్నట్లుగా రూ.1500 కోట్ల బకాయిలు లేవని అంచనాకొచ్చినట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి కూడా బకాయిల చెల్లింపులపై సానుకూల స్పందన రావడంతో.. మంగళవారం సమావేశమైన తన్హా బృందం ఆరోగ్యశ్రీ సేవల కొనసాగింపునకు మొగ్గుచూపింది.

ఆరోగ్యశ్రీనే మెరుగు: వైద్యమంత్రి

ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించడానికి తన్హా అంగీకరించిన అనంతరం మంత్రి ఈటల విలేకరులతో మాట్లాడుతూ.. "పరుసగా ఎన్నికల కోడ్ ఉండడం వల్ల చెల్లింపుల్లో కొంత ఆలస్యమైంది. ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్ఎస్ సేవల కోసం రూ. 560 కోట్లు చెల్లించింది. మరో రూ. 120 కోట్లు త్వరలో ఇవ్వనుంది. మిగతాది కూడా నెలనెలా చెల్లించేలా చర్యలు తీసుకుంటాం. బిల్లుల చెల్లింపులో ఇబ్బంది కలగకుండా ఓ కమిటీని నియమిస్తాం. ఆసుపత్రులతో ఒప్పందాల విషయంలో తన్హా కోరుతున్న సవరణలను పరిగణనలోకి తీసుకుంటాం. దేశం మొత్తం మీద మెరుగైన వైద్యసేవ లందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణనే నంబర్‌వన్. ఆయుష్మాన్ భారత్ పథకం కంటే ఆరోగ్యశ్రీ 100 రెట్లు మెరుగైంది. ఆయుష్మాన్ భారత్ కింద రాష్ట్రంలో 25 లక్షల కుటుంబాలకు మాత్రమే వైద్యం అందించే ప్రణాళిక తయారుచేశారు. కానీ తెలంగాణ ప్రభుత్వం 84 లక్షల కుటుంబాలకు ఆరోగ్యశ్రీసేవలందిస్తోంది" అని మంత్రి చెప్పారు.

సేవలు కొనసాగిస్తాం: తన్హా అధ్యక్షులు రాకేశ్

మంత్రి ఇచ్చిన హామీ మేరకు ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగిస్తామని తన్హా అధ్యక్షులు డాక్టర్ రాకేశ్ తెలిపారు. చర్చల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చిన్న ఆసుపత్రులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని అన్నారు. ఆరోగ్యశ్రీ అద్భుతమైన పథకమనీ, దీనివల్ల మూడున్నర కోట్లమంది ప్రజలు లబ్ధిపొందుతున్నారని పేర్కొన్నారు.

వైద్యం కోసం రాత్రంతా నిరీక్షణ

వీరంతా సోమవారం రాత్రి నిమ్స్ ఆసుపత్రిలో ఆరోగ్య శ్రీ ఓపీ కార్డుల కోసం వేచి చూస్తున్నవారు. రాష్ట్రం నలుమూలల నుంచి నిత్యం వందలాది మంది వైద్యం కోసం ఇక్కడికి వస్తారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆరోగ్యశ్రీ సేవలకు సంబంధించి ఓపీ కార్డులు ఇస్తారు. వీటి కోసం ముందు రోజు రాత్రే ఆస్పత్రికి చేరుకుని అక్కడే ఇలా కటిక నేలపైనే పడుకుని మరుసటి రోజు చికిత్స కోసం ఎదురు చూస్తుంటారు.

–ఈనాడు, హైదరాబాద్

రిజిస్ట్రేషన్ అయిన గంటలోనే

చేతికి దస్త్రం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఇళ్లు, ప్లాట్లు కొన్నాక రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ఒక ఎత్తైతే.. ఆ దస్త్రాలు చేతికి రావడం మరో ఎత్తు. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక దస్త్రాలను స్కాన్ చేసి ఇస్తారు. కేవలం ఈ పని కోసమే కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు రిజిస్ట్రేషన్ శాఖ సంస్కరణలకు పూనుకుంది. రిజిస్ట్రేషన్ అయిన గంటలోనే స్కానింగ్ పూర్తి చేసి దస్త్రాలు అప్పగించేలా ఏర్పాట్లు చేస్తోంది. స్కానింగ్, వీడియో రికార్డింగ్ సేవలకు రూ.100 వరకు వసూలు చేయనున్నారు. టెండర్ల ద్వారా ప్రైవేటు ఏజెన్సీని ఎంపిక చేశాక ఛార్జీ ఎంతనేది నిర్ణయిస్తామని రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ చిరంజీవులు తెలిపారు. రిజిస్ట్రేషన్ అయిన గంటలోనే దస్త్రాలు అందించాల్సిన బాధ్యత ఏజెన్సీపైనే ఉంటుందన్నారు. ఒక వేళ జాప్యం జరిగితే ఏజెన్సీ నుంచి జరిమానాలు వసూలు చేసేలా నిబంధనలు రూపొందించామన్నారు. వినియోగదారులకు వేగవంత, పారదర్శక సేవలు అందించేందుకు ఈ సంస్కరణలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. ప్రభుత్వ ఆమోదం లభించిన వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల మంజూరైన 158 ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధుల్లో చేరారని, టైపింగ్ సేవలకు వారిని వినియోగించుకుంటామని తెలిపారు.

దస్త్రాలు భద్రపరిచే డిజీ లాకర్

డిజీ లాకర్.. ఇది ఎలక్ట్రానిక్ లాకర్. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో దీనిని నిర్వహిస్తున్నారు. అందులో ఎవరి పేరు మీద రిజిష్టర్ చేసుకుంటే వారికి ఒక లాకర్ నెంబర్ కేటాయిస్తారు. ఆ పేరుపై ఉండే ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ లాంటి సేవలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. సంబంధిత వివరాలు నమోదు చేయగానే ఆ కార్డులు కనిపిస్తాయి. వాటిపై 'డిజీ లాకర్ వెరిఫైడ్' అని ఉంటుంది. అవి ఒరిజినల్ కిందే లెక్క. ఇప్పుడు రిజిస్ట్రేషన్ దస్త్రాలను కూడా ఈ పద్ధతిలో అందుబాటులోకి తేవాలని అధికారులు నిర్ణయించారు. ఒక వ్యక్తి పేరు మీద ఎన్ని రిజిస్ట్రేషన్లు అయినా అన్ని దస్త్రాలు ఇందులో కనిపిస్తాయి.

భాజపాలోకి దేవేందర్‌గౌడ్?

- లక్ష్మణ్ సంప్రదింపులు
- సామాజిక న్యాయం సదస్సు కోసం నేడు దిల్లీకి తెదేపా నేత
- అగ్ర నేతల్ని కలిసే అవకాశం
- తిరిగొచ్చిన తర్వాత నిర్ణయం తీసుకుంటాం: వీరేందర్‌గౌడ్
- ఇతర పార్టీల నేతలతో భాజపా సంప్రదింపులు ముమ్మరం

ఈనాడు - హైదరాబాద్

ఇతర పార్టీల నేతలను చేర్చుకునేందుకు భాజపా సంప్రదింపులు ముమ్మరం చేసింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ సోమవారం రాత్రి హైదరాబాద్‌లో దేవేందర్‌గౌడ్ ఇంటికెళ్లి సమావేశమయ్యారు. దేవేందర్‌తోపాటు ఆయన కుమారుడు వీరేందర్‌గౌడ్‌ను పార్టీలోకి లక్ష్మణ్ ఆహ్వానించగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. వీరేందర్‌గౌడ్ ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ నుంచి తెదేపా అభ్యర్థిగా పోటీచేసిన విషయం తెలిసిందే. వారు పార్టీలో చేరడం దాదాపు ఖాయమేనని.. మూడు, నాలుగు రోజుల్లో స్పష్టత వస్తుందని భాజపా నేత ఒకరు పేర్కొన్నారు.

రాష్ట్రపతి, ప్రధానితో సమావేశం?

దేవేందర్‌గౌడ్, వీరేందర్‌గౌడ్ బుధవారం దిల్లీకి వెళ్తున్నారు. 'సామాజిక న్యాయం'పై దిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించే సదస్సులో పాల్గొంటారు. తర్వాత రాష్ట్రపతి కోవింద్‌తోపాటు ప్రధాని మోదీని కలిసి వినతిపత్రం ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. అదే సమయంలో భాజపా అగ్రనేతల్ని దేవేందర్‌గౌడ్ కలిసే అవకాశముందట్లు ఆ పార్టీ నేతల సమాచారం. లోక్‌సభ ఎన్నికల సమయం నుంచే దేవేందర్‌గౌడ్‌తో కమలనాథులు టచ్‌లో ఉన్నారు. ఎమ్మెల్సీ రామచందర్‌రావు ఆయన ఇంటికెళ్లి మద్దతు కోరారు. భాజపాలోకి రావాలని దేవేందర్‌గౌడ్‌ను రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు కొద్దిరోజుల క్రితం వెళ్లి ఆహ్వానించారు. తాజాగా లక్ష్మణ్ కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విషయంపై 'ఈనాడు' వీరేందర్‌గౌడ్‌ను సంప్రదించగా..లక్ష్మణ్ కలిసిన విషయం వాస్తవమేనని, భాజపాలో చేరే విషయం దిల్లీ నుంచి వచ్చిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

కాంగ్రెస్ నేతలపై దృష్టి

తెదేపా నేతల్ని పెద్దసంఖ్యలో చేర్చుకున్న భాజపా.. కాంగ్రెస్‌తోపాట కొందరు తెరాస నేతలపై దృష్టి సారించింది. ఇతర పార్టీల్లో అసంతృప్తుల్ని ఆకర్షించే బాధ్యత జాతీయ నాయకత్వం రాష్ట్రస్థాయిలో లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, దత్తాత్రేయలకు అప్పగించినట్లు తెలిసింది. ఓ జాబితా రూపొందించి ఒక్కొక్కరిని సంప్రదిస్తున్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహతో లక్ష్మణ్ ఇప్పటికే ఓసారి మాట్లాడగా ఆయన కొంత సమయం అడిగినట్లు తెలిసింది. మాజీ ఎంపీ విజయశాంతితో కిషన్‌రెడ్డి మాట్లాడుతున్నారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో రాంమాధవ్ గతంలోనే సమావేశంకాగా కొంతకాలం తర్వాత నిర్ణయం తీసుకుంటానని చెప్పినట్లు సమాచారం. మాజీమంత్రి చంద్రశేఖర్‌తోపాటు ఉత్తర తెలంగాణలో ఇద్దరు మాజీ ఎమ్మెల్సీలు, పలువురు మాజీ ఎమ్మెల్యేలతో భాజపా నేతలు చర్చలు జరుపుతున్నారు. తెరాసలో రిజర్వుడ్ నియోజకవర్గాలకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలనూ సంప్రదిస్తున్నట్లు తెలిసింది.

కమలం కొత్త దళం 12 లక్షలు!

ఈనాడు, హైదరాబాద్: భాజపాలో కొత్త సభ్యత్వాల నమోదు కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. 19వ తేదీ వరకు తెలంగాణవ్యాప్తంగా కొత్త సభ్యత్వాల సంఖ్య 12 లక్షలకు చేరినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. లోక్‌సభ నియోజకవర్గాలవారీగా.. ఒక్కోటి లక్షకుపైగా సభ్యత్వాలతో కరీంనగర్, ఆదిలాబాద్ తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. తర్వాత స్థానాల్లో నిజామాబాద్, మహబూబ్‌నగర్ ఉండగా.. ఖమ్మం, మహబూబాబాద్ చివరి స్థానాల్లో నిలిచాయి. తెలంగాణపై ప్రత్యేక దృష్టిపెట్టిన ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా రాష్ట్ర పార్టీ నిర్ణయించిన 12 లక్షల కొత్త సభ్యత్వాల లక్ష్యాన్ని 18 లక్షలకు పెంచారు. ఆగస్టు 20తో సభ్యత్వ నమోదు పూర్తికావడంతో 21-30వరకు క్రియాశీల సభ్యత్వ నమోదు నిర్వహించాలని భాజపా నిర్ణయించింది.

హైదరాబాద్‌లో 50శాతమే

సభ్యత్వ నమోదులో హైదరాబాద్‌పై కమలదళం ఎక్కువ ఆశలు పెట్టుకుంది. 4 లక్షల సభ్యత్వాలు చేయించాలనుకోగా.. సభ్యత్వాలు 50శాతంలోపే ఉన్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే 12 లక్షల వరకే చేరుకుంది. "ఆఖరిరోజు సభ్యత్వాలు, పేపర్ ద్వారా చేసే సభ్యత్వాలు కలిపితే 15లక్షల వరకు చేరే అవకాశముంది. ఏ ఇంటికెళ్లినా భాజపా సభ్యత్వం తీసుకునేందుకు ముందుకొచ్చారు. మేమే అందరి వద్దకు చేరుకోలేకపోయాం" అని పార్టీ రాష్ట్ర సభ్యత్వ నమోదు సహ ఇంఛార్జి కాసంవెంకటేశ్వర్లు 'ఈనాడు'తో చెప్పారు.

శాసనమండలి కొత్త సభ్యుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి మంగళవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ లింగయ్యయాదవ్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తాకు సీఎం అభినందనలు తెలిపారు.

నిరూపించండి లేదా క్షమాపణ చెప్పండి

భాజపా నేతలపై తెరాస ఎమ్మెల్సీల ధ్వజం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంపై అడ్డగోలు ఆరోపణలు చేస్తున్న భాజపా రాష్ట్ర నేతలు.. దమ్ముంటే కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించి వాటిని నిరూపించాలని, లేనిపక్షంలో క్షమాపణలు చెప్పాలని తెరాస ఎమ్మెల్సీలు టి.భానుప్రసాద్‌రావు, వి.గంగాధర్‌గౌడ్, శంబీపూర్ రాజులు డిమాండ్ చేశారు. తెరాసతో తలపడే శక్తి లేక.. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఇతర నేతలు నైతిక విలువలు కోల్పోయి మాట్లాడుతున్నారని విమర్శించారు. మంగళవారం వీరు తెరాస శాసనసభాపక్ష కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ఉద్దేశించిన లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు ఆయన కుసంస్కారాన్ని బయటపెట్టాయి. కాంగ్రెస్‌తో కుమ్మక్కై నిజామాబాద్ ఎంపీ సీటు గెలిచి.. కోతలు కోస్తున్నారు. సీఎం కేసీఆర్ ముందు భాజపా ఆటలు సాగవు. రాష్ట్ర భాజపా నాయకులు రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలి. ప్రాజెక్టులు తేవాలి. లేకుంటే తమ చేతగానితనాన్ని అంగీకరించాలి" అని పేర్కొన్నారు.

మొక్కలు నాటిన రంజిత్‌రెడ్డి, అఖిల్ అక్కినేని

రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ చేసిన హరిత సవాలుకు స్పందించి చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, సినీ నటుడు అఖిల్ అక్కినేని మంగళవారం మొక్కలు నాటారు. హరితహారానికి మద్దతు తెలిపారు.

పెద్దగట్టుకు వస్తున్న యూసీఐఎల్ వాహనాన్ని అడ్డుకుని నిరసన తెలుపుతున్న పెద్దగట్టు గిరిజనులు, ప్రజాసంఘాల నాయకులు

'యురేనియం' వాహనం అడ్డగింత

పెద్దఅడిశర్లపల్లి, న్యూస్‌టుడే: నీటి నమూనాల సేకరణ కోసం వస్తున్న యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(యూసీఐఎల్) వాహనాన్ని పీఏపల్లి మండలం పెద్దగట్టు గిరిజనులు, ప్రజాసంఘాల నాయకులు మంగళవారం అడ్డుకున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలోని నంభాపురం, యల్లాపురం, పెద్దగట్టు, పులిచర్ల గుట్టల్లో యురేనియం నిక్షేపాలున్నట్లు నిర్ధారణకొచ్చిన యూసీఐఎల్ కొన్ని సంవత్సరాలుగా ప్రతి నెలా స్థానిక బోరు బావుల్లో నీటిని సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో యూసీఐఎల్ నాగార్జునసాగర్ క్యాంపు కార్యాలయం సిబ్బంది ప్రత్యేక వాహనంలో క్యాన్లలో నంభాపురం, యల్లాపురం, పులిచర్లలో నీటి నమూనాలు సేకరించి పెద్దగట్టుకు వస్తుండగా మార్గమధ్యలో వారి వాహనాన్ని స్థానిక గిరిజనులు, ఆదివాసి హక్కుల జాతీయ వేదిక, వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ గిరిజన సంఘాల నాయకులు అడ్డుకున్నారు. వాహనం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ప్రతినెలా నీటి నమూనాలు సేకరిస్తుంటామని, తవ్వకాల విషయం తెలియదని సిబ్బంది చెప్పినా వినకుండా వారి వాహనాన్ని వెనక్కు పంపించారు.

శాంతి స్థాపనకు రాజీవ్ పరితపించారు

- మహారాష్ట్ర మాజీ సీఎం పృథ్వీరాజ్ చౌహాన్
- గాంధీభవన్‌లో రాజీవ్ 75వ జయంతి వేడుకలు

హైదరాబాద్, సోమాజిగూడ, న్యూస్‌టుడే: దేశంలో శాంతి స్థాపనకు రాజీవ్‌గాంధీ పరితపించారని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చౌహాన్ అన్నారు. దేశ స్వాతంత్ర్య సముపార్జనకు, దేశాభివృద్ధికి గాంధీ, నెహ్రూ కుటుంబాలు చేసిన ప్రాణ త్యాగాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. టీపీసీసీ ఆధ్వర్యంలో భారతరత్న, దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 75వ జయంతి వేడుకలు మంగళవారం గాంధీభవన్‌లోని ప్రకాశంహాలులో నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ గవర్నర్ రోశయ్య, మహారాష్ట్ర మాజీ సీఎం పృథ్వీరాజ్ చౌహాన్, పీసీసీ మాజీ అధ్యక్షులు వీహెచ్, పొన్నాల, మాజీ మంత్రులు జానారెడ్డి, దామోదర రాజనర్సింహ, షబ్బీర్‌అలీ, డీకే సమరసింహారెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు కుసుమకుమార్, పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ కార్యదర్శులు సంపత్‌కుమార్, సలీం అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్, సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి హాజరయ్యారు.

చౌహాన్ మాట్లాడుతూ చిన్న వయస్సులో ప్రధాని బాధ్యతలు చేపట్టిన రాజీవ్‌గాంధీ భాషాభివృద్ధికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారన్నారు. ఆంగ్ల భాషా పరిజ్ఞానం పెంపొందించేందుకు కంప్యూటర్, ఐటీ రంగంలో నవయుగానికి నాంది పలికారన్నారు. శ్రీలంకలో శాంతి స్థాపన కోసం ప్రయత్నించారని.. దీనిని జీర్ణించుకోలేకే ఎల్‌టీటీఈ ఉగ్రవాదులు రాజీవ్‌ను హత్య చేశారని గుర్తు చేశారు. రోశయ్య మాట్లాడుతూ గాంధీ, నెహ్రూ కుటుంబాలు దేశం కోసం ఎంతో చేశాయని.. దాన్ని జీర్ణించుకోలేక ప్రజల మనసుల్లోంచి వారిని తుడిపేసేందుకే భాజపా తప్పుడు విమర్శలు చేస్తోందని వ్యాఖ్యానించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రసంగిస్తూ నాటి పరిస్థితుల దృష్ట్యా కశ్మీర్‌లో నెహ్రూ ఆర్టికల్ 370 తీసుకొచ్చారని, దానిపై అమిత్‌షా, భాజపా తప్పుడు విమర్శలు చేయడం బాధాకరమన్నారు. మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్ మాట్లాడుతూ నాడు నెహ్రూ ఆర్టికల్ 370 తీసుకురాకపోతే 1948లోనే కశ్మీర్.. పాక్‌లో కలిసిపోయేదన్నారు. భాజపా తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ సమర్థంగా తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆర్థిక సంస్కరణలకు బీజం వేసింది, గ్రామ స్వరాజ్యానికి పునాది వేసింది రాజీవ్ అని సీనియర్ పాత్రికేయులు రామచంద్రమూర్తి పేర్కొన్నారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఉత్తమ్, భట్టివిక్రమార్క ప్రారంభించారు.

సోమాజిగూడలో..

సోమాజిగూడలో పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆధ్వర్యంలో రాజీవ్ జయంత్యుత్సవాలు నిర్వహించారు. పార్టీ నేతలు జానారెడ్డి, శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క, మర్రి శశిధర్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, పొన్నం ప్రభాకర్, మల్లు రవి, షబ్బీర్‌అలీ రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ మాట్లాడుతూ దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపిన నెహ్రూ కుటుంబంపై పలువురు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు.

చరవాణి సరే.. జనవాణీ వినాలి

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి పురస్కరించుకొని హైదరాబాద్‌లో 'సద్భావన పరుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వేదికపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, పొన్నం ప్రభాకర్ ఇలా చరవాణిలో సందేశాలు చూస్తూ నిమగ్నమైపోయారు. వీరిని జానారెడ్డి ఆసక్తిగా తిలకించారు.

– ఈనాడు, హైదరాబాద్

నల్లమల వెళ్లేందుకు అనుమతించండి: కోదండరాం

ఈనాడు, హైదరాబాద్: యురేనియం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న వారికి మద్దతు ఇచ్చేందుకు నల్లమలకు వెళుతున్న తమను పదే పదే పోలీసులు అడ్డుకుంటున్నారని తెలంగాణ జనసమితి అధ్యక్షులు కోదండరాం ఆరోపించారు. ఆ ప్రాంతానికి తమను వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన డీజీపీ మహేందర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన డీజీపీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతున్న కార్యక్రమాలను అడ్డుకోకుండా చూడాలని వినతిపత్రంలో ఆయన పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించాలని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న కలెక్టర్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెజస విద్యార్థి విభాగం ఓ ప్రకటనలో తెలిపింది.

ఆరేళ్లకు స్పందిస్తారా?

షరతులతో ఈ-పాస్‌బుక్ జారీ చేయండి

భూవివాదంపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: భూవివాదంలో యాజమాన్య హక్కుల నిమిత్తం సివిల్ కోర్టును ఆశ్రయించవచ్చని చెప్పిన ఆరేళ్లకు స్పందించిన ప్రభుత్వ తీరును హైకోర్టు తప్పుబట్టింది. భూమి యజమానిగా చెబుతున్నవారికి ఈ-పాస్‌బుక్ జారీచేయాలని ఆదేశించింది. ఈ-పాస్‌బుక్ సివిల్ కోర్టు జారీ చేసే ఉత్తర్వులకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం ఖానాపూర్ గ్రామంలో ప్రతాప్ జంగిల్ రిసార్ట్స్ 1998లో 20 ఎకరాలను భూమిని కొనుగోలు చేయగా పట్టాదార్ పాస్‌బుక్ జారీ అయింది. అయితే ఈ భూమి ప్రభుత్వానికి చెందినదంటూ రికార్డుల్లో పేరును తొలగించాలని జాయింట్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై ప్రతాప్ జంగిల్ రిసార్ట్స్ హైకోర్టును ఆశ్రయించగా.. ఈ నిర్ణయాన్ని రద్దు చేయడంతోపాటు పేర్లను రికార్డుల్లో చేర్చాలని ఆదేశించింది. భూ హక్కులపై సివిల్ కోర్టును ఆశ్రయించవచ్చని 2013లో ప్రభుత్వానికి సూచించింది. కాగా, ఈ-పాస్‌బుక్ జారీ చేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రభుత్వం అప్పీలు దాఖలు చేసింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. హక్కులపై సివిల్ కోర్టును ఆశ్రయించవచ్చని 2013లో అవకాశం ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు స్పందించకుండా ప్రభుత్వం ఇటీవల పిటిషన్ దాఖలు చేయడాన్ని తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో సివిల్ కోర్టు ఉత్తర్వులకు లోబడి రిసార్ట్‌కు ఈ-పాస్‌బుక్ జారీ చేయాలని ఆదేశించింది.

ప్రైవేట్ విశ్వవిద్యాలయాల స్థాపనకు ప్రకటన

- హెచ్ఎండీఏ పరిధిలో 20 ఎకరాలు.. ఇతర చోట్ల 30 ఎకరాలు స్థలం తప్పనిసరి
- దరఖాస్తుల పరిశీలనకు నిపుణుల కమిటీ

**

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 21-8-2019 బుధవారం సిటీ సంపుటి 46 సంచిక 12

రూ. 6-50. పేజీలు 14+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



భారతావనికి గర్వకారణం

విజయవంతంగా చంద్రుని కక్ష్యలోకి

- సెప్టెంబరు 7న జాబిల్లిపై అడుగు
- ప్రతి దశ కీలకమే: ఇస్రో

శ్రీహరికోట-న్యూస్‌టుడే: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మక ప్రయోగం చంద్రయాన్-2 కీలక దశను విజయవంతంగా చేరుకుంది. జాబిల్లివైపు ప్రయాణంలో భాగంగా చంద్రుడి కక్ష్యలోకి 'మంగళ' కరంగా అడుగుపెట్టింది. ప్రయోగంలో ఇదో మైలురాయిగా ఇస్రో అభివర్ణించింది. ఇక చంద్రునిపై అడుగు పెట్టేంత వరకు ప్రతీ దశ కీలకమని పేర్కొంది. జులై 22న శ్రీహరికోట షార్ నుంచి ప్రస్థానాన్ని ప్రారంభించి, 29 రోజులు భూ స్థిర కక్ష్యలో చక్కర్లు కొట్టి మంగళవారం చంద్రుడి కక్ష్యలో అడుగుపెట్టింది. ఉదయం 9.02 గంటలకు ఉపగ్రహంలోని ద్రవ ఇంజిన్‌ను 1738 సెకన్లపాటు మండించి అంతరిక్ష నౌకను 114×18072 కిలోమీటర్ల చంద్రుని కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ...మిగతా 9లో

భాగ్యనగరికి మణిహారం

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాంగణం

- నేడు ప్రారంభోత్సవం
- ముఖ్యఅతిథిగా సీఎం కేసీఆర్

ఈనాడు, హైదరాబాద్: భాగ్యనగరి మెడలో మరో మణిహారం చేరనుంది. ఇ-కామర్స్ రంగంలో అగ్రగామి సంస్థ అమెజాన్ నగరంలోని నానక్‌రామ్‌గూడలో ఏర్పాటు చేసిన ప్రాంగణం ప్రపంచంలోనే అతిపెద్దది. పదివేల మందికి ఉపాధి కల్పించేలా పది ఎకరాల స్థలంలో నిర్మించిన ఈ ప్రాంగణం బుధవారం ప్రారంభం కానుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. అమెజాన్ ఇండియా సీనియర్ ఉపాధ్యక్షుడు, కంట్రీ మేనేజర్ అమిత్ అగర్వాల్, సంస్థ స్థిరాస్తి, వసతుల విభాగం సంచాలకుడు జాన్ స్కోట్లర్ కూడా పాల్గొంటారు. ...మిగతా 2లో

గుదిబండ పథకాలకు స్వస్తి

కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలు తగ్గింపు

రాష్ట్రాలపై తగ్గనున్న వాటా భారం

వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలుకు 15వ ఆర్థిక సంఘం యోచన

ఈనాడు - దిల్లీ

వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గే అవకాశముంది. ఈ దిశగా 15వ ఆర్థిక సంఘం పలు ప్రతిపాదనలు చేయాలని భావిస్తోంది. ముఖ్యంగా- కేంద్ర ప్రాయోజిత పథకాలను తగ్గించి; ఆ మేరకు మిగిలే నిధులను కేంద్రం ఆధ్వర్యంలోని రంగాలకు మళ్లించాలన్న రాష్ట్ర ప్రభుత్వాల డిమాండ్లను సానుకూలంగా పరిశీలిస్తోంది. ఇది అమల్లోకి వస్తే.. ఆయా పథకాలకు తమ వాటా నిధులను సమకూర్చాల్సిన భారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండదు. రాష్ట్ర జాబితా కిందకు వ్యవసాయం, నీటిపారుదల, ప్రజారోగ్యం, మత్స్యపరిశ్రమ, సామాజిక న్యాయం వంటి రంగాలు వస్తాయి. ...మిగతా 2లో

పాలన కొత్త పుంతలు

గాంధీ జయంతి నుంచి కొత్త రెవెన్యూ చట్టం

- చట్టాలు, సంస్కరణలతో నూతన ఒరవడి
- జిల్లా కలెక్టర్ల సమావేశంలో సీఎం కేసీఆర్
- 9 గంటల పాటు సమావేశం
- ప్రజలకు చేరువ కావాలని కలెక్టర్లకు నిర్దేశం
- కొందరి పనితీరుపై అసంతృప్తి
- నేడు సిద్దిపేట జిల్లా కోమటిబండలో సమావేశం

✦ జిల్లా యంత్రాంగం క్రమశిక్షణతో వ్యవహరించేలా చూడాల్సిన బాధ్యత మీదే. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలకు మీరు సంధానకర్తలుగా ఉన్నారు. క్షేత్రస్థాయి వాస్తవాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తేవాలి. సమస్యలేమైనా ఉంటే వాటిని పరిష్కరించేందుకు చొరవ చూపాలి. ప్రజాప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరించాలి. పాలనలో ప్రతి అంశం కీలకమైందే.

✦ తెలంగాణ అయిదేళ్ల పాలన పూర్తి చేసుకొంది. మా పాలన సంతృప్తికరంగా సాగింది. ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది. ప్రజలకు పాలనాపరమైన ఇబ్బందులేమీ ఎదురుగాకుండా చూడాలి. వారు తరచూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రావద్దు. ఒకసారి వెళ్తే అన్నీ పరిష్కారం కావాల్సిందే.

– కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్

ఈనాడు, హైదరాబాద్: గాంధీ జయంతి నుంచి రాష్ట్రంలో కొత్త రెవెన్యూ చట్టం అమల్లోకి తేవాలని యోచిస్తున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. కొత్త చట్టం విప్లవాత్మకమైందని, వ్యవస్థలోని లొసుగులన్నింటినీ తొలగించి, ప్రజలందరికీ కష్టాలు తీర్చేలా కార్యాచరణ ఉంటుందని వెల్లడించారు. సెప్టెంబరులో జరిగే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో దానిని ఆమోదిస్తామని చెప్పారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక చట్టాలు, సంస్కరణల ద్వారా తెలంగాణ పాలన కొత్త పుంతలు తొక్కుతుందని చెప్పారు. చట్టాలను నూటికి నూరుశాతం అమలు చేస్తామన్నారు. 60 రోజుల ప్రత్యేక ప్రణాళికతో పట్టణాలు, గ్రామాలు కొత్త రూపు సంతరించుకుంటాయని చెప్పారు. ...మిగతా 2లో

చిదంబరం మెడపై అరెస్టు కత్తి!

- 'ఐఎన్ఎక్స్' కేసులో ముందస్తు బెయిలుకు దిల్లీ హైకోర్టు నిరాకరణ
- ప్రాథమికంగా చూస్తే కుంభకోణానికి ఆయనే సూత్రధారి
- కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించాల్సిన అవసరం ఉంది: న్యాయమూర్తి తీర్పు
- ఆగమేఘాలపై సుప్రీంకు చిదంబరం
- తక్షణ విచారణకు కోర్టు నిరాకరణ
- ఆచూకీ లేని మాజీ ఆర్థిక మంత్రి

దిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరానికి మంగళవారం న్యాయస్థానాల్లో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణానికి సంబంధించిన అవినీతి, నగదు అక్రమ చలామణీ కేసుల్లో ఆయన దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దిల్లీ హైకోర్టు కొట్టేసింది. దీనిపై ఆయన వెంటనే సుప్రీం కోర్టును ఆశ్రయించగా అక్కడా ఆయనకు ఉపశమనం లభించలేదు. ఆయన పిటిషన్‌పై తక్షణ విచారణకు ...మిగతా 2లో

నిబంధనల్ని విస్మరించిన జెన్‌కో

సంబంధం లేని కారణాలతో పోలవరం జల విద్యుత్తు ప్రాజెక్టు ఒప్పందాన్ని రద్దు చేసింది

ఏపీ హైకోర్టులో వాదనలు వినిపించిన నవయుగ

పనుల నిర్వహణలో ఆ సంస్థ వెనుకబడింది..

వ్యాజ్యానికి విచారణార్హత లేదు: ఏజీ

మధ్యంతర ఉత్తర్వుల జారీపై నిర్ణయం వాయిదా 9లో

కేసీఆర్‌కు రసాయనాల సీసా పార్శిల్

గవర్నర్ నరసింహన్, కేటీఆర్, కవిత, డీజీపీ తదితరులకు కూడా

బట్వాడా కాకముందే సికింద్రాబాద్ ప్రధాన తపాలా కార్యాలయంలో గుర్తింపు 3లో

ఇదీ సంగతి!

త్వరగా ప్రశ్నించండి సార్, మేం పట్టుకెళ్లి మరో కేసులో ప్రశ్నించాలి.

వాయువు అందక.. ఆయువు పోయింది

108 వాహనం తలుపులు తెరుచుకోక ఒకరి మృతి

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అత్యవసరం వైద్యం అందించాల్సిన ఆ వాహనం ఏమాత్రం సేవలందించలేక ఒక వ్యక్తి ప్రాణాలు పోయేందుకు కారణమైంది. ప్రాణవాయువు అందించే వాహనం అక్కడే ఉన్నా.. దాని తలుపు తెరుచుకోక.. సకాలంలో ప్రాణవాయువు అందక ఓ అభాగ్యుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద ఘటన హైదరాబాద్ మలక్‌పేట రైల్వేస్టేషన్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. ఎంఎంటీఎస్‌లో ప్రయాణిస్తున్న ఆనంద్ అనే వ్యక్తికి ఉన్నట్టుండి శ్వాస పీల్చుకోవడం కష్టమైంది. దీన్ని గమనించిన తోటి ప్రయాణికుడు ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వైద్యసాయం అందించేందుకు వచ్చిన 108 అత్యవసర వాహనం తలుపు తెరుచుకోకపోవడంతో ఆయన అక్కడికక్కడే మరణించారు. ...మిగతా 2లో

తలుపు తెరుచుకోని 108 వాహనం ఇదే

మృతుడు ఆనంద్

'ఈ-బిజ్' మోసం రూ.5 వేల కోట్లు!

- సంస్థ నిర్వాహకులను అరెస్టు చేసిన సైబరాబాద్ పోలీసులు
- ఇప్పటివరకు జప్తు చేసిన సంస్థ ఆస్తులు రూ.389 కోట్లు 3లో

వచ్చేసింది డయేరియా టీకా

- రాష్ట్రంలో ఏటా 3.5 లక్షల నీళ్ల విరేచనాల కేసులు
- తొలిసారిగా ప్రభుత్వ వైద్యంలో ప్రవేశం
- వచ్చేనెల తొలివారంలో రాష్ట్రంలో అమలుకు సన్నాహాలు 9లో

ప్రగతిభవన్‌లో మంగళవారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్. పక్కన మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, సీఎస్ ఎస్‌కే జోషి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, హోం మంత్రి మహమూద్ అలీ

పాలన కొత్త పుంతలు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని, ఇందులో కలెక్టర్లు భాగస్వాములు కావాలన్నారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం ఉండకూడదనేది తమ అభిమతమని చెప్పారు. కలెక్టర్లు ప్రగతికి వారధులుగా మారాలని అన్నారు. మంగళవారం ప్రగతిభవన్‌లో జిల్లా కలెక్టర్ల సమావేశం జరిగింది. ఉదయం 11.30 నుంచి రాత్రి 8.30 వరకు దాదాపు 9 గంటల పాటు సుదీర్ఘంగా దీనిని నిర్వహించారు. మంత్రులు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ఇతర ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. సమావేశంలో సీఎం ప్రారంభోపన్యాసం చేశారు. కొత్త రెవెన్యూ చట్టంపై విస్తృతంగా చర్చించారు. వీఆర్వోలు, సర్వేయర్ల వ్యవస్థ రద్దు, రెవెన్యూ ఉద్యోగులు, అధికారులను వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖల్లో విలీనంపైనా మాట్లాడారు.

అనంతరం జిల్లా కలెక్టర్లు మాట్లాడారు. సీఎం ప్రసంగంలో ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించారు. "ప్రస్తుతం రెవెన్యూ చట్టం లోపభూయిష్టంగా ఉంది. ప్రతి గ్రామంలో దీనికి సంబంధించిన సమస్యలున్నాయి. కిందిస్థాయి నుంచి అవినీతి జరుగుతోంది. రెవెన్యూ వ్యవస్థను సమగ్రంగా మార్చాలని నిర్ణయించాం. ప్రజలు, రైతుల అవసరాలకు అనుగుణంగా కొత్త వ్యవస్థ ఉంటుంది. రెవెన్యూ వ్యవస్థలో ప్రస్తుతం కలెక్టర్లు కీలకంగా ఉన్నారు. కొత్త వ్యవస్థలోనూ వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఎవరెవరి సేవలు ఎలా అవసరమో అలా ఉపయోగించుకుంటాం.

పంచాయతీరాజ్ చట్టంపై...

గ్రామీణ తెలంగాణకు కొత్త రూపు కోసం పంచాయతీరాజ్ చట్టం తెచ్చాం. పట్టణాలు, నగరాల రూపురేఖల మార్పిడికి పురపాలక చట్టం వచ్చింది. గ్రామాలలో, పట్టణాలలో 60 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం. ప్రజా ప్రతినిధులు, అధికారులు విశేషమైన ప్రజా భాగస్వామ్యం సాధించి గ్రామాలు, పట్టణాల రూపురేఖల్ని మార్చాలని సూచించాం. ఈ కార్యక్రమానికి ముందే స్థానిక సంస్థలకు నిధులు విడుదలచేస్తాం. ఈ చట్టాల ప్రకారమే పాలన జరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులకు బాధ్యత అప్పగిస్తున్నాం. బాధ్యతలను విస్మరించిన వారిపై కఠిన చర్యలు తీసుకునే అధికారం ఉంటుంది. ఎవరిష్టం వచ్చినట్లు వారు నిధులు ఖర్చు చేయడానికి వీల్లేదు. ఆయా నగరాలు, పట్టణాల ప్రాధాన్యాలు, సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం మాత్రమే నిధులు వెచ్చించాలి. పురపాలక సంఘాలకు ఆదాయం రావాలి. అది సద్వినియోగం కావాలి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మెరుగైన సదుపాయాల కల్పనతో పాటు పరిపాలనాపరంగా కూడా పటిష్ఠంగా ఉండేలా పర్యవేక్షించాలి.

కాళేశ్వరాన్ని సందర్శించాలి

ప్రపంచమే అబ్బురపడే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించుకున్నాం. మూడేళ్ల స్వల్ప వ్యవధిలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేశాం. గోదావరి జలాలతో మన కష్టానికి ఫలితం వచ్చింది. ప్రాజెక్టు కళకళ లాడుతోంది. కలెక్టర్లు ఈ మానవనిర్మిత అద్భుతాన్ని స్వయంగా పరిశీలించాలి. త్వరలోనే ప్రాజెక్టును సందర్శించాలి. జిల్లాల్లో క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి కలెక్టర్లు నడుం బిగించాలి. కార్యాలయాలకు పరిమితం కారాదు. ప్రజలకు అందుబాటులో ఉండాలి. మీ(కలెక్టర్ల)పై పనిభారం మోపం గానీ పాలనకు మీరు చుక్కానిగా నిలవాలి. కలెక్టర్లకు అభివృద్ధిపై ముందు చూపు ఉంటుందని, ఆలోచనలు భిన్నంగా ఉండటంతోపాటు కొత్త అంశాలపై అవగాహన కలిగి ఉంటారనే విశ్వాసంతో కొత్త చట్టాలలో కీలక భాగస్వాముల్ని చేశాం.

కలెక్టర్ పేరు మారుస్తాం

కలెక్టర్ పేరు మార్చి కొత్త పేరు తెస్తాం. పన్నుల వసూళ్ల కోసం బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో ఈ పేరు పెట్టారు. ఇప్పుడు పన్నుల వసూళ్లు లేవు. కలెక్టర్ అని ఉండడం సహేతుకం కాదు. పాలనాధికారి లేదా మరో పేరు గురించి ఆలోచిస్తున్నాం.

లంచం లేనిదే పనికావడం లేదని వేల సంఖ్యలో ఫిర్యాదులు

లంచాలు లేనితే పనులు కావడం లేదని ప్రజల నుంచి వేల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. తప్పు చేస్తున్నామనే భయం లేకపోవడం, పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఇది జరుగుతోంది. ఈ దుస్థితిపోవాలి. ఇందుకోసం ప్రభుత్వం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉంది. అవినీతిపై కలెక్టర్లు నిఘా వేయాలి. అవినీతిని కూకటి వేళ్లతో పెకిలించాలి'' అని సీఎం చెప్పారు. ఈ సందర్భంగా కొత్త రెవెన్యూ చట్టంపై కలెక్టర్ల అభిప్రాయాలను సేకరించారు. ముందుగా నిర్ణీత నమూనాతో కూడిన పత్రాలు అందించి వారి నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. వారితో సీఎం మాట్లాడారు. సమావేశ వివరాలను బహిర్గతం చేయరాదని ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రులను, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

నేడు సిద్ధిపేట జిల్లా సందర్శన

రెండోరోజు కలెక్టర్ల సమావేశాన్ని సిద్ధిపేట జిల్లాలో నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. ముందుగా సింగాయపల్లి, ఆ తర్వాత గజ్వేల్ మీదుగా కోమటిబండ చేరుకొని సమావేశమవుతారు. హరితహారం, మిషన్ భగీరథల గురించి క్షేత్రస్థాయిలో తెలుసుకోవడానికి ఈ పర్యటన ఏర్పాటు చేసినట్లు సీఎం చెప్పారు. సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులతో పాటు మూడు బస్సుల్లో కలెక్టర్లు కోమటిబండకు వెళ్తారు.

కలెక్టర్లు చురుకుగా వ్యవహరించాలి

తెలంగాణ ప్రభుత్వం ప్రజల ముంగిటకు పాలన అందించేందుకు సంస్కరణలు చేపట్టింది. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేసింది. జిల్లా సంఖ్యను 10 నుంచి 33కి పెంచడం వల్ల కలెక్టర్లుగా చాలా మందికి అవకాశం వచ్చింది. కలెక్టర్లలో కొంత మంది మాత్రమే బాగా పనిచేస్తున్నారు. మిగిలిన వారి పనితీరు ఆశించిన స్థాయిలో లేదు. కలెక్టర్లు జిల్లా పాలనపై తమదైన ముద్ర వేయాలి. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వారి ప్రత్యేకత కనిపించాలి. కలెక్టర్ గట్టిగా ఉంటే యంత్రాంగం బాగా పనిచేస్తుంది. రెవెన్యూ వ్యవస్థలో వీఆర్వోల వంటి వారు అవినీతికి పాల్పడుతున్నారంటే దానికి కారణాలేమిటో కలెక్టర్లు తెలుసుకోవాలి. ఉద్యోగులు తెలంగాణ బిడ్డలే. చాలా మంది ప్రగతిలో భాగస్వాములవుతున్నారు. కొంత మంది దారి తప్పుతున్నారు. వారిని సరైన మార్గంలో నడిపించేందుకు కలెక్టర్లు కృషి చేయాలి.

ప్రగతిభవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న ఉన్నతాధికారులు, కలెక్టర్లు

ఇదీ ఐఎన్‌ఎక్స్ కేసు కథ

2007లో చిదంబరం కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో రూ.305 కోట్ల మేర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) అందుకోవడానికి 'ఐఎన్ ఎక్స్ మీడియా'కు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎఫ్ఐపీబీ) పచ్చజెండా ఊపింది. ఈ వ్యవహారంలో నగదు అందుకున్న కంపెనీలన్నీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా చిదంబరం కుమారుడు కార్తి నియంత్రణలో ఉన్నాయన్నది సీబీఐ, ఈడీల వాదన. ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ మాత్రమే ఈ ఆమోదం తెలపాల్సి ఉన్నప్పటికీ నిబంధనలు ఉల్లంఘించి ఎఫ్ఐపీబీ ద్వారా సమ్మతి వచ్చేలా చిదంబరం చక్రం తిప్పారని దర్యాప్తు సంస్థలు ఆరోపించాయి. ఈ కేసులో చిదంబరాన్ని అనేకసార్లు దర్యాప్తు అధికారులు ప్రశ్నించారు. రూ.3500 కోట్ల ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ ఒప్పందం కేసులోనూ ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయ విమానయాన సంస్థలకు మార్గాలను కేటాయించడంలో అవకతవకలకు పాల్పడడం ద్వారా ఎయిర్ ఇండియాకు నష్టం కలిగించారన్న కేసుకు సంబంధించి కూడా చిదంబరంపై ఆరోపణలున్నాయి.

కార్తి చిదంబరం

2007
ఐఎన్ఎక్స్ మీడియాకు రూ. 305 కోట్ల విదేశీ నిధులందేలా ఎఫ్ఐబీపీలో అక్రమాలు జరిగాయన్నది అభియోగం

2017
- మే 15: సీబీఐ కేసు నమోదు
- ఆగస్టు 18: సీబీఐ ఎదుట హాజరు కావాల్సిందిగా కార్తీకి సుప్రీంకోర్టు ఆదేశం

2018
- ఫిబ్రవరి 28: చెన్నై విమానాశ్రయంలో కార్తీని అరెస్టు చేసిన సీబీఐ.. దిల్లీకి తరలింపు. ఒక రోజు పోలీసు కస్టడీకి దిల్లీ కోర్టు అనుమతి.
- అక్టోబరు 9: భాజపా ప్రభుత్వం తనపైన, కార్తీపైన రాజకీయ ప్రతీకార చర్యకు పాల్పడుతోందని సుప్రీంకోర్టుకు చిదంబరం నివేదన

2019
- మార్చి 23: 23 రోజుల జైలు జీవితం అనంతరం కార్తీకి బెయిల్
- జులై 25: చిదంబరాన్ని అరెస్టు చేయకుండా హైకోర్టులో తాత్కాలిక రక్షణ (ఈ రక్షణను కోర్టు ఎప్పటికప్పుడు పొడిగిస్తూ వచ్చింది)
- అక్టోబరు 11: ఐఎన్ఎక్స్ మీడియా నగదు అక్రమ చలామణి కేసులో భారత్, బ్రిటన్, స్పెయిన్‌లలోని కార్తీకి చెందిన రూ. 54 కోట్ల ఆస్తులు స్వాధీనం చేసుకున్న ఈడీ
- అగస్టు 20: చిదంబరం బెయిల్ దరఖాస్తుకు దిల్లీ హైకోర్టు తిరస్కృతి. దీనిపై తక్షణ విచారణకు సుప్రీంకోర్టు నిరాకరణ.

చిదంబరం మెడపై అరెస్టు కత్తి!

(మొదటి పేజీ తరువాయి)

సర్వోన్నత న్యాయస్థానం సుముఖత చూపలేదు. బుధవారం ఉదయం దీన్ని దాఖలు చేయాలని సూచించింది. తాజా పరిణామాల నేపథ్యంలో చిదంబరానికి అరెస్టు ముప్పు పొంచి ఉంది. ప్రస్తుతం ఆయన ఆచూకీ దొరకడంలేదని ఉన్నత స్థాయి వర్గాలు పేర్కొన్నాయి. ఆయన ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసినట్లు వివరించాయి. సీబీఐతోపాటు ఈడీ కూడా ఆయన కోసం గాలిస్తున్నట్లు తెలిపాయి. మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు సీబీఐ అధికారులు దిల్లీలో ఆయన నివాసానికి వచ్చారు. అక్కడ చిదంబరం లేరని తెలుసుకొని వారు వెనుతిరిగారు. అనంతరం 2 గంటల్లోగా దర్యాప్తు అధికారుల ఎదుట హాజరుకావాలని చిదంబరం ఈమెయిల్‌కు నోటీసు పంపారు.

బెయిలు పిటిషన్‌పై వాదనలను ముగించిన హైకోర్టు జనవరి 25న తీర్పును వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ సునీల్ గౌర్ మంగళవారం 24 పేజీల తీర్పును వెలువరించారు. సీబీఐ, ఈడీకి సంబంధించిన రెండు కేసుల్లోనూ చిదంబరం పిటిషన్లను కొట్టేస్తున్నట్లు తీర్పు స్పష్టం చేసింది. "ప్రాథమికంగా పరిశీలిస్తే.. ఈ కుంభకోణం మొత్తానికీ పిటిషనరే (చిదంబరం) సూత్రధారిగా ఉన్నట్లు అర్థమవుతోంది. ఆయనే ప్రధాన కుట్రదారు. దర్యాప్తునకు ఆయన సహకరించడంలేదని తెలుస్తోంది. ఈ కేసులో దర్యాప్తు సంస్థలు సమర్పించిన పత్రాల తీవ్రతను పరిశీలిస్తే ఎలాంటి ముందస్తు బెయిలుకు ఆయనకు యోగ్యత లేదని స్పష్టమవుతోంది. ఈ వ్యవహారంలో సమర్థ దర్యాప్తు కోసం కస్టోడియల్ దర్యాప్తు అవసరమన్నది మా ప్రాథమిక అభిప్రాయం. ఇలాంటి కేసుల్లో బెయిలు మంజూరు చేస్తే సమాజానికి తప్పుడు సంకేతాలు పంపినట్లవుతుంది'' అని వ్యాఖ్యానించింది. ఎంపీగా ఉండటం, న్యాయవాది కావడం వంటివి ముందస్తు బెయిలు మంజూరును సమర్థించజాలవని తెలిపింది. నగదు చలామణీ కేసుకు ఇది ప్రబల ఉదాహరణ అని వ్యాఖ్యానించింది. కేసు తీవ్రత, కోర్టు ఇచ్చిన రక్షణ చట్రంలో ఉన్నప్పుడు ఆయన దాటవేత సమాధానాలు ఇవ్వడం వంటి కారణాలతోనూ ఆయనకు ముందస్తు బెయిలును నిరాకరిస్తున్నట్లు పేర్కొంది. "చిదంబరాన్ని ప్రాసిక్యూట్ చేయడం రాజకీయ ప్రేరేపితమని, కక్షసాధింపు చర్య అని వ్యాఖ్యానించడం అర్థరహితం. నేరగాళ్ల హోదాతో సంబంధం లేకుండా వారి గుట్టును రట్టు చేయాలి. ఆర్థిక నేరాలది భిన్న తరగతి. బెయిలు విషయంలో ఈ కేసులను భిన్న దృక్కోణంతో పరిశీలించాలి. ఆ నేరాలను ఉక్కుపిడికిలితో ఎదుర్కోవాలి'' అని పేర్కొంది. ఇంత భారీ స్థాయి ఆర్థిక నేరాలను చాలా జాగ్రత్తగా ప్రణాళిక రచించి, అమలు చేస్తుంటారని వ్యాఖ్యానించింది. ఇంత పెద్ద ఆర్థిక నేరంపై సాగుతున్న విచారణలో దర్యాప్తు సంస్థ చేతులను తాము కట్టేయజాలమని తెలిపింది. సన్నిహితమైన ఈ కేసులో ప్రాసిక్యూషన్ నిష్ఫలంగా మారడానికి అనుమతించబోమని పేర్కొంది. అత్యున్నత స్థాయి వ్యక్తుల ప్రమేయమున్న పలు కేసుల్లో ఇలాగే జరిగిందని వ్యాఖ్యానించింది.

దిల్లీలో మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం నివాసం వద్ద ఈడీ అధికారులు

సుప్రీం కోర్టులో సవాల్ చేయడానికి వీలుగా ఈ తీర్పును మూడు రోజుల పాటు నిలుపుదలలో ఉంచాలని చిదంబరం తరపు న్యాయవాది దయాన్ కృష్ణన్ కోరారు. దీన్ని పరిశీలించి, ఉత్తర్వులిస్తానని న్యాయమూర్తి జస్టిస్ గౌర్ స్పష్టంచేశారు. అనంతరం ఈ వినతిని కూడా తిరస్కరిస్తున్నట్లు చెప్పారు. జస్టిస్ గౌర్ గురువారం పదవీ విరమణ పొందనున్నారు.

సుప్రీం కోర్టులో హడావుడి

హైకోర్టు తీర్పు వెలువడిన కొద్ది నిమిషాలకే చిదంబరంతో కాంగ్రెస్ నేత, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ భేటీ అయ్యారు. ఈ తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేయాలని నిర్ణయించారు. ఇద్దరూ కలసి సుప్రీం కోర్టులోని పలు కారిడార్ల మధ్య కొద్ది సేపు హడావుడిగా తిరిగారు. సెక్రటరీ జనరల్, ప్రధాన న్యాయమూర్తి సిబ్బంది సహా పలువురు అధికారులను కలిసేందుకు ప్రయత్నించారు. ప్రధాన న్యాయమూర్తితో మాట్లాడేందుకు ప్రయత్నించారు. ఆ తర్వాత చిదంబరం, సిబల్‌లు సంప్రదింపుల గదిలోకి వెళ్లారు. కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ న్యాయవాదులు సల్మాన్ ఖుర్షీద్, అభిషేక్ మను సింఘ్వీలు హడావుడిగా అక్కడికి వచ్చారు. తీవ్ర చర్చోపచర్చల తర్వాత చిదంబరం పిటిషన్‌ను బుధవారం ఉదయం 10.30 గంటలకు సంబంధిత ధర్మాసనం వద్ద దాఖలు చేయాలని కోర్టు అధికారి తనకు సూచించినట్లు సిబల్ తెలిపారు. అయితే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి బుధవారం రాజ్యాంగ ధర్మాసనంలో ఉంటారు. అందువల్ల ఆ ధర్మాసనంలో లేని వారిలో అత్యంత సీనియర్ న్యాయమూర్తి ఎదుట దీన్ని ప్రస్తావించాల్సి ఉంటుందని సిబల్ చెప్పారు. సీనియారిటీలో మూడో స్థానంలో ఉన్న జస్టిస్ ఎన్.వి.రమణ ధర్మాసనం ముందుకు ఇది వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

వాయువు అందక..

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యక్ష సాక్షులు, చాదర్‌ఘాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం నియోజకవర్గం జిల్లెలగూడకు చెందిన ఆనంద్ అనే వ్యక్తి మంగళవారం రాత్రి ఎంఎంటీఎస్‌లో బేగంపేట నుంచి మలక్‌పేటకు ప్రయాణిస్తున్నారు ఇంతలో శ్వాస తీసుకునేందుకు అవస్థపడసాగారు. ఇది గమనించిన తోటి ప్రయాణికుడు మజర్ 108 వాహనానికి ఫోన్‌లో సమాచారం అందించి మలక్‌పేట రైల్వేస్టేషన్ వరకు తోడుగా వచ్చారు. ఆనంద్‌ను మలక్‌పేట రైల్వేస్టేషన్‌లో ఎంఎంటీఎస్ నుంచి కిందకు దింపి అత్యవసర వాహనంలోకి ఎక్కించేందుకు ప్రయత్నిస్తుండగా.. వాహనం తలుపు తీసే క్రమంలో హ్యాండిల్ విరిగిపోయింది. దీంతో 20 నిమిషాలపాటు తలుపు తెరిచేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఎట్టకేలకు వాహనం తలుపును బలవంతంగా తెరిచి ఆనంద్‌కు ఆక్సిజన్ ఎక్కించేందుకు సిబ్బంది ప్రయత్నించగా అప్పటికే ఆనంద్ మరణించినట్లు గుర్తించారు. దీంతో అక్కడకు చేరుకున్న బాధిత కుటుంబీకులు, ఇతర ప్రయాణికులు 108 సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు సర్దిచెప్పడంతో ఆనంద్ మృతదేహాన్ని కుటుంబసభ్యులు మార్చురీకి తరలించారు.

గుదిబండ పథకాలకు స్వస్తి

(మొదటి పేజీ తరువాయి)

ఈ అంశాల్లో ప్రస్తుతం కేంద్రం 30 వరకూ పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఇందుకు తన వాటాగా 90, 70, 60, 50% చొప్పున ఆయా పథకాలను బట్టి నిధులు సమకూర్చుతోంది. కేంద్రం ఇచ్చే సొమ్ముకు రాష్ట్రాలు తమ వాటా నిధులను జోడించి, వీటిని అమలు చేస్తున్నాయి. తమకు ఇష్టం లేకపోయినా కేంద్రం నిధులు ఇస్తోంది కదాని చాలా రాష్ట్రాలు బలవంతంగా ఈ పథకాలను అమలు చేయాల్సి వస్తోంది. కేంద్ర సాయం మాట ఎలాగున్నా... వీటి కోసం రాష్ట్రాలు కూడా భారీగా నిధులను వెచ్చించాల్సి వస్తోంది.

అమెరికాలో తెలుగు విద్యార్థి మృతి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: అమెరికాలో చదువుతున్న విశాఖ నగరానికి చెందిన ఓ విద్యార్థి అక్కడి నదిలో ఈతకు వెళ్లి మృతి చెందారు. సీతమ్మధార ఎన్ఆర్ఐ ఆసుపత్రి సమీప ప్రాంతానికి చెందిన ఎం.ఎస్.కుమార్ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ క్రీడలశాఖ డీజీఎంగా పని చేస్తున్నారు. ఆయన కుమారుడు ఎం.సుమీద్ (27) అమెరికాలోని పోర్టులాండ్‌లో ఎం.ఎస్. రోబోటిక్స్ చదువుతున్నారు. ఆదివారం సాయంత్రం 4.30కు క్రీటర్ లాక్ నదికి మరో ఇద్దరు భారతీయ స్నేహితులతో కలసి ఈతకి వెళ్లారు. నది లోతుగా ఉండటంతో మునిగి చనిపోయారు.

JAWAHARLAL NEHRU ARCHITECTURE AND FINE ARTS UNIVERSITY
Mahaveer Marg, Masab Tank, Hyderabad – 500 028
FINE ARTS AND DESIGN ADMISSIONS – 2019
NOTIFICATION FOR SECOND PHASE COUNSELING
No. JNAFAU/Adms/FADEE-2019/3 Date: 20-08-2019
The second phase counseling of Fine Arts and Design courses for the academic year 2019-20 is scheduled on 26th & 27th August 2019 from 10:00 AM to 5:00 PM at the Office of the Co-ordinator, Admissions, JNAFA University, Masab Tank, Hyderabad - 500028. For schedule and other details visit www.jnafauadmissions.com.
Sd/- Prof. M. Sitaramalakshmi
Coordinator, Admissions

చౌక వడ్డీ రేటుకే

ఎస్‌బీఐ వాహన, గృహ రుణాలు

దిల్లీ: పండుగ సీజన్‌లో వాహన, గృహ, వ్యక్తిగత రుణాలు తక్కువ వడ్డీకే ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రకటించింది. ఈ ఆఫర్లు ఎప్పటి నుంచి ఎప్పటివరకు వర్తిస్తాయో వెల్లడించలేదు.

- కారు రుణాలకు ప్రాసెసింగ్ రుసుము ఉండదు. వడ్డీ రేటు అత్యంత తక్కువగా 8.7% నుంచి ప్రారంభమవుతుంది. భవిష్యత్‌లో వడ్డీ రేట్లు పెరిగినా ఆ భారం వినియోగదారులపై వేయబోమని తెలిపింది.
- ఆన్‌లైన్ ద్వారా అంటే ఎస్‌బీఐ డిజిటల్ ప్లాట్‌ఫాం యోనో లేదా ఎస్‌బీఐ పోర్టల్ ద్వారా కారు రుణం కోసం దరఖాస్తు చేసుకుంటే వడ్డీ రేటులో 25 బేసిస్ పాయింట్ల తగ్గింపు పొందొచ్చు.
- వేతనజీవులు కారు ఆన్‌రోడ్ ధరలో 90 శాతం వరకు రుణంగా తీసుకోవచ్చు.
- రెపోరేటు ఆధారిత గృహరుణాలను 8.05 శాతానికే ఇస్తామని ప్రకటించింది. ఇప్పటికే రుణాలు తీసుకున్నవారికి, కొత్తగా రుణాలు తీసుకునేవారికి సెప్టెంబరు 1 నుంచి ఈ వడ్డీ రేటు వర్తించనుంది.
- రూ.20 లక్షల వరకు వ్యక్తిగత రుణాలకు 10.75 శాతం నుంచి వడ్డీరేటు ప్రారంభం అవుతుంది. ఆరేళ్ల వరకు కాలావధి ఉంటుంది. యోనో యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా వేతనజీవులకు రూ.5 లక్షల వరకు ముందస్తు రుణ అనుమతిని (ప్రీఅప్రూవ్డ్ లోన్స్) కూడా ఎస్‌బీఐ ఇస్తోంది.
- భారత్‌లో చదివేందుకు రూ.50 లక్షల వరకు, విదేశాల్లో చదివేందుకు రూ.1.50 కోట్ల వరకు విద్యారుణాలకు వడ్డీ రేటు 8.25 శాతం నుంచి ప్రారంభం అవుతుంది. 15 ఏళ్ల వరకు కాలపరిమితి ఎంపిక చేసుకోవచ్చు.

భాగ్యనగరికి మణిహారం

(మొదటి పేజీ తరువాయి)

2016 మార్చి 31న అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా దీనికి శంకుస్థాపన జరిగింది. సుమారు 15 అంతస్తులలో 30 లక్షల చదరపు అడుగుల స్థలంలో దీని నిర్మాణం చేపట్టారు. ఇందులో పది లక్షల చదరపు అడుగులను పార్కింగుకు కేటాయించారు. పూర్తిగా అధునాతన నమూనాలో సకల వసతులతో దీనిని నిర్మించారు. అమెజాన్‌కు ప్రస్తుతం ఏడు వేల మంది ఉద్యోగులున్నారు. వచ్చే నెలాఖరు నాటికి ఈ సంఖ్య పదివేలకు చేరనుంది. అమెజాన్ దశాబ్దం క్రితం హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించింది. ఇప్పటికే శంషాబాద్ విమానాశ్రయం వద్ద నాలుగు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. తెలంగాణలో అనుకూలతలను పరిగణనలోకి తీసుకొని ఇక్కడ రూ.400 కోట్ల పెట్టుబడితో ప్రపంచంలోనే అతి పెద్ద ప్రాంగణం నిర్మించాలని నిర్ణయించింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం పది ఎకరాల భూమిని కేటాయించింది. ఈ ప్రాంగణం నుంచి అమెజాన్ ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలను నిర్వహించనుంది. వ్యాపార నిర్వహణ ప్రణాళికలకు తోడు కొత్త సాఫ్ట్‌వేర్ రూపకల్పన, వాణిజ్య విస్తరణ కార్యాచరణకు ఇది కేంద్రం కానుంది.

హైదరాబాద్‌కు మరో కలికితురాయి

ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్న ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ అతిపెద్ద ప్రాంగణానికి హైదరాబాద్ వేదిక కావడం ద్వారా రాష్ట్రానికి విశేష ఖ్యాతి దక్కనుంది. మరిన్ని సంస్థలు హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకునే వీలుంది. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, గూగుల్, ఐబీఎం, ఒరాకిల్ వంటి అనేక బహుళజాతి సంస్థలు తెలంగాణలో తమ కార్యాలయాలను నడుపుతున్నాయి. దేశీయ ఐటీ దిగ్గజాలైన ఇన్ఫోసిస్, విప్రో, టీసీఎస్, టెక్ మహేంద్ర వంటి కంపెనీలెన్నో తెలంగాణలో తమ కార్యాలయాలను ఏర్పాటు చేశాయి. ఐటీ దిగ్గజం గూగుల్ సంస్థ హైదరాబాద్‌లో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో తమ ప్రాంగణాన్ని నెలకొల్పింది. గూగుల్ సంస్థ అమెరికా బయట అదీ హైదరాబాద్‌లో ఇంత పెద్దఎత్తున తమ కార్యకలాపాల్ని విస్తరించడం విశేషం. ప్రపంచ ప్రఖ్యాత యాపిల్ కంపెనీ హైదరాబాద్‌లో 2016 మే 19న మ్యాప్స్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించింది. నానక్‌రామ్‌గూడలోని వేవ్‌రాక్‌లో యాపిల్ సంస్థ కార్యాలయం మొదలైంది. యాపిల్ ఉత్పత్తులైన ఐ ఫోన్, ఐ ప్యాడ్, యాపిల్ వాచ్‌ల వంటి ఉత్పత్తులకు మ్యాప్‌ల అభివృద్ధి పనులను ఈ కేంద్రం నుంచి సాగిస్తున్నారు.

హైదరాబాద్‌లో అమెజాన్ సంస్థ ఏర్పాటు చేసిన అతిపెద్ద ప్రాంగణం

పెట్టుబడులకు ఊతం

అమెజాన్ అతిపెద్ద ప్రాంగణం ద్వారా తెలంగాణలో కొత్త పరిశ్రమల స్థాపనకు, పెట్టుబడులకు ఊతం లభిస్తుంది. వ్యాపార నిర్వహణతోపాటు ఉపాధి కల్పనలో అమెజాన్ సంస్థ పేరొందింది. దీని ద్వారా తెలంగాణ యువతకు భారీగా ఉద్యోగాలు లభిస్తాయి. కొత్త ప్రాంగణం పూర్తి స్థాయి విస్తరణతో 25 వేల మంది వరకు ఉపాధి కలుగుతుంది. దీంతో పాటు వ్యాపార వనరుల విస్తరణ ద్వారా తెలంగాణకు అన్ని రకాలుగా మేలు జరుగుతుంది.

– జయేశ్‌రంజన్, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల ముఖ్య కార్యదర్శి

ఈనాడు 1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

కొరగాని విజ్ఞానమది

అంకితభావం లేని విజ్ఞానం విఫల ప్రయోగం లాంటిది! నిజమైన విజ్ఞానం మనకు నైతిక బలాన్నీ, నైతిక హక్కునీ తెచ్చిపెడుతుంది.

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

21-8-2019 బుధవారం

శ్రీ వికారి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
షష్ఠి: రా.2-34 తదుపరి సప్తమి
అశ్విని నక్షత్రం: రా.9-51 తదుపరి భరణి
అమృత ఘడియలు: మ.2-06 నుంచి 3-49 వరకు
వర్జ్యం: సా.5-32 నుంచి 7-15 వరకు
దుర్ముహూర్తం: మ.11-38 నుంచి 12-

కేసీఆర్‌కు రసాయనాల సీసా పార్శిల్

- గవర్నర్ నరసింహన్, కేటీఆర్, కవిత, డీజీపీ తదితరులకు కూడా
- పంపింది ఉస్మానియా యూనివర్సిటీ పోస్టాఫీసు నుంచి
- బట్వాడా కాకముందే సికింద్రాబాద్ ప్రధాన తపాలా కార్యాలయంలో గుర్తింపు
- దుర్వాసన రావడంతో పోలీసులకు ఫిర్యాదు
- ఏముందో నిగ్గు తేల్చేందుకు ఫోరెన్సిక్ ప్రయోగశాలకు సీసాలు
- తాగునీటి సమస్య తీవ్రత తెలిపే ప్రయత్నమని పోలీసుల అంచనా

పార్శిల్ చేసిన పెట్టెలివే ★ పార్శిళ్లను తనిఖీలు చేస్తున్న మహంకాళి పోలీసులు, క్లూస్ టీం

ఈనాడు, హైదరాబాద్; రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: అది సికింద్రాబాద్ ప్రధాన తపాలా కార్యాలయం.. అక్కడ ఒకే తరహా పెట్టెలు అరవైకి పైగా ఉన్నాయి. వాటి నుంచి విపరీతమైన దుర్వాసన వస్తోంది. వాటిపై బట్వాడా చేయాల్సిన చిరునామాలను చూసి సిబ్బంది నిర్ఘాంతపోయారు. గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కేసీఆర్, తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు, మాజీ ఎంపీ కవిత, డీజీపీ మహేందర్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి. అంజనీకుమార్, ఐదుగురు డీసీపీలు... ఇలా అంతా పేరొందిన ప్రముఖులే. పెట్టెల్ని తెరిచి చూస్తే సీసాలు కనిపించాయి. వాటిల్లో రసాయనాల మాదిరి ద్రవం ఉంది. ఒక్కోసీసాలో లీటరున్నర దాకా ఉంటుంది. రసాయన బాంబులేమోనన్న అనుమానంతో అధికారులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీస్ బృందం సీసాలను పరిశీలించింది. పరిశ్రమల్లోని రసాయన వ్యర్థాలుగా క్లూస్ బృందం గుర్తించింది. ఇందులో ఏవైనా విష పదార్థాలు, పేలుడు పదార్థాలున్నాయా అని నిర్ధారించుకునేందుకు ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపించామని పోలీస్ అధికారులు తెలిపారు.

కలుషిత నీటి సమస్య ప్రభుత్వం దృష్టికి!

పెట్టెల్లో సీసాలతోపాటు లేఖలు కూడా ఉన్నాయి. లేఖల్లో స్పష్టత లేదని 'కలుషిత నీళ్లు తాగి ఇలా ఉన్నాం...' అని తెలియజేయాలన్నది వారి ఉద్దేశంగా కనిపిస్తోందని పోలీసుల ద్వారా తెలియవచ్చింది. ఈ పెట్టెలను ఈ నెల 17న ఉస్మానియా యూనివర్సిటీ పోస్టాఫీసు నుంచి పంపించారు. ఇవన్నీ సోమవారం సికింద్రాబాద్ తపాలా కార్యాలయానికి వచ్చాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాల్లో కలుషిత నీటి సమస్య పరిష్కారం కాకపోవడంతో విసుగు చెందిన వారు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నిరసన పద్ధతి ఎంచుకొని ఉంటారని పోలీస్ అధికారులు భావిస్తున్నారు. విద్యార్థులెవరైనా ఇలా చేసి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. తపాలాశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తామని మహంకాళి ఇన్‌స్పెక్టర్ జైపాల్‌రెడ్డి చెప్పారు. ఈ పార్శిళ్లు పంపించారని భావిస్తున్న వ్యక్తులను పోలీసులు విచారిస్తున్నారు.

మెటల్ డిటెక్టర్లు లేవు..

సికింద్రాబాద్ ప్రధాన తపాలా కార్యాలయంతో పాటు.. స్థానికంగా ఉండే సబ్ పోస్టాఫీసుల్లో మెటల్ డిటెక్టర్లు లేవు. తపాలా కార్యాలయ చట్టాలు, నిబంధనల ప్రకారం పోస్టు ద్వారా పేలుడు పదార్థాలు, నిషేధిత వస్తువులను పంపరాదు. తేడా వస్తే పంపినవారిపైనే కాదు సిబ్బందిపై కూడా చర్యలుంటాయి. తాజా ఘటన నేపథ్యంలో అన్ని తపాలా కార్యాలయాల్లో.. ముఖ్యంగా పార్శిల్ బుకింగ్ కార్యాలయాల్లో మెటల్ డిటెక్టర్లు ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నడుం దాకా పూడ్చుకుని రైతు నిరసన

- రెవెన్యూ రికార్డులు మార్చిన అధికారులపై చర్యల్లేవంటూ వినూత్న ఆందోళన

నడుం వరకూ పూడ్చుకుని నిరసన వ్యక్తం చేస్తున్న రైతు నాగేందర్‌రెడ్డి

డోర్నకల్, న్యూస్‌టుడే: రెవెన్యూ అధికారులు రికార్డులు మార్చి తనకు అన్యాయం చేశారంటూ మహబూబాబాద్ జిల్లాలో ఓ రైతు వినూత్న నిరసన చేపట్టారు. డోర్నకల్ మండలం పెరుమాండ్లసంకీస గ్రామానికి చెందిన మారెడ్డి నాగేందర్‌రెడ్డి మంగళవారం తన వ్యవసాయ భూమిలో గొయ్యి తవ్వి.. నడుం వరకూ మట్టిని పూడ్చుకుని నిరసన వ్యక్తంచేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నెలలుగా కోరుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతోనే తాను ఈ చర్యకు దిగానన్నారు. విషయం తెలుసుకున్న డోర్నకల్ తహసీల్దార్ నరసింహారావు, సీఐ శ్యాంసుందర్ వెళ్లి.. నిరసన విరమించాలని నాగేందర్‌రెడ్డిని సముదాయించే ప్రయత్నం చేశారు. ఆయన ససేమిరా అనడంతో వారు జాయింట్ కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో కొమురయ్యలతో ఫోన్‌లో మాట్లాడించారు. స్పష్టమైన హామీ ఇస్తేనే తాను ఆందోళన విరమిస్తానని నాగేందర్ పేర్కొనడంతో సుమారు రెండున్నర గంటల పాటు ఉత్కంఠ కొనసాగింది. పరిసర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో చేరుకొని నాగేందర్‌కు సంఘీభావం తెలుపుతూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులతో పలు దఫాలు చర్చలు నిర్వహించిన అనంతరం తహసీల్దార్ నరసింహారావు మాట్లాడుతూ.. వాస్తవ పరిస్థితిని విచారించి మూడు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తానని, దానిని పరిశీలించి ప్రభుత్వం విచారణకు ఓ ప్రత్యేక అధికారిని నియమిస్తుందని పేర్కొన్నారు. దీంతో దీక్ష విరమించి బయటకొచ్చిన నాగేందర్‌రెడ్డి స్పందిస్తూ.. తాను ఈ నెలాఖరు వరకు వేచి చూస్తానన్నారు. తనకు 10 ఎకరాలు ఉండగా.. అధికారులు ట్యాంపరింగ్‌కు పాల్పడి 4 ఎకరాలుగా చూపిస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు నాగేందర్‌రెడ్డిపై ఆత్మహత్యాయత్నం సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు

యాదాద్రి రాబడి రూ.87.85 లక్షలు

యాదాద్రి పుణ్యక్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి బాలాలయంలో భక్తులు సమర్పించిన నగదు, నగల హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. రాబడి మొత్తం రూ. 87,85,728 అని దేవస్థానం కార్యనిర్వహణాధికారిణి గీతారెడ్డి తెలిపారు. మండపంలో ఏర్పాటైన లెక్కింపును వంశపారంపర్య ధర్మకర్త నరసింహమూర్తి పర్యవేక్షించారు.

- యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే

'లెక్క'లేనితనం



ఇది పదోతరగతిబోర్డు నిర్వాకం. నల్గొండకు చెందిన గంధం పవన్‌కార్తీక్‌కు పదోతరగతిలో సామాన్యశాస్త్రం, గణితం, హిందీ సబ్జెక్టుల్లో 9.5 జీపీఏ వచ్చినట్లు మార్కుల మెమోవచ్చింది. ఎక్కువమార్కులు వస్తాయని నమ్మకం ఉన్న అతడు ఒక్కో దానికి రూ.వెయ్యి చొప్పున వెచ్చించి పునఃమూల్యాంకనంకోసం దరఖాస్తుచేశాడు. సైన్స్‌లో పది మార్కులు పెరిగాయి. హిందీలో మార్పేమీలేదు. గణితం పేపర్-2లో 32.5 మార్కులు వచ్చినట్టు స్పష్టంగా కనిపిస్తున్నా గతంలో వేసిన 22.5 మార్కులే మళ్లీ వేసి పంపించారు.

- నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే

హాజరు మాసోత్సవంగా ఆగస్టు నెలను ప్రకటించి అమలు చేస్తున్న విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి సెప్టెంబరు మాసాన్ని విద్యా సాధన మాసోత్సవంగా ప్రకటించారు. బడి ఈడు పిల్లలు అందరూ బడిలో ఉండటం ఎంత ముఖ్యమో వారికి నాణ్యమైన విద్యను అందేలా చేయడం కూడా అంతే ముఖ్యమన్నది ఆయన భావన. వారు పైతరగతులకు వెళ్లిన కొద్దీ ఆ తరగతి స్థాయిని అందుకోలేక బడికి దూరమయ్యే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో విద్యా సామర్థ్యాల సాధన మాసోత్సవాన్ని ఆయన ప్రకటించారు. ఇందులో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు చేయాల్సిన వాటిని వివరించారు.

'ఈ-బిజ్' మోసం @ రూ.5 వేల కోట్లు!

- సంస్థ నిర్వాహకులను పట్టుకున్న సైబరాబాద్ పోలీసులు
- ఇప్పటివరకు జప్తు చేసిన సంస్థ ఆస్తులు రూ.389 కోట్లు

నిందితులు పవన్ మల్హాన్, హితిక్ మల్హాన్ (పాత చిత్రం)

ఈనాడు, హైదరాబాద్: ప్రధానంగా నోయిడా కేంద్రంగా సాగిన ఈ-బిజ్ గొలుసుకట్టు మోసం విలువ సుమారు రూ.5 వేల కోట్లకు చేరిందని సైబరాబాద్ ఆర్థిక నేర విభాగం పోలీసులు తాజాగా గుర్తించారు. గత మార్చిలో తొలిసారిగా ఈ సంస్థ మోసాన్ని బహిర్గతంచేసిన పోలీసులు.. ఎండీ పవన్ మల్హాన్(62), పర్యవేక్షకుడు హితిక్ మల్హాన్(31)లను మంగళవారం అరెస్టు చేశారు. జగిత్యాలకు చెందిన విద్యార్థి ఫిర్యాదుతో మార్చిలోనే హితిక్ మల్హాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. సంస్థ కార్యకలాపాల వివరాలు ఇవ్వాలని నోటీసు ఇచ్చి పంపించివేశారు. అప్పటి నుంచి హితిక్ స్పందించలేదు. విచారణకు హాజరుకావాలని పోలీసులు పిలిచినా రాలేదు. ఈ నేపథ్యంలో పోలీసు బృందం నోయిడాకు వెళ్లి నిందితులిద్దరిని అదుపులోకి తీసుకుంది. అక్కడి న్యాయస్థానంలో హాజరుపరిచిన అనంతరం మంగళవారం నగరానికి తీసుకొచ్చారు. సంస్థపై ఫిర్యాదు వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ. 389 కోట్ల విలువైన ఆస్తులను పోలీసులు జప్తుచేశారు.

రూ.16,821 చెల్లిస్తే సభ్యత్వం..

గొలుసుకట్టు మోసంలో భాగంగా ఈ-బిజ్ నిర్వాహకులు విద్యార్థులను, నిరుద్యోగ యువకులనే లక్ష్యంగా చేసుకున్నారు. 2001లో నోయిడాలో సంస్థ కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించారు. తొలుత రూ.16,821 చెల్లించి సభ్యులుగా చేరితే నెలలోనే ఆ మొత్తం రాబట్టుకోవచ్చని చెప్పేవారు. సభ్యత్వం తీసుకున్న వారికి దుస్తులు, ఈ-లెర్నింగ్ కోర్సులు, విహారయాత్ర ప్యాకేజీల ఆశ చూపేవారు. నెల రోజులైనా తమ డబ్బు తిరిగి రాకపోవడంతో సభ్యులు ఒత్తిడి చేస్తే.. మరో ముగ్గురిని చేర్పిస్తేనే కమీషన్ రూపంలో డబ్బు తిరిగి వస్తుందని చెప్పేవారు. తప్పనిసరి పరిస్థితుల్లో తమ డబ్బు రాబట్టుకునేందుకు సభ్యులు.. కొత్తవారిని చేర్పించేవారు. అలా గొలుసుకట్టు మోసానికి పాల్పడి దేశవ్యాప్తంగా దాదాపు 17 లక్షల మందిని చేర్పించుకొని సుమారు రూ.5 వేల కోట్లు వసూలు చేశారు. గత మార్చిలో కేపీహెచ్‌బీ కాలనీలో జగిత్యాల విద్యార్థి చేసిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అప్పటి నుంచి నిందితులు నోటీసులకు స్పందించకపోవడం.. తాజాగా సనత్‌నగర్‌కు చెందిన విద్యార్థి మహ్మద్ షారుఖ్ చేసిన ఫిర్యాదు ఆధారంగా వారిని అరెస్టు చేశారు.

సైన్స్ ప్రతిభాన్వేషణ పరీక్ష డిసెంబరు 1న

డాక్టర్ ఏఎస్ రావు అవార్డ్స్ కౌన్సిల్ వెల్లడి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: డాక్టర్ ఏఎస్ రావు అవార్డ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 32వ సైన్స్ ప్రతిభాన్వేషణ పరీక్ష (ఎస్‌టీఎస్ఈ) డిసెంబరు 1న జరగనుంది. ఈ ప్రాథమిక పరీక్షలో ప్రతిభ కనబర్చిన వారిని డిసెంబరు 29న జరిగే తుది పరీక్షకు ఎంపిక చేస్తారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 9, 10 తరగతుల విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఏటా ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు కౌన్సిల్ కార్యదర్శి కె.రామరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. "ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 30లోపు రూ.200 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. రూ.250 రుసుముతో అక్టోబరు 19 వరకు అవకాశం ఉంది. ప్రతి తరగతిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు పురస్కారంతోపాటు.. రూ.25 వేలు, 15 వేలు, 10 వేల చొప్పున పారితోషికం అందజేస్తాం. 40 మంది ఉత్తమ విద్యార్థులకు వచ్చే ఏడాది హైదరాబాద్‌లో జరిగే సైన్స్ కార్యశాలలో పాల్గొనే అవకాశం కల్పిస్తాం" అని వెల్లడించారు. ఇతర వివరాలకు www.drasraoawardscouncil.org వెబ్‌సైట్‌ని సందర్శించాలని సూచించారు.

ఏఐఆర్, డీడీ ప్రోగ్రామ్ సిబ్బంది సంఘం కార్యవర్గం ఎన్నిక

ఈనాడు, హైదరాబాద్: ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ప్రోగ్రామ్ సిబ్బంది సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్ శ్రీనివాసన్(దూరదర్శన్‌కేంద్రం, పుదుచ్చేరి), కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడిగా సురేష్‌కుమార్(ఆకాశవాణి, దిల్లీ), ప్రధాన కార్యదర్శిగా కె. రష్మి(ఆకాశవాణి,దిల్లీ), తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎస్.ఎ.కె.ఎం.హుస్సైని(ఆలిండియా రేడియో, హైదరాబాద్) ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి వి.గోపీచంద్ ఓ ప్రకటనలో వెల్లడించారు. దేశవ్యాప్తంగా 197 ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల్లో జరిగిన ఈ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో జరిగినట్లు వివరించారు.

వాగు దాటి వైద్యం..! మీ సేవకు వందనం..!

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని బండాల గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించేందుకు మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అప్పయ్య, వైద్య సిబ్బంది బయలుదేరారు. పోచాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనాలు దాటేందుకు వీలులేకుండా పోయింది. రెండు గంటలపాటు నిరీక్షించినా ప్రవాహం తగ్గకపోవడంతో వారంతా జట్టుగా నడుచుకుంటూ వాగును దాటారు. గ్రామానికి వెళ్లి గిరిజనులకు వైద్య సాయం అందించారు.

- న్యూస్‌టుడే, తాడ్వాయి



ఈనాడు

బుసలు కొడుతున్న కసితనం

విషతుల్య సామాజిక వాతావరణంలో, అందమైన బాల్యానికీ నేర స్వభావ మకిలంటుతోంది. నునులేత వయసులోనే రేపటి పౌరులు కొందరు తీవ్ర నేరాలకు తెగబడుతున్న ఉదంతాలు నిశ్చేష్టపరుస్తున్నాయి. తొమ్మిదో తరగతి చదువుతున్న కూతుర్ని అనుచిత మగ స్నేహం వద్దని వారించిన పాపానికి బెంగళూరులో ఓ తండ్రి కన్నబిడ్డ చేతిలోనే కడతేరిపోయాడు. స్నేహితుడితో కలిసి తండ్రిని కత్తులతో పొడిచి చంపి మృతదేహాన్ని పెట్రోలు పోసి తగలబెట్టడానికీ వెనుదీయనంతటి క్రౌర్యం ఆ అమ్మాయిలో గూడుకట్టుకుంది! కొడైకెనాల్ పాఠశాల ఆవరణలో క్రికెట్ ఆడుతూ గొడవపడి తన సహాధ్యాయిని ఓ పదో తరగతి విద్యార్థి కత్తెరతో పొడిచి చంపేశాడు. ఇటీవల మహారాష్ట్రలోని భివాండీ జిల్లాలోనూ అటువంటి దుర్ఘటనే వెలుగు చూసింది. రాజస్థాన్ విశ్వవిద్యాలయానికి చెందిన దాదాపు నలభైమంది మహిళా ప్రొఫెసర్లకు ఫోన్లు చేసి అసభ్యంగా వేధించాడన్న ఆరోపణలపై ఒక కుర్రాణ్ని జైపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పది, పదకొండేళ్ల వయసులోని మైనర్ బాలురు అయిదు సంవత్సరాల బాలికపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టిన దుర్మార్గం గత నెలలో దేశరాజధాని దిల్లీ నగరంలో గగ్గోలు పుట్టించింది. తల్లిని దూషించాడన్న కోపంతో చల్లపల్లి వసతి గృహంలో తనతోపాటు ఉంటున్న మూడోతరగతి పిల్లవాణ్ని చాకుతో హతమార్చిన పదో తరగతి విద్యార్థి దూకుడు, తిరుపతిలో డిగ్రీ, పీజీ విద్యార్థులు మరో కళాశాలలో చదువుతున్నవాణ్ని బీరు సీసాలతో పొడిచి చంపేసిన ఉదంతం, ద్విచక్ర వాహనాలు చోరీచేస్తూ ముగ్గురు బాలురు హైదరాబాద్ పోలీసుల చేజిక్కిన వైనం... తెలుగు గడ్డపై నేరగ్రస్త బాల్యానికి మచ్చుతునకలు. పదేళ్లవాడిపై లైంగిక దాడికి పాల్పడి దారుణంగా హతమార్చిన పదిహేడేళ్ల బాలనేరస్థుడికి రెండు నెలల క్రితం నాంపల్లి కోర్టు జీవితఖైదు విధించడం తెలిసిందే. ఈ నేరగ్రస్త బాలభారతంలో ప్రస్ఫుటమవుతున్నది సామాజిక విలువల ఘోర పతనమే!

ఆడుతూ పాడుతూ విద్యార్జన సాగించాల్సిన వయసులో హత్యలకు తెగబడేంతటి హింసాత్మక ధోరణులు పిల్లల్లో ఎందుకు ప్రబలుతున్నాయి? బాల్య, కౌమార దశల్లోని మాధుర్యం, మానవ సంబంధాల ప్రాముఖ్యం బొత్తిగా తెలియకుండాపోవడం రేపటి తరంలో విపరీత ప్రవర్తనకు ప్రధాన కారణమవుతోంది. నిరంతర హడావుడి జీవనశైలి మూలాన తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడటం, కుటుంబ సభ్యుల చెడు వ్యసనాలు, పరిసరాల్లో హింసాపూరిత వాతావరణం... ఇవన్నీ కలివిడిగా విడివిడిగా పిల్లల సహజసిద్ధ భావోద్వేగాల్ని అణిచేసి కక్ష, ద్వేషం, ప్రతీకార భావనల్ని పెంపొందిస్తున్నాయన్నది మానసిక నిపుణుల ఉమ్మడి మాట. నూనూగు మీసాలైనా రాని మైనర్లూ జల్సాలు, వ్యసనాలకు బానిసలై ముఠాలు కట్టి చోరీల్లో రాటుతేలుతున్నారు. విద్యా సంస్థలు, దుకాణ సముదాయాలున్న ప్రాంతాల్లో యువతుల్ని వేధిస్తూ దొరికిపోతున్నవారిలో 40శాతం మైనర్లేనని 'షీ టీమ్స్' ధ్రువీకరిస్తున్నాయి. లోగడ ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయన నివేదిక- దేశదేశాల్లో దాదాపు అయిదోవంతు బాలలు, యుక్తవయస్కులు రకరకాల కారణాలతో దారితప్పి నేరస్వభావంతో సమాజానికి పెనుభారమవుతున్నట్లు స్పష్టీకరించింది. దేశీయంగానూ బాలబాలికల్లో యువతలో నేరప్రవృత్తి పెచ్చరిల్లుతున్న వేగం దిగ్భ్రాంతపరుస్తోంది. పుట్టుకతో ఏ బిడ్డా దుష్టుడు కాడు. కొన్నేళ్లుగా బహిర్గతమవుతున్న నేరాలు నేరుగా బాలల ఖాతాలో జమ పడుతున్నా- అందుకు ముఖ్య బాధ్యత తల్లిదండ్రులది, ఉపాధ్యాయులది, మౌనంగా మిగిలిపోతున్న సమాజానిది! అసంఖ్యాక బాలలు చెడు వింటూ, చెడు కంటూ, చెడు అంటూ గాడితప్పి దుష్ప్రభావాలకు లోనవుతున్న దశలో- సత్వర దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే, ఏమైపోతుందీ దేశం?

'భారతరత్న' సచిన్ తెందుల్కర్ అభివర్ణించినట్లు- బిడ్డల సరైన ఎదుగుదలతో నవసమాజ నిర్మాణానికి అమ్మ లాలన, నాన్న పాలన, ఆహ్లాదకరమైన పరిసరాలు అత్యంత కీలకమైనవి. నేటి బాలలు ఆనందభరితులుగా, ఆరోగ్యవంతులుగా, వివేకశీలురుగా మారితే భావి భారతావని దృఢతరమవుతుంది. ఒక్క ముక్కలో, బాలభారతమే భాగ్యభారతం! వాస్తవంలో బాల నేరస్థుల్లోని మూడింట రెండొంతుల మంది 16-18 ఏళ్ల వయసులోపువారేనన్న నేరగణాంకాలు, బాల్యం ఎంతటి దురవస్థలో కునారిల్లుతున్నదో కళ్లకు కడుతున్నాయి. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగై, దూరాలు పెరిగి ఇంట్లో ఆప్యాయతానుబంధాలు పుటుక్కున తెగిపోయే దారప్పోగులు కావడంలో- మాదక ద్రవ్యాలు, స్మార్ట్‌ఫోన్లు, అశ్లీల చిత్రాలది తిలాపాపం తలా పిడికెడు. అంతర్జాల విప్లవం దరిమిలా దేశంలోని 8-16 ఏళ్ల వయస్కుల్లో అత్యధికులు సామాజిక ప్రసార మాధ్యమాలకు అలవాటుపడ్డారని, వారిలో అయిదోవంతు పిల్లల్లో విపరీత ధోరణులు చోటుచేసుకుంటున్నాయని అధ్యయనాలు ఎలుగెత్తుతున్నాయి. తొమ్మిదేళ్ల చెల్లెల్ని బలాత్కరించిన పదిహేడేళ్ల అన్న, 'పబ్ జీ' ఆడనివ్వడం లేదన్న కోపంతో సోదరుడి తలను గోడకు బాది కడుపులో కత్తెరతో పొడిచి చంపేసిన పదిహేనేళ్ల తమ్ముడు... విశృంఖల సంస్కృతి తాలూకు విష పర్యవసానాలకు ప్రబల నిదర్శనలు. పసిపిల్లలకు తొలిబడి ఇల్లే. ఆపై దేశభవిత వ్యాన్ని తీర్చిదిద్దే బాధ్యత అందిపుచ్చుకోవాల్సింది తరగతి గదే. రేపటి తరాన్ని పెనువిధ్వంసం బారినుంచి కాపాడేలా వాటిని ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దాల్సిన భూరి కసరత్తు ఇక ఎంతమాత్రం ఉపేక్షించరానిది. స్వేచ్ఛ, రక్షణ, విశ్వాసాలతో కూడిన బాల్యదశ దేశంలో పిల్లలందరికీ విధిగా దఖలుపడేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు కాచుకుంటేనే- బాలభారతం తెప్పరిల్లుతుంది!

ప్రోత్సాహకాలతో మెరుపు వేగం

డాక్టర్ ఎన్.అనంత్

దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవడంపై ప్రజలు, పరిశ్రమల్లో ఉత్కంఠ, ఉత్తేజం వ్యక్తమవుతున్నాయి. ఈ లక్ష్యసాధనకు భారత్‌లో 'ఎలక్ట్రిక్ వాహనాల శీఘ్ర ఉత్పత్తి, వినియోగ పథకం'లో రెండో దశ (ఫేమ్ ఇండియా ఫేజ్ 2)కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2019 ఏప్రిల్ నుంచి మూడేళ్లలో ఈ పథకంపై రూ.10,000 కోట్లు వెచ్చించి 10 లక్షల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, అయిదు లక్షల త్రిచక్ర వాహనాలు, 55,000 నాలుగు చక్రాల వాహనాలు, 7,000 బస్సుల తయారీకి ఊతమివ్వదలచారు. ఈ వాహనాల కోసం ప్రధాన రహదారులపై ప్రతి 25 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఛార్జింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదన. ఎలక్ట్రిక్ వాహన ధరను కొనుగోలుదారు కోసం తగ్గించి, ఆ వ్యత్యాసాన్ని ప్రభుత్వం వాహన ఉత్పత్తిదారుకు చెల్లించాలని ఫేమ్-2 సంకల్పిస్తోంది. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు కిలోవాట్ పై రూ.10,000 నుంచి రూ.20,000 వరకు ఈ విధమైన రాయితీ లభిస్తుంది. దాంతోపాటు కేంద్ర బడ్జెట్‌లో ఎలక్ట్రానిక్ వాహనాల (ఈవీల)పై జీఎస్టీని 12 నుంచి అయిదు శాతానికి తగ్గించారు. ఈవీలు కొనడానికి తీసుకున్న రుణాలపై చెల్లించే వడ్డీలో లక్షన్నర రూపాయలపై ఆదాయ పన్ను తగ్గింపు లభిస్తుంది కూడా.

కాలుష్యానికి కళ్లెం

ఈవీల వినియోగం పెరిగితే మన నగరాలు, పట్టణాల్లో కాలుష్యం తగ్గుతుంది. చమురు దిగుమతులు తగ్గి విదేశ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తి, వినియోగాలు పెరుగుతాయి. దీర్ఘకాలంలో ఇన్ని ప్రయోజనాలు ఉన్నాయి కనుకనే నీతి ఆయోగ్ 2030కల్లా దేశంలో పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాలనే విక్రయించాలని, అందరూ వాటినే వాడాలంటూ కేంద్ర మంత్రివర్గానికి ఒక ప్రతిపాదన పత్రం సమర్పించింది. అదే జరిగితే 5.4 కోట్ల టన్నుల చమురు దిగుమతులను నివారించి, కాలుష్యాన్ని అరికట్టవచ్చునని, వినియోగదారులకు ఇంధన బిల్లులో రూ.17,200 కోట్లు ఆదా అవుతాయని ఆ పత్రం తెలిపింది. ఇంకా ఈవీల వినియోగం వల్ల 84.6 కోట్ల టన్నుల కర్బన ఉద్గారాలను నివారించగలుగుతాం. ప్రభుత్వం విధానపరమైన ప్రోత్సాహకాలను ఇస్తే ప్రైవేటు కార్లలో 30 శాతం, వాణిజ్య వాహనాల్లో 70 శాతం, బస్సుల్లో 40 శాతం, ద్విచక్ర, త్రిచక్ర వాహనాల్లో 80 శాతం 2030కల్లా ఈవీలుగా మారిపోతాయని నీతి ఆయోగ్ లెక్కగట్టింది. వాహన రంగంలో ఈ విధమైన రూపాంతరీకరణను సాధించాలంటే ప్రభుత్వం చేయాల్సింది చాలానే ఉంది. ప్రపంచంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య 2030కల్లా 12.5 కోట్లకు చేరుతుందని 2017లో అంతర్జాతీయ ఇంధన సంస్థ అంచనా వేసింది. 2018లో అమ్ముడైన ఈవీల సంఖ్య కేవలం 21 లక్షలని గుర్తుంచుకుంటే, ఆ అంచనా ఎంతవరకు నిజమవుతుందని సందేహం వస్తుంది. నేడు ప్రపంచంలో ఈవీ విక్రయాల్లో 56 శాతం వాటాతో చైనా అగ్రస్థానంలో ఉంది. తదుపరి మూడు స్థానాలను ఐరోపా, అమెరికా, జపాన్‌లు ఆక్రమిస్తున్నాయి. అన్ని దేశాల్లో కలిపి 56 లక్షల వాహనాలు ఉంటే, వాటిలో 26 లక్షలు ఒక్క చైనాలోనే తిరుగుతున్నాయి. మొత్తం ఈవీ విక్రయాల్లో 90 శాతం పైన చెప్పుకొన్న నాలుగు మార్కెట్లలోనే జరుగుతున్నాయి.

ఒక దార్శనిక పత్రం విడుదల చేసి, ఏవో కొన్ని ప్రోత్సాహకాలను ప్రకటించగానే పని జరగదు. వాహన వినియోగ సంస్కృతిలో మార్పు రావాలి. వాస్తవిక దృక్పథంతో ప్రభుత్వం ముందుకు కదలాలి. ప్రస్తుతం భారతదేశంలో ఈవీల విక్రయం చాలా స్వల్పం. 2018-19లో మొత్తం ఆటోమొబైల్ విక్రయాలు 2.62 కోట్లయితే, వాటిలో 2.11 కోట్లు ద్విచక్ర వాహనాలే. ప్రయాణికుల వాహనాలు 33.77 లక్షలు, వాణిజ్య



విద్యుత్ వాహనాలు - విక్రయాల వృద్ధికి మార్గాలు

వాహనాలు 10.07 లక్షలు, త్రిచక్ర వాహనాలు ఏడు లక్షలు. భారత్‌లో అమ్ముడయ్యే ప్రయాణికుల కార్లలో 99 శాతం చిన్న, మధ్య రకాలకు చెందినవి. 2018-19లో భారత్‌లో 7,59,600 ఈవీలు విక్రయమవగా అందులో 1,26,000 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, 6,30,000 త్రిచక్ర వాహనాలు, 3,600 ఎలక్ట్రిక్ ప్రయాణికుల వాహనాలు ఉన్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు విజృంభించాలంటే ప్రజల అలవాట్లు, అభిరుచులు మారాలి. పెట్రోలు, డీజిల్ వంటి కాలుష్య కారక శిలాజ ఇంధనాలను వదలి ఎలక్ట్రిక్ వాహనాలకు మళ్ళాలి. అందుకు అందుబాటు ధరలు, వినియోగ సౌలభ్యం, ప్రోత్సాహక యంత్రాంగం, వాహన వినియోగ సంస్కృతిలో మార్పు వంటివి ఎంతో దోహదం చేస్తాయి. భారతీయ వినియోగదారులకు ధర గురించి పట్టింపు జాస్తి. కానీ, దేశంలో ఇప్పటికీ ఈవీ ధరలు వారికి అందుబాటులోకి రాలేదు. మామూలు మోటారు వాహనాలను భారీ సంఖ్యలో ఉత్పత్తి చేస్తారు కాబట్టి, వాటి ఉత్పత్తి వ్యయం తద్వారా అమ్మకం ధరలు తగ్గుతాయి. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీల) ఉత్పత్తి ఇంకా అంతటి భారీస్థాయిని అందుకోలేదు కాబట్టి, ధరలు దిగిరావడం లేదు. ఈవీలు రోడ్లపైకి వచ్చాక వాటికి తరచూ ఛార్జింగ్ చేస్తుండాలి. కానీ, భారత్‌లో విద్యుత్ ప్రసార, పంపిణీలు సక్రమంగా ఉండవు కనుక ఈవీల ఛార్జింగ్‌లో తేడాలు వచ్చి మొత్తం వాహనమే దెబ్బతినిపోవచ్చు. ఈ వాహనదారుల కోసం సరైన ఒల్టేజీతో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసే ఛార్జింగ్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ఈవీల విక్రయానంతర సేవలకు సర్వీసు కేంద్రాలను విరివిగా నెలకొల్పాలి. ఈవీల వాడకం విస్తరించకపోవడానికి ప్రధాన కారణం రీఛార్జింగ్ సౌకర్యాల కొరతే.

అధిగమించాల్సిన సమస్య

నేడు మహా ఖరీదైన ఎలక్ట్రిక్ కారు మాత్రమే ఒకసారి ఛార్జింగ్ చేస్తే 460 కిలోమీటర్లు తిరుగుతుంది. జర్మనీలో 600 కిలోమీటర్లు తిరిగే కారును తయారు చేశారు కానీ, దాని ధర చుక్కల్లోనే ఉంది. భారతీయ విపణిలో అంతటి ఖరీదైన కార్లు కొనగలిగేవారు చాలా తక్కువమంది ఉంటారు. అదీ కాకుండా భారత్‌లో ఎలక్ట్రిక్ వాహన బ్యాటరీల ధర చాలా ఎక్కువ. ఈవీల వినియోగం భారీగా పెరిగితే వీటి ధర దిగివస్తుంది. ఆ రోజు రావాలంటే ప్రభుత్వం రీఛార్జింగ్ కేంద్రాల్లో ఛార్జింగ్ ఖాళీ అయిన బ్యాటరీలను తీసుకుని పూర్తిగా ఛార్జి చేసిన బ్యాటరీలను మార్చుకునే సౌలభ్యాన్ని కల్పించాలి. అప్పుడు ఈవీలు ఛార్జింగ్ కేంద్రాలకు వచ్చి పాత బ్యాటరీల స్థానంలో కొత్త బ్యాటరీలు అమర్చుకుని శీఘ్రంగా ముందుకు కదలగలుగుతాయి. అందుకు వీలుగా ప్రభుత్వం సరైన ప్రమాణాలతో బ్యాటరీల తయారీ, పంపిణీ జరిగేలా పూచీకత్తు వహించాలి. ఈవీ బ్యాటరీల తయారీకి ముడిసరకులు సమీకరించడమూ సమస్యాత్మకమే. ఈ బ్యాటరీల్లో లిథియం, కోబాల్ట్, నికెల్, రాగి లోహాలు వాడతారు. వీటిలో లిథియం లేనిదే బ్యాటరీ తయారుకాదు. ప్రతి ఈవీ ధరలో 40-50 శాతాన్ని లిథియం అయాన్ బ్యాటరీలే ఆక్రమిస్తాయి. ఈ లోహాలను చాలావరకు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవలసిందే. లిథియం నిక్షేపాలు ప్రధానంగా ఆస్ట్రేలియా, చిలీ, అర్జెంటీనా, చైనా, జింబాబ్వేలలోనే దొరుకుతున్నాయి. అమెరికాలో కేవలం రెండు శాతం లిథియం నిక్షేపాలు ఉన్నాయి. ఇతర దేశాల నుంచి భారత్ లిథియం కొనుగోలు చేద్దామనుకున్నా అది అంత సులువు కాదు. కారణం- చైనా ఇతర దేశాల్లోని లిథియం నిక్షేపాల కొనుగోలుకు ఇప్పటికే రూ.30,000 కోట్ల పెట్టుబడి పెట్టడమే. 2030 కల్లా ప్రపంచ లిథియం సరఫరాలో 60 శాతాన్ని చైనా తన గుప్పిట్లోకి తీసుకుంటుందని అంచనా. ప్రపంచ కోబాల్ట్ నిక్షేపాల్లో 60 శాతం కాంగోలో ఉన్నాయి. ఆ దేశం నిరంతరం అంతర్గత కల్లోలంలో మునిగితేలుతోంది. స్వదేశంలో, విదేశాల్లో లిథియం, కోబాల్ట్ నిక్షేపాల నికర సరఫరాకు భారత్ ఏర్పాట్లు చేసుకోకపోతే, ఇప్పుడు చమురు దిగుమతి చేసుకొంటున్నట్లు రేపు చైనా నుంచి ఈవీ బ్యాటరీలను దిగుమతి చేసుకోవలసి వస్తుంది. చైనాతో మనకు ఉన్న సమస్యల రీత్యా అది ఎంతమాత్రం అభిలషణీయం కాదు.

భారతీయ వినియోగదారులు హోదా కోసం, అవసరం కోసం మోటారు వాహనాలను కొంటారు. మహా ఖరీదైన వాహనాలను కొనడం చాలామందికి ఒక ఫ్యాషన్. ఎలక్ట్రిక్ కార్లు, ద్విచక్ర వాహనాలను కొనడం ఒక అవసరంగా, హోదా చిహ్నంగా జనం భావించేట్లు చేస్తే- ఈవీల వినియోగం ఊపందుకొంటుంది. దీనికి ప్రభుత్వం, పరిశ్రమ, అడ్వర్టయిజింగ్ రంగాలు సమన్వయంగా పనిచేయాలి. చివరగా ఈవీల వినియోగం పెరిగితే మామూలు మోటారు కార్లు, స్కూటర్లు, మోటారు సైకిళ్ల అమ్మకాలు పడిపోతాయి. అది మోటారు వాహన పరిశ్రమలో భారీ ఉపాధి నష్టానికి దారితీస్తుంది. ప్రస్తుతం ఆటోమొబైల్ పరిశ్రమలో 20 లక్షలమంది ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారు. చమురు మార్కెటింగ్ కంపెనీల్లో మరో రెండు లక్షలమంది ఉపాధి పొందుతున్నారు. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, నిర్వహణకు సంబంధిత నైపుణ్యాలు కలిగిన సిబ్బంది అవసరపడతారు. అంటే, సంప్రదాయ ఆటో పరిశ్రమలో ఉపాధి విచ్ఛిత్తి జరగవచ్చు. కాబట్టి, ఆటో కార్మికులకు కొత్త నైపుణ్యాలు అబ్బించాలి. ఆధునిక ఈవీ పరిశ్రమలో కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వస్తే, పాత ఆటో పరిశ్రమలో ఉన్న ఉద్యోగాలు ఊడిపోతాయి. రెండింటినీ సమతూకత పరచడానికి కొత్త ఈవీ కార్మికుల సరసన పాత ఆటో కార్మికులకూ ఉపాధి అవకాశాలు పెంచాలి.

(రచయిత- ఆర్థిక, సామాజిక రంగ నిపుణులు)

రీఛార్జింగ్‌తో తంటాలు

ఒకసారి కారు ట్యాంకులో పూర్తిగా పెట్రోలు కానీ, డీజిల్ కానీ నింపితే సుమారు 250-400 కిలోమీటర్ల దూరం పయనించవచ్చు. అంత పెట్రోలు నింపడానికి కేవలం అయిదు నుంచి 10 నిమిషాలు పడుతుంది. అదే ఎలక్ట్రిక్ వాహనానికి రీఛార్జి చేయాలంటే సగటున మూడు గంటల సమయం పడుతుంది. రీఛార్జి చేశాక అది కేవలం 160 కిలోమీటర్ల దూరం తిరుగుతుంది. కొన్ని ఈవీలకు వేగంగా రీఛార్జి చేయడానికి 35-40 నిమిషాలు పడుతుంది. నెమ్మదిగా రీఛార్జి చేయాలంటే ఎనిమిది గంటలు పడుతుంది. నగరాలు, పట్టణాల్లో మధ్యతరగతి వారు కారులో రోజుకు 50 కిలోమీటర్లు తిరుగుతారనుకొందాం. వారి కారులో ఒకసారి పెట్రోలు లేక డీజిల్‌ను నింపితే 7-10 రోజులు తిరగవచ్చు. అదే ఎలక్ట్రిక్ వాహనమైతే ప్రతి మూడు, నాలుగు రోజులకు ఒకసారి రీఛార్జి చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన రోజుకు 250 నుంచి 400 కిలోమీటర్ల దూరం తిరిగే ట్రక్కులు, ఇతర వాణిజ్య వాహనాల రీఛార్జింగ్ ఎంత వ్యయప్రయాస భరితమో అర్థం చేసుకోవచ్చు.

గుప్పిట పట్టే కుయత్నం

అయిదేళ్లకోసారి సామాన్యుడు వేసే ఓటు ఎంత బలమైనదో, సమాచార హక్కు చట్టం మేరకు ప్రజలకు దఖలు పడిన ఆయుధమూ అంతే శక్తిమంతమైనది. రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలు వ్యవహారాలు దేశభద్రతకు సంబంధించినవి కాబట్టి వివరాలను గోప్యంగా ఉంచాలని ప్రభుత్వం భావించింది. దీనికి సంబంధించి దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఆ వాదనను తోసిపుచ్చింది. విమానాల కొనుగోళ్లకు సంబంధించిన పత్రాలు దేశ ప్రజలకు అందుబాటులో ఉంచడం సమాచార హక్కు నిబంధన ప్రకారం ప్రభుత్వ బాధ్యతని స్పష్టీకరించింది. దీనివల్ల పాలనకు సంబంధించిన ఎటువంటి సమాచారమైనా ప్రభుత్వం నుంచి పొందగలిగే హక్కు ప్రజలకు లభించింది.

కేంద్ర ప్రభుత్వం 2016లో పెద్దనోట్లు రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి రిజర్వు బ్యాంకు అంగీకారం తెలిపిందా లేదా అనే విషయాన్ని ప్రభుత్వం గోప్యంగా ఉంచింది. దీనిపై సహ చట్టం కింద వ్యాజ్యం దాఖలైంది. దానికి సమాధానమిస్తూ పెద్దనోట్ల రద్దుకు అనుమతి ఇచ్చినప్పటికీ, ప్రభుత్వ నిర్ణయానికి అసమ్మతినీ తెలియజేశామని రిజర్వు బ్యాంకు 2019 ఫిబ్రవరిలో తెలిపింది.

ఆధార్ కార్డు ఆధారంగా నాలుగు కోట్ల నకిలీ రేషన్ కార్డులను గుర్తించి, వాటిని ప్రభుత్వం తొలగించిందని 2017 ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంటులో ప్రకటించారు. దీనిపై సహచట్టం కింద వ్యాజ్యం దాఖలైంది. తొలగించిన నకిలీ రేషన్ కార్డుల సంఖ్య నాలుగు కోట్లు కాదని, అది 2.30 కోట్లని నిర్ధారణైంది. 2015 ఫిబ్రవరిలో అప్పటి రిజర్వు బ్యాంకు గవర్నరు డాక్టర్ రఘురాం రాజన్ ప్రధాన మంత్రి కార్యాలయానికి ప్రభుత్వరంగ బ్యాంకుల్లో రుణాల ఎగవేతదారులుగా అనుమానితులైన రాజకీయ నేతల పూర్తి వివరాలు అందజేశారు. ఆ వివరాలను బహిరంగపరచాలని సహ చట్టం కింద ప్రధాన మంత్రి కార్యాలయానికి 2018 నవంబరులో ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలవద్ద ఉన్న పాలనాపరమైన సమాచారాన్ని ఆధారాలతో సహా రాబట్టే అవకాశం సహ చట్టం వల్ల ప్రజలకు ఏర్పడింది. రాజకీయకోణంలో ప్రభుత్వాలు చేసే ప్రచారాల్లోని నిజానిజాలు ప్రజలు తెలుసుకోవడానికి ఈ చట్టం ఆయుధంగా ఉపయోగపడుతుంది. వీటివల్ల ప్రభుత్వాల్లో జవాబుదారీతనం పెరిగి బాధ్యతాయుతంగా నడచుకొనే పరిస్థితులు వస్తాయి. రాజకీయ నాయకులు ఎన్నికల కమిషన్‌కు సమర్పించే వ్యక్తిగత (ఆస్తులు, అప్పులు, విద్యార్హతలు, నేరచరిత్ర తదితర)వివరాల్లో లొసుగులుంటే, వాస్తవాలను ధ్రువీకరించుకోవడానికి ఈ చట్టం ప్రజలకు ఉపకరిస్తుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలోని కొందరు మంత్రులతో పాటు ప్రధాన మంత్రి పైనా ఈ విషయంలో (ముఖ్యంగా వారి విద్యార్హతలకు సంబంధించి) సహ చట్టం కింద వ్యాజ్యం దాఖలు కావడం, వీటిపై మళ్ళీ న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు వేయడం గమనార్హం.

రాజకీయ పార్టీలు తాము సేకరించిన పార్టీ విరాళాల వివరాలు తెలియజేయాలనే వాదన తలెత్తడంతో, ఈ ఇబ్బందికర పరిస్థితి నుంచి బయటపడటానికి 2018 బడ్జెట్‌లో ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టారు. వాటి ద్వారా

సహచట్టంపై క్రీనీడలు

రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చే దాతల వివరాలు గోప్యంగా ఉంచుతారు. దీన్ని వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాలు న్యాయస్థానంలో వ్యాజ్యం దాఖలు చేశాయి. రాజకీయ పార్టీలూ సహ చట్టం పరిధిలోకి వస్తాయని 2013 జూన్‌లో సమాచార కమిషనర్ తీర్మానించారు. ఎలక్షన్ కమిషన్ ఈ వాదనను తోసిపుచ్చింది. 2018 మార్చిలో పార్లమెంటులో చట్టాలను సవరించి, పార్టీలు తమకు వచ్చిన విరాళాల వివరాలను గోప్యంగా ఉంచవచ్చని, పైగా 1976 నుంచి విదేశాల్లో పార్టీలు సేకరించిన విరాళాల వివరాలూ రహస్యంగా ఉంచవచ్చని తీర్మానించారు. రాజకీయ పార్టీల నేతలంతా కుమ్మక్కై సహ చట్టం పరిధి నుంచి తప్పించుకోవడానికి చేసిన ఈ చట్ట సవరణలను నిరసిస్తూ ప్రజాసంఘాలు న్యాయస్థానంలో వ్యాజ్యం దాఖలు చేశాయి.

ప్రభుత్వాలకు, రాజకీయ నాయకులకు సహ చట్టం వల్ల జవాబుదారీతనం పెరగడం, ప్రజల్లో అవగాహన ఏర్పడి ప్రజలు, ప్రజాసంఘాలు వ్యాజ్యాలు వేస్తున్నాయి. ఈ పరిణామం ప్రభుత్వాలకు, రాజకీయ నాయకులకు ఇబ్బందికరంగా మారిందనడంలో సందేహం లేదు. సహ చట్టంలో చేసిన సవరణలను 2019 జులై 26న పార్లమెంటులో ఆమోదించారు. ఈ సవరణల వల్ల చట్టాన్ని అమలు చేసే ప్రధాన సమాచార కమిషనర్, కేంద్ర, రాష్ట్రాల సమాచార కమిషనర్ల నియామకాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వెసులుబాటు పొందింది. 2005లో తొలిసారి చట్టం ఏర్పడినప్పుడు ప్రధాన సమాచార కమిషనర్, సమాచార కమిషనర్ల నియామకాలు, వారి పదవీకాలం, వేతనాలు వీటన్నింటినీ ఎలక్షన్ కమిషనర్ల పదవులతో సమానంగా నిర్ణయించారు. దీనివల్ల వారు స్వతంత్రంగా రాజకీయ, ప్రభుత్వపరమైన ఒత్తిళ్లకు గురికాకుండా నిర్భయంగా తమ విధులు నిర్వర్తించే అవకాశం ఉంటుందని తొలుత చట్ట సభలో భావించారు. ఏకు మేకైనట్లు ప్రభుత్వాలకు, రాజకీయ నాయకులకు ఈ చట్టం ఇబ్బందికరంగా మారడంతో వారి నియామకాల నిబంధనలను సడలించారు. దీంతో ప్రధాన సమాచార కమిషనర్, కేంద్ర, రాష్ట్రాల సమాచార కమిషనర్ల నియామకాలు, పదవీకాలం, వేతనాల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వెసులుబాటు పొందింది. దీనివల్ల సమాచార కమిషనర్లు తమ స్వయంప్రతిపత్తిని కోల్పోయి ఒత్తిళ్ళకు తలొగ్గి ప్రభుత్వాలకు అనుగుణంగా వ్యవహరించే ప్రమాదం ఉంది. తద్వారా సహ చట్టం కోరలు తీసిన పాములా మారే అవకాశం ఉంది. న్యాయస్థానాలు చాలా సందర్భాల్లో ఈ చట్టం ప్రజల ప్రాథమిక హక్కు కిందికి వస్తుందని పేర్కొన్నాయి. దీన్ని సవరించడంవల్ల ఆ హక్కుకు భంగం వాటిల్లుతుందన్న వాదన ముమ్మాటికీ నిజం. సమాచార కమిషనర్ల పదవుల ప్రస్తావన రాజ్యాంగంలో లేకపోవడం వల్లఅవి రాజ్యాంగ పదవుల కిందికి రావని, చట్టపరమైనవి కాబట్టి చట్ట సవరణ చేయవచ్చని కేంద్ర ప్రభుత్వం వాదిస్తోంది. న్యాయస్థానం ఈ సవరణలను ఆమోదిస్తుందా, తిరస్కరించి పౌరుల హక్కులను పరిరక్షిస్తుందా అన్నది వేచిచూడాలి!

– బీఎన్‌వీ పార్థసారథి

ఈనాడు లేఖలు

దభోల్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

మూఢవిశ్వాసాలను దునుమాడి, సమాజానికి మార్గం చూపించే హేతువాదులను, మేధావులను... మతోన్మాద శక్తులు మట్టుపెడుతున్న పరిస్థితుల్లో దేశంలోని అభ్యుదయశక్తులు సమైక్యంగా ప్రతిఘటించాల్సి ఉంది. మూఢనమ్మకాల నిర్మూలన చట్టంకోసం అలుపెరుగని పోరాటం చేసిన సామాజిక కార్యకర్త, రచయిత, మహారాష్ట్రకు చెందిన డాక్టర్ దభోల్కర్ హత్యకు గురై ఆరేళ్ళయింది. అదే తరహాలో హేతువాద నాయకుడు గోవింద పన్సారేను, కర్ణాటకలో ప్రొఫెసర్ ఎం.ఎం.కల్బుర్గిని, గౌరీ లంకేష్‌ను మతోన్మాదులు పొట్టనబెట్టుకున్నారు. హేతువాద భావజాలంతో 1989లోనే డాక్టర్ దభోల్కర్ 'మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలన సమితి'ని ఏర్పాటు చేశారు. మూఢ

అదెట్టా!

కళ్లజోడే కెమెరా

చూసింది చూసినట్టుగా 3డీలో చిత్రీకరణ చేయాలంటే? అబ్బో.. దానికి తగిన కెమెరా సెటప్ అంతా ఓ రేంజ్ అనుకోనక్కర్లేదు. సింపుల్‌గా కళ్లజోడు పెట్టుకుని షూట్ చేయొచ్చు. స్నాప్ సంస్థ అలాంటి కళ్లజోడునే అందుబాటులోకి తెచ్చింది. పేరు 'స్పెక్టకిల్స్ 3'. కళ్లజోడుకి రెండు వైపులా రెండు హెచ్‌డీ కెమెరాల్ని నిక్షిప్తం చేశారు. మనం ఎలాగైతే చూస్తామో అదే యాంగిల్‌లో అగ్మెంటెడ్ రియాలిటీ సపోర్టుతో ఫొటోలు, వీడియోల్ని 3డీలో షూట్ చేయొచ్చు. ఇలా చిత్రీకరించిన వాటిని స్మార్ట్‌ఫోన్‌కి సింక్ చేసేలా, కళ్లజోడు వైర్‌లెస్ నెట్‌వర్క్‌తో పని చేస్తుంది. మీకు నచ్చినవాటిని 'స్నాప్‌ఛాట్' వేదికగా ప్రపంచంతో పంచుకోవచ్చు. అందుకు తగిన సపోర్టు సిస్టమ్ కళ్లజోడుకి బిల్ట్‌ఇన్‌గా ఏర్పాటు చేశారు.

● ధర రూ.27,000

కలే..వాస్తవ 'మాయే'!

కల్పనగా వాస్తవం. వాస్తవంగా కల్పన. అవును.. కాల్పనిక వాస్తవికత- వర్చువల్ రియాలిటీ మన కళ్ల ముందు ఇలాంటి మాయే చేస్తుంది. కలయో, వైష్ణవ మాయో అనిపిస్తూ సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తుతుంది. ఒకప్పుడు కాల్పనిక వాస్తవికత అంటే సైన్స్ ఫిక్షన్. అది వాస్తవరూపం ధరించటమే కాదు.. అన్ని రంగాలనూ శరవేగంగా చుట్టబెడుతోంది. వీడియో గేమ్స్‌తో వినోదాన్ని పంచటంతో మొదలై.. విద్య, ఇంజినీరింగ్, స్థిరాస్తి, చిల్లర వర్తకం, వీడియో నిర్మాణం వంటి వాటిని దాటుకొని.. ఆరోగ్యరంగానికీ విస్తరించింది. రకరకాల సమస్యల చికిత్సకు చేయూతనూ అందిస్తోంది!

వర్చువల్ రియాలిటీ

సాంకేతిక పరిజ్ఞానానికి బాధలేం తెలుసు? భయాలేం తెలుసు? ఎదుటివాళ్ల బాగోగులు అర్థమవుతాయా ఏం? వైద్యరంగంలో వర్చువల్ రియాలిటీ (ఆగ్మెంటెడ్ రియాలిటీ) అనగానే మెదిలే అనుమానాలెన్నో. వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ కాల్పనిక వాస్తవికత కొత్త పుంతలు తొక్కుతోంది. వైద్య విద్యార్థులకు సానుభూతిని బోధిస్తోంది. నొప్పులు తగ్గటానికి, భయాలను పోగొట్టటానికి.. చివరికి అంతిమ ఘడియల్లో ఆఖరి కోరికలను తీర్చుకోవటానికీ ఉపయోగపడుతోంది. నిజానికి కాల్పనిక వాస్తవికత 1965లోనే వైద్యరంగంలో అడుగిడింది. ఎముకల సమస్యకు సరైన చికిత్సను నిర్ణయించటానికి రాబర్ట్ మాన్ కాల్పనిక వ్యవస్థను పరిచయం చేశారు. ఎముకల వైద్య విద్యార్థులకు శిక్షణ ఇవ్వటానికీ దీన్ని ఉపయోగించారు. అక్కడ్నుంచి వెనుదిరిగి చూసింది లేదు. సంక్లిష్టమైన శరీర భాగాల నిర్మాణాన్ని 3డీ, 4డీల్లో కళ్ల ముందు ఆవిష్కరిస్తూ సరికొత్త బోధనా రీతులకు శ్రీకారం చుట్టింది. మెదడు శస్త్రచికిత్స దగ్గర్నుంచి రక్తనాళాలను అతికించటం వరకూ అన్ని విద్యలనూ సులభంగా నేర్చుకోవచ్చని నిరూపించింది. స్మార్ట్‌ఫోన్, వీఆర్ హెడ్‌సెట్ ఉంటే చాలు. ఎన్నెన్నో సమస్యలకు చికిత్స చేయొచ్చనే ఆశలనూ రేకెత్తిస్తోంది.

కదలికలు మెరుగు

మెదడుకు దెబ్బ తగలటం, పక్షవాతం, పార్కిన్సన్స్ వంటి జబ్బుల్లో శరీర కదలికలు అస్తవ్యస్తమవుతుంటాయి. వీటిని పునరుద్ధరించటానికి వ్యాయామాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇందుకోసమే స్విట్జర్లాండ్ కంపెనీ మైండ్‌మేజ్ ఓ వర్చువల్ రియాలిటీ పరిజ్ఞానంతో వినూత్న హెడ్‌సెట్‌ను రూపొందించింది. దీన్ని ధరించగానే ఆయా వ్యక్తుల ప్రతిరూపాలు 3డీ ఆకారాల్లో కనబడతాయి. ఆరోగ్యంగా ఉన్న భాగాలను కదిలించినప్పుడు ప్రతిరూపంలో పక్షవాతానికి గురైన భాగాలూ కదులుతాయి. ఉదాహరణకు- ఎడమ చేయి చచ్చుబడింది. కుడిచేయి బాగానే ఉందనుకుందాం. కుడిచేయిని కదిల్చినప్పుడు ప్రతిరూపం ఎడమ చేయి కదులుతుంది. ఇది ఎడమ చేయి కదలికలకు తోడ్పడే మెదడులోని భాగాలు ప్రేరేపితం కావటానికి దోహదం చేస్తుంది. ఇలా క్రమంగా కదలికలు మెరుగు పడటానికి వీలు కల్పిస్తుంది. ఇలాంటి ప్రేరేపణలను వినోదాత్మకంగా మార్చటం మీదా పరిశోధకులు దృష్టి సారించారు. కాల్పనిక ఆకాశం నుంచి నాణేలు కిందపడి పోవటం లాంటి ఆటలనూ సృష్టిస్తున్నారు. ఆ నాణేలను పట్టుకోవటానికి అప్రయత్నంగానే ముందుకు కదిలేలా చేయటం వీటి ఉద్దేశం.

సానుభూతి బోధన

అనుకోకుండా క్యాన్సర్ బయటపడింది. లేదూ ఎవరో హఠాత్తుగా చనిపోయారు. రోగికి గానీ బంధువులకు గానీ ఇలాంటి విషయాలను చెప్పటం డాక్టర్లకు ఎప్పుడైనా సవాలే. ఎదుటివారు ఉన్నట్టుండి బాధలో కూరుకుపోకుండా, నెమ్మదిగా వివరించటానికి ఎంతో మనో నిబ్బరం కావాలి. సానుభూతి చూపాలి. ఇవి అనుభవం మీద గానీ అబ్బేవి కావు. వీటిని అలవరచుకోవటానికి మెడికల్ సైబర్‌వర్లర్స్ ఇంక్ పరిశోధకులు ఎంపథిక్-వీఆర్ పరిజ్ఞానాన్ని రూపొందించారు. అచ్చం మనలాగే భావోద్వేగాలతో స్పందించే మానవ ప్రతిరూపాలతో మాట్లాడుతూ.. నొప్పించని విధంగా విషయాన్ని వివరించటం ఇందులోని ప్రత్యేకత. ఇలా ఇది వాస్తవ పరిస్థితుల్లో ఎలా నడుచుకోవాలో నేర్పిస్తుందన్నమాట.

టీకా నొప్పి తెలియనివ్వకుండా..

టీకాలంటే పిల్లలకు చాలా భయం. సిరంజీని చూడగానే హడలెత్తిపోతుంటారు. మరి వీరిని సముదాయించి, నొప్పి తెలియని విధంగా టీకా ఇవ్వాలంటే? హెర్మిస్ పార్‌డిని ల్యాబోరేటరీ ఆధ్వర్యంలో రూపొందిన వీఆర్ వ్యాక్సిన్ దీనికి చక్కటి పరిష్కారం చూపుతుంది. పిల్లలు తమ తలకు వీఆర్ హెడ్‌సెట్‌ను తగిలించుకోగానే అందమైన రాజ్యాన్ని కాపాడే కార్టూన్‌లో ఓ రాకుమారి ప్రత్యక్షమవుతుంది. అక్కడ 'తమ' కదిలే చేతికి ఆమె మహిమ గల పట్టీని చుడుతుంది. దీంతో రాజ్యాన్ని కబళించాలని చూసే రాక్షసుడు భగ్గున మండిపోతాడు. సరిగ్గా అప్పుడే డాక్టర్ టీకా ఇచ్చేస్తాడు. టీకా భయం, నొప్పి హుష్ కాకి అవుతాయి.

భయానికి కళ్లెం

కొందరికి సాలీడు, బల్లులంటే తెగ భయం. కొందరు బొద్దింక కనబడితే చాలు.. వణికిపోతారు. కొందరికి ఎత్తులు ఎక్కాలంటే భయం. ఇలాంటి భయాలు, ఆందోళనలకూ కాల్పనిక వాస్తవికత పరిష్కారం చూపుతోంది.

భయం, ఆందోళన కలిగించే ప్రాంతాలను, పరిస్థితులను కృత్రిమంగా సృష్టించి.. వాటిల్లో తిరుగాడేలా చేసి.. భయాలను పోగొట్టటం దీని ప్రత్యేకత. స్పెయిన్, అమెరికా సంయుక్త కంపెనీ సీయస్ ఇలాంటి వీఆర్ పరిజ్ఞానాన్నే రూపొందించింది. వర్చువల్ బెటర్ అనే కంపెనీ సైతం తీవ్రమైన ప్రమాదాలు, బాధాకరమైన ఘటనల అనంతరం తలెత్తే ఒత్తిడి సమస్యలను తగ్గించటానికి ప్రత్యేక పరిజ్ఞానాన్ని తయారుచేసింది. గాయాలు, బాధల నుంచి కోలుకోవటానికి సైనికులకు తోడ్పడేందుకు సదరన్ కాలిఫోర్నియా యూనివర్సిటీ బ్రేవ్‌మైండ్ అనే పరిజ్ఞానాన్నీ తీసుకొచ్చింది. వీటన్నింటి లక్ష్యం ఒక్కటే. వాస్తవ పరిస్థితుల కల్పనలతో నిజమైన భయాలను పోగొట్టటమే.

కాన్పు తేలిక, నొప్పి దూరం

కాన్పు అంటేనే పునర్జన్మ. ఆ నొప్పులను భరించటం అంత తేలిక కాదు. వీటిని తెలియనీయకుండా చేయగలిగితే? ఇందుకోసం మందులు, మత్తుమందులు లేక కాదు. వీటితో అవసరం లేకుండా వీనులకు, కనులకు విందు చేసే శబ్దాలు, దృశ్యాలతో కనికట్టు చేయటం మీదా పరిశోధకులు దృష్టి సారించారు. ఈ దిశగా కాల్పనిక వాస్తవికత పరిజ్ఞానాన్ని కొత్త పుంతలు తొక్కించారు. ఆ మధ్య ఎరిన్ బ్రాటన్ మార్టుకి అనే ఆవిడ కాల్పనిక వాస్తవిక పరిజ్ఞానంతో పురుడు పోసుకొని చరిత్ర సృష్టించారు. కాన్పు కావటానికి రెండు గంటల ముందు నుంచే వీఆర్ హెడ్‌సెట్‌ను ధరించి.. సముద్ర తీరాల దృశ్యాలు, మనసుకు హాయినిచ్చే మాటల్లో మునిగిపోయారు. ఇలా ఆమె కాన్పు నొప్పులు తెలియకుండా సంతానాన్ని కనేశారు. దీర్ఘకాల నొప్పులతో బాధపడేవారికీ వీఆర్ పరిజ్ఞానం ఎంతో ఉపశమనం కలిగిస్తోంది. లాస్ ఏంజెలిస్‌లోని సెడార్స్‌సినాయ్ హాస్పిటల్స్ పరిశోధకులు రూపొందించిన బేర్ బ్లాస్ట్ పరిజ్ఞానమే దీనికి నిదర్శనం. ఇది నొప్పి భావనను 25% వరకూ తగ్గిస్తుండటం విశేషం.

ఆఖరి కోరికలూ తీరుస్తుంది

జీవితంలో ఎన్నెన్నో కోరికలు. అన్నీ తీరాలని లేదు. మరణానికి చేరువైన సమయంలో వీటిని తలచుకొని బాధపడుతూ ఉంటారు కూడా.

నయం కాని జబ్బుల బారినపడి.. సాంత్వన చికిత్స (పాలియేటివ్ కేర్) తీసుకుంటూ.. మరణానికి దగ్గరలో ఉన్నామని తెలిసినవారి గురించి చెప్పాల్సిన పనేలేదు. ఇలాంటి వారికి ఊరట కలిగించేందుకు టొరంటోకు చెందిన డేవిడ్ పార్కర్ అనే ఐటీ నిపుణుడు ఓ వర్చువల్ రియాలిటీ వ్యవస్థను రూపొందించారు. దీన్ని ధరిస్తే నచ్చిన చోటుకు వెళ్లి విహరించొచ్చు. ఆఫ్రికా అడవుల అందాలనైనా, ధ్రువాల వద్ద కాంతులనైనా.. దేన్నయినా వీక్షించొచ్చు. కాల్పనిక అవతారం ధరించి స్కూబా డైవింగ్ సైతం చేయొచ్చు. టొరంటోలోని బ్రిడ్జిపాయింట్ హెల్త్ అండ్ మౌంట్ సినాయ్ హాస్పిటల్‌లో సాంత్వన చికిత్స తీసుకున్న ఎంతోమంది ఇప్పటికే దీంతో ఊరట పొందారు.

ఈ-కబుర్లు మీవే!

'లైట్'గానూ వస్తున్నాయ్

మార్కెట్‌లోకి వస్తున్న కొన్ని స్మార్ట్ ఫోన్‌లలో కేవలం ఇంటర్నల్ మెమరీనే ఉంటుంది. ఎంట్రీ లెవల్ ఫోన్‌లు ఎక్కువగా ఈ కోవలోకే వస్తాయ్. దీంతో స్టోరేజ్ స్పేస్‌ని పొదుపుగా వాడుకోవాల్సిన పరిస్థితి. ముఖ్యంగా ఇన్‌స్టాల్ చేసే యాప్‌ల విషయంలో! ఇవి ఎక్కువ మెమరీని తీసుకుంటాయ్. అందుకే రెగ్యులర్ యాప్‌లకు బిన్నంగా 'లైట్ యాప్స్' రూపొందిస్తున్నారు డెవలపర్లు. ఇవి మెమరీ తక్కువగా తీసుకోవడమే కాదు. డేటానీ ఆదా చేస్తాయి. యాప్‌లను రన్ చేసేందుకు అనువుగా 'ఆండ్రాయిడ్ గో' ఓఎస్ కూడా ఉంది. ఎక్కువగా వాడే సోషల్ మీడియా యాప్‌లను 'లైట్' వెర్షన్‌తో ప్రయత్నించొచ్చు. ఫేస్‌బుక్ లైట్, ఫేస్‌బుక్ మెసెంజర్ లైట్, స్కైప్ లైట్, ట్విటర్ లైట్, యూట్యూబ్ గో.. ఇవే కాకుండా గూగుల్ గో, జీమెయిల్ గో, ఫైల్స్ గో, గూగుల్ ఫొటోస్ ఇలా చాలా లైట్ యాప్‌లు ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్నాయి.

– వివేక్, నెల్లూరు

వీడియో కంప్రెస్ చేయాలా?

స్మార్ట్‌ఫోన్‌లతో తెగ వీడియోలు తీస్తాం. కొన్నిసార్లు షూట్ చేసిన వీడియోలతోనే స్టోరేజ్ నిండిపోతుంది. పైగా ఇప్పుడొస్తున్న ఫోన్‌లలో అన్నీ హై ఎండ్ కెమెరాలే. దీంతో వీడియోలు ఎక్కువ మెమరీ తీసుకుంటాయ్. అలాంటప్పుడు వీడియో ఫైల్‌ని కంప్రెస్ చేసి తక్కువ మెమరీలో సేవ్ అయ్యేలా చేస్తే! అందుకు తగిన యాప్ ఉంది. అదే 'వీడియో కంప్రెస్ పాండా'. ఇన్‌స్టాల్ చేసుకుని మనకు కావాల్సిన క్వాలిటీ, రిజల్యూషన్‌తో వీడియోలను మార్చుకోవచ్చు. వీడియోను ఎంచుకొని స్మాల్, మీడియం, లార్జ్, ఫిట్ టు ఈ-మెయిల్.. ఆప్షన్స్‌ని ఎంచుకోవచ్చు. ఆండ్రాయిడ్ యూజర్లు ప్లే స్టోర్ నుంచి పొందొచ్చు.

● డౌన్‌లోడ్ లింక్: http://bit.ly/2MstreE

– బి.నిఖిషా, హైదరాబాద్

ఇలాంటి టెక్నాలజీ సంగతులు మీరూ పంచుకోండి. ప్రచురిస్తాం.
ఈ-మెయిల్ ఐడీ
its@eenadu.in

ఫాలో.. ఫాలో

ఈ పెట్టెను దులపండి

కావాల్సిన మెయిల్ వచ్చిందా.. చూసుకున్నామా... సైన్‌అవుట్ చేశామా.. అంతేనా! ఇన్‌బాక్స్‌కి ఏమేం వస్తున్నాయ్.. ఏయే మెయిల్స్‌ని ఉంచాలి.. వేటిని తీసేయాలి.. ఎప్పుడైనా ఆలోచించారా? ఒకసారి రివ్యూ చేసి అక్కర్లేనివి దూరం పెట్టండి.. అందుకు ఏం చేయాలి?

ఆన్‌లైన్ ప్రపంచంలో ఈ-మెయిల్ ఇన్‌బాక్స్ వర్చువల్ హోమ్‌కి అడ్రస్ లాంటిది. దాన్నుంచే అధికారికంగా ఎన్నో ముఖ్యమైన వ్యవహారాల్ని నడిపిస్తాం. జాబ్ నిమిత్తం ఇంటర్వ్యూల్లో.. ఆర్థిక వ్యవహారాలకు బ్యాంకింగ్‌లో.. చెప్పాలంటే అనేక అవసరాలకు ప్రైమరీ ఐడీగా వాడుతుంటాం. నిజజీవితంలో ఇంటిని ఎలా ఎప్పటికప్పుడు సర్దుకుంటామో నెట్టింట్లో ఇన్‌బాక్స్‌ని రివ్యూ చేసి సర్దుకోవడం అనివార్యం. లేకుంటే.. మార్కెటింగ్ మెయిల్స్, న్యూస్‌లెటర్ అలర్ట్‌లు, ఇతర స్పామ్ మెయిళ్లు చుట్టు ముడతాయి. ఉదాహరణకు ఆన్‌లైన్‌లో మీరో టీవీ కొన్నారు. అప్పుడు ఇంటి అడ్రస్‌తో పాటు మీ మెయిల్ ఐడీ వివరాలు అన్నీ కంపెనీ ప్లాట్‌ఫామ్‌లో ఎంటర్ చేసుంటారు. ఇక దాన్నుంచి ఎప్పటికీ అప్‌డేట్స్ ఇన్‌బాక్స్‌కి చేరుతూనే ఉంటాయి. ఒకవేళ ఆయా కంపెనీలు మీ డేటాని ఇతర థర్డ్‌పార్టీ సంస్థలకీ షేర్ చేయొచ్చు. దీంతో మీకు ఎన్నడూ పరిచయం లేని సంస్థల నుంచీ ఎక్కడలేని మెయిల్స్ వచ్చి చేరుతుంటాయి. వాటిని అలానే వదిలేస్తే.. ఇన్‌బాక్స్ నిండిపోతుంది. లేనిపోని సైబర్ ముప్పులూ రావచ్చు.

మెయిల్ ఏది వాడుతున్నా

వెబ్ సర్వీసు.. యాప్‌లలో ఏ మెయిల్ సేవల్ని వాడుతున్నప్పటికీ మాన్యువల్‌గా అక్కర్లేని మెయిల్స్‌ని ఇన్‌బాక్స్‌కి చేరకుండా చేయొచ్చు. అందుకు ఏం చేయాలంటే.. ఇన్‌బాక్స్‌కి వచ్చిన ఏదైనా మెయిల్‌ని ఓపెన్ చేయండి. కంటెంట్‌తో పాటు సెండర్ పంపిన మెయిల్‌లో Unsubscribe ఆప్షన్ కనిపిస్తుంది. నిశితంగా చూస్తే మెయిల్ కింది భాగంలో ఇది కనిపిస్తుంది. లింక్‌పై క్లిక్ చేసి అదే తరహా ఈ-మెయిళ్లు మళ్లీ ఇన్‌బాక్స్‌కి చేరకుండా చేయొచ్చు.

జీమెయిల్‌లో అయితే..

నెటిజన్లలో జీమెయిల్ వాడని వారుండకపోవచ్చు. యూజర్లు సులభంగా మెయిల్స్‌ని మేనేజ్ చేసేందుకు ప్రమోషన్స్, సోషల్, ప్రైమరీ.. అంటూ ట్యాబ్‌లను ప్రవేశపెట్టింది. ఎన్ని ట్యాబ్‌లు ఉన్నా.. వ్యాపార ప్రకటనల లాంటివి వద్దు అనుకుంటే అన్‌సబ్‌స్క్రైబ్ చేసేయొచ్చు. అందుకు జీమెయిల్‌లోనే బిల్ట్‌ఇన్‌గా ఆప్షన్ ఉంది. గమనించారా? మీకు వచ్చిన మెయిల్‌పై క్లిక్ చేస్తే.. సెండర్ సమాచారం పక్కన, సబ్జెక్ట్ లైన్ కిందే అన్‌సబ్‌స్క్రైబ్ ఆప్షన్ కనిపిస్తుంది. లింక్‌ని క్లిక్ చేసి మళ్లీ రాకుండా చేయొచ్చు. దీంతో సెండర్ పంపే మెయిల్స్ అన్నీ ఆటోమాటిక్‌గా స్పామ్ ఫోల్డర్‌లోకి వెళ్లిపోతాయి. ఇది డెస్క్‌టాప్ వెర్షన్‌లోనే సాధ్యం. ఆండ్రాయిడ్, ఐఓఎస్‌ల్లో ఈ ఆప్షన్ కనిపించదు. స్పామ్‌లోకి ఎందుకు? ఏకంగా బ్లాక్ చేద్దాం అనుకుంటే చేయొచ్చు. అందుకు మెయిల్‌ని ఓపెన్ చేశాక కుడివైపు నిలువుగా ఉండే మూడు చుక్కలపై క్లిక్ చేస్తే 'బ్లాక్' ఆప్షన్ కనిపిస్తుంది.

అవుట్‌లుక్‌లో సైన్‌ఇన్ అయితే..

మైక్రోసాఫ్ట్ అందించే అవుట్‌లుక్ మెయిల్ సేవల్ని వాడుతున్నట్లయితే దాంట్లోనూ అక్కర్లేని వాటిని తొలగించొచ్చు. మెయిల్‌ని ఓపెన్ చేస్తే సబ్జెక్ట్ లైన్ కిందే 'అన్‌సబ్‌స్క్రైబ్' కనిపిస్తుంది. డెస్క్‌టాప్‌లోనే కాకుండా మొబైల్ యాప్‌లోనూ ఆప్షన్‌ని యాక్సెస్ చేయొచ్చు. అయితే, బ్లాక్ చేయడానికి కావాల్సింది మాత్రం యాప్‌లో దొరకదు. డెస్క్‌టాప్ మెయిల్ సేవల్లోకి లాగిన్ అయ్యాక బ్లాక్ చేయడం వీలవుతుంది. మెయిల్ ఓపెన్ చేశాక సెండర్ సమాచారం పక్కనే కనిపించే మూడు చుక్కలపై క్లిక్ చేసి ఆప్షన్‌ని ఎంచుకోవచ్చు.

యాహూ మాటేంటి?

మొబైల్, డెస్క్‌టాప్‌ల్లో భిన్నంగా ఆప్షన్స్‌ని చూడొచ్చు. మొబైల్ యాప్‌లో అయితే మెయిల్‌ని ఓపెన్ చేశాక చుక్కలతో కనిపించే ఐకాన్‌ని సెలెక్ట్ చేసి అన్‌సబ్‌స్క్రైబ్ చేయొచ్చు. డెస్క్‌టాప్ వెర్షన్‌లో 'స్పామ్' పేరుతో ఆప్షన్ కనిపిస్తుంది. సెలెక్ట్ చేసి వద్దనుకునే మెయిల్‌ని స్పామ్‌లోకి వెళ్లేలా చేయొచ్చు. ఒకవేళ బ్లాక్ చేయాలంటే.. మూడు చుక్కల గుర్తుపై క్లిక్ చేసి 'బ్లాక్ సెండర్స్' ఆప్షన్‌ని సెలెక్ట్ చేయాలి.

థర్డ్‌పార్టీ వేదికలు..

పలు అవసరాలకు ఒకటి కంటే ఎక్కువ మెయిల్స్‌ని వాడుతున్నట్లయితే.. కొన్ని ప్రత్యేక వెబ్ సర్వీసుల్ని వాడుకుని మెయిల్స్‌ని అన్‌సబ్‌స్క్రైబ్ చేయొచ్చు. ప్రయత్నిద్దాం అనుకుంటే వీటిని చూడండి.

● https://unroll.me

● https://getunsubscriber.com

మొబైల్ మాయ

షార్ట్‌ఫిల్మ్ తీయాలా..?

వాడుతున్న స్మార్ట్‌ఫోన్‌తోనే షూట్ చేసి వీడియోల్ని యూట్యూబ్‌లో పెట్టేస్తున్నారంతా. అందుకే మరింత క్వాలిటీతో చిత్రీకరణ చేసేలా మోటరోలా కంపెనీ సరికొత్త స్మార్ట్‌ఫోన్‌ని ఈ నెలలో దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేయనుంది. పేరు 'మోటరోలా వన్ యాక్షన్'. దీంతో సినిమాలు షూట్ చేసినట్టుగా అడ్డంగా (వైడ్ యాంగిల్) వీడియోలు షూట్ చేయొచ్చు. వాటిని 6.3 అంగుళాల తాకేతెరపై హెచ్‌డీ క్వాలిటీతో చూడొచ్చు. అందుకే దీన్ని తొలి ఆల్ట్రా వైడ్ యాక్షన్ కెమెరాగా పిలుస్తున్నారు. ఫోన్‌తోనే షార్ట్ ఫిల్మ్‌లు తీసేవారికి ఇది ప్రత్యేకమైంది. 'వీడియో స్టెబిలైజేషన్'తో వీడియోల్లో కదలికలు (షేకింగ్ వీడియోలు) లేకుండా చిత్రీకరణ చేయొచ్చు. 4జీబీ ర్యామ్, 128జీబీ ఇంటర్నల్ మెమొరీ. ముందు కెమెరా 12ఎంపీ, వెనుక మూడు కెమెరాలు (12ఎంపీ+ 16ఎంపీ+ 5ఎంపీ). బ్యాటరీ సామర్థ్యం 3,500ఎంఏహెచ్. ఆండ్రాయిడ్ 9పై ఓఎస్‌తో ఇది పనిచేస్తుంది.

అంచనా ధర: రూ.20,400

ఈనాడు సినిమా

బాలకృష్ణ కొత్త అవతారం

బాలకృష్ణ

కథ మాసైనా, క్లాసైనా... చారిత్రకమైనా, జానపదమైనా ఇట్టే ఒదిగిపోతారు బాలకృష్ణ. ఆయన తెరపై ఎప్పటికప్పుడు సరికొత్తగా దర్శనమిస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు. తాజాగా ట్రెండీ లుక్‌లోకి మారిపోయారు. ప్రత్యేకంగా కనిపించే గెడ్డం, మీసాలతో ఆయన స్టైలిష్‌గా ఉన్నారు. ఈ అవతారం కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం కోసమే. బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న 105వ చిత్రమిది. సోనాల్ చౌహాన్, వేదిక కథానాయికలు. సి.కల్యాణ్ నిర్మాత. ఇందులోని ట్రెండీ లుక్‌తో కూడిన బాలకృష్ణ సరికొత్త రూపాన్ని మంగళవారం బయటపెట్టింది చిత్రబృందం. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో సినిమా చిత్రీకరణ జరుగుతోంది. బాలకృష్ణ, ఇతర తారాగణంపై స్థానిక స్టంట్ కొరియోగ్రాఫర్స్ నేతృత్వంలో కీలకమైన పోరాట ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నట్టు చిత్రబృందం తెలిపింది. ప్రకాష్‌రాజ్, భూమిక, జయసుధ, సాయాజీ షిండే, నాగినీడు, సప్తగిరి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: చిరంతన్‌భట్, ఛాయాగ్రహణం: సి.రాంప్రసాద్, కథ: పరుచూరి మురళి.

ఏప్రిల్ 1న పుట్టిన ముగ్గురి కథ

"కొన్ని రోజులుగా కథా బలమున్న సినిమాలన్నీ విజయవంతం అవుతున్నాయి. మరొక మంచి కథతో 'ఏదైనా జరగొచ్చు' తెరకెక్కింది" అన్నారు నటుడు శివాజీరాజా. ఆయన తనయుడు విజయ్ రాజా హీరోగా పరిచయమవుతున్న చిత్రమిది. పూజా సోలంకి, సాషాసింగ్ కథానాయికలు. కె.రమాకాంత్ దర్శకుడు. సుదర్శన్ హనగోడు నిర్మాత. తమిళ నటుడు బాబీ సింహా విలన్‌గా నటించారు. రాఘవ, రవిశివ తేజ కీలక పాత్రధారులు. 23న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక జరిగింది. శివాజీరాజా మాట్లాడుతూ

పూజా సోలంకి, విజయ్ రాజా, సాషాసింగ్

"సినిమాకి రచయిత, దర్శకుడే ప్రాణం. మంచి కథని, ఒక మంచి దర్శకుడు తెరకెక్కించాడు. బాబీ సింహా లాంటి మంచి నటుడు కీలక పాత్ర చేయడం ఆనందంగా ఉంది" అన్నారు. బాబీ సింహా మాట్లాడుతూ "ఈ కథ విన్నప్పుడు నాకు రోమాలు నిక్కబొడుచుకున్నాయి. కథనం చాలా బాగుంటుంది. విజయ్‌రాజా బెరుకు లేకుండా నటించాడు" అన్నారు. "డార్క్ కామెడీ హారర్ థ్రిల్లర్ చిత్రమిది. ఏప్రిల్ 1న పుట్టిన ముగ్గురి జీవితాలు ప్రమాదంలో పడతాయి. వాళ్లు ఎలా బయటపడ్డారన్నదే కథ. జాషువా పోరాటాలు, బాబీ సింహా, అజయ్ ఘోష్ అభినయం ప్రధాన ఆకర్షణ" అన్నారు దర్శకుడు. "నా తొలి సినిమాలోనే బాబీ సింహాతో పనిచేయడం నా అదృష్టం. నేపథ్య సంగీతం మెప్పిస్తుంద"న్నారు విజయ్‌రాజా. ఈ కార్యక్రమంలో అజయ్ ఘోష్, రచ్చరవి, ఎస్.బి.ఉద్ధవ్, జాషువా తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర మనతోనే మొదలవ్వాలి

తెలుగు చిత్ర పరిశ్రమ అంతర్జాతీయ స్థాయి సినిమాలకి చిరునామాగా మారిపోయింది. అత్యున్నత సాంకేతిక హంగులు, భారీ వ్యయంతో వరుసగా సినిమాలు రూపొందుతున్నాయి. అందులో 'సైరా నరసింహారెడ్డి' ఒకటి. చిరంజీవి కథానాయకుడిగా నటించిన 151వ చిత్రమిది. బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన తొలి యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథతో రూపొందుతోంది. సురేందర్ రెడ్డి దర్శకుడు. కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. బాలీవుడ్ అగ్ర నటుడు అమితాబ్ బచ్చన్‌తోపాటు దక్షిణాదికి చెందిన పలువురు ప్రముఖ నటులు ఇందులో కీలక పాత్రలు పోషించారు. హిందీతో పాటు దక్షిణాదిలోని అన్ని భాషల్లోనూ చిత్రాన్ని అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. గురువారం చిరంజీవి పుట్టినరోజు. ఈ సందర్భంగా మంగళవారం ముంబయిలో 'సైరా నరసింహారెడ్డి' టీజర్‌ని విడుదల చేశారు. 'రేనాటి వీరులారా... చరిత్రలో మనం ఉండకపోవచ్చు. కానీ చరిత్ర ఈ రోజు మనతోనే మొదలవ్వాలి' అంటూ చిరంజీవి చేసిన సందడి ప్రేక్షకుల్ని అలరిస్తోంది. టీజర్ విడుదల కార్యక్రమంలో చిత్రబృందం చెప్పిన విషయాలివీ...



రామ్‌చరణ్, తమన్నా, చిరంజీవి

రేనాటి సూర్యుడు

'సైరా..' తెలుగు టీజర్ పవన్ కల్యాణ్ వాయిస్ ఓవర్‌తో మొదలైంది. శక్తిమంతమైన సంభాషణలు, భారీ యుద్ధ సన్నివేశాలతో సినిమా స్థాయిని తెలియజేసింది.. 1 నిమిషం 47 సెకన్ల ఆ టీజర్. పవన్‌కల్యాణ్, చిరంజీవి చెప్పిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. "చరిత్ర స్మరించుకుంటుంది ఝాన్సీ లక్ష్మీబాయ్, చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్ లాంటి ఎందరో మహనీయుల ప్రాణ త్యాగాల్ని. కానీ ఆ చరిత్ర పుటల్లో కనుమరుగయ్యాడు ఒక వీరుడు. ఆంగ్లేయులపై తొలిసారి యుద్ధభేరి మోగించిన రేనాటి సూర్యుడు" అంటూ పవన్ కల్యాణ్ వాయిస్ ఓవర్ చెప్పారు. 'రేనాటి వీరులారా...' అంటూ చిరంజీవి సంభాషణ సాగుతుంది. ఆయన పోరాట ఘట్టాల్లో కనిపించిన విధానం అలరించింది. చిరంజీవి, అమితాబ్‌ల సహకారంతో సినిమాని సులభంగా పూర్తి చేశానని దర్శకుడు సురేందర్‌రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయ్ సేతుపతి, రవికిషన్, సంగీత దర్శకుడు అమిత్ త్రివేది, హిందీలో విడుదల చేస్తున్న ఫర్హాన్ అక్తర్, రితేష్ సిద్వాని, అనిల్ టడానీ తదితరులు పాల్గొన్నారు. టీజర్ విడుదల కార్యక్రమం కోసం ముంబయికి వెళ్లిన చిరంజీవి, రామ్‌చరణ్‌ని... అక్కడే 'సాహో' ప్రచార కార్యక్రమాల్లో ఉన్న ప్రభాస్ కలుసుకొన్నారు.

రామ్‌చరణ్, చిరంజీవి, ప్రభాస్

నిర్మాతని మాత్రమే

- రామ్‌చరణ్

"ఈ చిత్రానికి నేను నిర్మాతని మాత్రమే. మంచి కథ కాబట్టి 'సైరా..'ని హిందీతో పాటు పలు భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. ఈచిత్రం కోసం నాన్న ఎంతో శ్రమించారు. హిందీలో మంచి కథ వస్తే నేను నటించడానికి సిద్ధమే. 'ఆర్ ఆర్ ఆర్'తో మళ్లీ హిందీ ప్రేక్షకుల ముందుకొస్తా. ప్రస్తుతం ఆ సినిమా చిత్రీకరణలో ఉన్నా".

తెలుసుకోవల్సిన కథ ఇది

- తమన్నా

"భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలోని ఒక ముఖ్యమైన కథ ఇది. కచ్చితంగా తెలుసుకోవల్సిన కథ. నా పాత్ర భిన్నంగా ఉంటుంది. దక్షిణాదిలో కెరీర్ మొదలుపెట్టినప్పటి నుంచీ చిరంజీవితో కలిసి నటించాలనే కోరిక ఉండేది. ఈ చిత్రంతో ఆ కల నెరవేరింది".

గుర్తుపట్టలేకపోయాం: సుదీప్

"ఈ సినిమా కోసం మేకప్ వేసుకొని అద్దం ముందుకు వెళ్లిన ప్రతిసారీ ఇక్కడ నేనేనా లేక వేరే వ్యక్తిని చూస్తున్నానా అనిపించేది. యుద్ధ సన్నివేశాల్లో నటిస్తున్నప్పుడు మా పక్కన ఉన్న నటులను గుర్తుపట్టలేకపోయేవాళ్లం. వాళ్లెవరో తెలుసుకోవడానికి సమయం పట్టేది".

కల నెరవేరింది

- చిరంజీవి

"ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం గురించి చాలా మందికి తెలియదు. దేశం కోసం పోరాటం చేసిన ఆయన గురించి భారతీయులంతా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. పదేళ్ల కిందటే నా దృష్టికి వచ్చిందీ కథ. కానీ నిర్మాణ వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని ధైర్యం చేయలేకపోయా. నిర్మాత రామ్‌చరణ్, దర్శకుడు సురేందర్‌రెడ్డి ముందుకు రావడంతో ఎట్టకేలకి నా కల నెరవేరింది. హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో విడుదల చేస్తున్నాం. సినిమాలో నటించేటప్పుడు మేకప్‌కే గంట సమయం పట్టేది. పోరాట ఘట్టాల కోసం చాలా కష్టపడాల్సి వచ్చింది. నాకు అప్పటికే భుజానికి గాయం అయ్యింది. ఆపరేషన్ కూడా జరిగింది. కానీ యాక్షన్ ఘట్టాల కోసం గుర్రపు స్వారీ, కత్తియుద్ధాలు చేయాల్సి వచ్చింది. కష్టపడటం ఇష్టం కావడంతో ఈ సినిమా ప్రయాణాన్ని ఆస్వాదించా. ఉదయం 4 గంటలకే లేచి వ్యాయామం చేసి సెట్‌కి వెళ్లేవాణ్ని. 7 గంటలకే చిత్రీకరణ మొదలుపెట్టేవాళ్లం. నా క్రమశిక్షణని చూసి, 'మీరిలా వెళితే మన అబ్బాయికి చెడ్డ పేరు వస్తుంద'ని నా భార్య చమత్కరించేది. 2007లో నేను నటించడం ఆపేశా. తిరిగి 2016లో మొదలుపెట్టా. అప్పటికే చాలా మార్పులు కనిపించాయి. 150వ సినిమాని నేనొక కొత్త నటుడిలాగే చేశా. కంటెంట్, భావోద్వేగాల పరంగా మాత్రం మార్పు లేమీ కనిపించలేదు. అమితాబ్ బచ్చన్ నా నిజ జీవిత మార్గదర్శి. ఒకే ఒక్క మెగాస్టార్ ఉన్నారని, ఆయన అమితాబ్ బచ్చన్ అని నమ్ముతుంటా. ఆయనతో కలిసి పనిచేయడం అద్భుతమైన అనుభవం".

భాగ్యనగరంలో త్రివాణీ సంగమం

బాలు, ఏసుదాస్, చిత్రల గాన కచేరీ

ఎస్.పి.చరణ్, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం

దిగ్గజ గాయకులు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, ఏసుదాస్, చిత్ర ఒకే వేదికపైకి రానున్నారు. తెలుగు చిత్రాల్లో తాము పాడిన అపురూపమైన గీతాల్ని ఆలపించబోతున్నారు. 'లెజెండ్స్' పేరుతో నవంబరు 30న హైదరాబాద్‌లో ఓ కార్యక్రమం నిర్వహించబోన్నారు. బుక్ మై షో, ఎలెవెన్ పాయింట్ టూ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ "తెలుగులో ఈ తరహా కార్యక్రమం నిర్వహించడం మొదటిసారి. అంతర్జాతీయ స్థాయిలో ఈ షో జరగబోతోంది. నేనూ, అన్నయ్య ఏసుదాస్, చిత్ర.. మా సినీ జీవితంలో లక్ష పాటలు పాడి ఉంటాం. అందులో ముప్పై పాటల్ని ఎంపిక చేసుకుని, వేదికపై ఆలపించడం చాలా కష్టతరమైన విషయం. ఎలాంటి పాటలు ఎంపిక చేసుకోవాలనే విషయంలో ఇప్పటికే కసరత్తులు చేశాం. సింగపూర్‌లో 'లెజెండ్స్' పేరుతో ఓ షో నిర్వహిస్తే, చాలా గొప్ప ఆదరణ లభించింది. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలనుకుంటున్నాం. రెహమాన్ స్కూల్ ఆఫ్ ఆర్కెస్ట్రా నుంచి ఓ బృందం ఈ కార్యక్రమంలో పాలుపంచుకోబోతోంది. మా గాయకులు ముగ్గురి మధ్య చక్కటి అనుబంధం ఉంది. అదే లేకపోతే ఇలాంటి కార్యక్రమాలు కేవలం వాణిజ్యపరంగా మిగిలిపోతాయ"న్నారు. ఎస్.పి. చరణ్ మాట్లాడుతూ "ముగ్గురు అపురూప గాయకులు ఒకే వేదికపై ఉండడం అరుదైన విషయం. ఈ కార్యక్రమం సజావుగా సాగడానికి తెరవెనుక నేను కృషి చేస్తున్నా" అన్నారు.

నేనో గడ్డిపరకను.. బాలు: ఇటీవల ఇళయరాజా - బాలు మధ్య పేటెంట్ హక్కుల వివాదం నడిచింది. అది ఇప్పుడు సద్దుమణిగింది. దాని గురించి బాలు స్పందిస్తూ "మా మధ్య దూరం ఎప్పుడూ లేదు. ఆయన ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్లడానికి నేను సిద్ధంగానే ఉన్నాను. ఆయన పిలిచారు. వెళ్లాను. ఇదివరకటిలానే కలిసి పనిచేశాం. ఇంట్లోవాళ్ల మధ్య చిన్న చిన్న మనస్పర్థలు వస్తుంటాయి. మళ్లీ కలిసిపోతుంటారు. ఇదీ అలాంటిదే. మా ఇద్దరికీ కలిసి పనిచేయాలన్న కోరిక ఉన్నప్పుడు మిగిలిన విషయాలు చిన్నవి అయిపోతాయి. ఇద్దరం కలిసి కొన్ని షోస్‌లోనూ పాల్గొన్నాం. ఫిబ్రవరి వరకూ నా డేట్స్ కావాలని అడిగారాయన. ఆయన సంగీత దర్శకత్వంలో ఈమధ్య రెండు పాటలు పాడాను. జీవితం అనేది ఓ పాటలా గడిచిపోవాలి. మహా వృక్షాలు పెను తుపానులకు కూకటివేళ్లతో సహా కూలిపోతాయి. గడ్డి పరక అలానే ఉంటుంది. నన్ను నేనో గడ్డి పరక అనుకుంటుంటా" అన్నారు.

ఐశ్వర్య రాజేష్, విజయ్ దేవరకొండ, రాశీఖన్నా

ఆయన సంపాదించినా.. పోగొట్టుకున్నా.. సినిమాల్లోనే!

ఐశ్వర్యరాజేష్, రాజేంద్రప్రసాద్, కార్తీక్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'కౌసల్య కృష్ణమూర్తి'. భీమనేని శ్రీనివాసరావు దర్శకుడు. వల్లభ నిర్మాత. కె.ఎస్.రామారావు సమర్పకుడు. 23న విడుదల అవుతోంది. మంగళవారం హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "పెళ్లి చూపులు' తరవాత కె.ఎస్.రామరావుగారిని కలిశాను. అప్పుడు ఒప్పుకున్న కథని ఇప్పుడు తెరపైకి తీసుకెళ్లాం. ఐశ్వర్య కూడా అందులో ఓ పాత్ర చేస్తోంది. తమిళంలో తన సినిమాలు చూసి చాలా ఇష్టపడ్డా. తను మా సినిమాలో నటించడం ఆనందంగా ఉంది. రామారావుగారు ప్రతి రోజూ సెట్లో కనిపిస్తారు. 'మీరు విశ్రాంతి తీసుకోండి' అన్నా వినరు. 'నాకు తెలిసిందే సినిమా.. దాన్ని వదలను' అంటారు. ఎంత సంపాదించినా, పోగొట్టుకున్నా సినిమాల్లోనే అని చెబుతుంటారు. ఆయన అనుభవాలు మా అందరికీ అవసరం" అన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "డబ్బు బాగా సంపాదిస్తే నాలుగు రాళ్లు వెనకేసుకుంటారు. మంచి సినిమాలు తీస్తే నాలుగు సినిమాలు వెనకేసుకుంటారు. క్రియేటివ్ కమర్షియల్ సంస్థ అలాంటిదే. అందుకే ఇన్ని మంచి సినిమాలు వెనకేసుకుంది. నా జీవితంలో పది గొప్ప సినిమాలుంటే, అందులో 'కౌసల్య కృష్ణమూర్తి' ఒకటి" అన్నారు. ఐశ్వర్య మాట్లాడుతూ "తమిళంలో 25 సినిమాలు చేశా. మణిరత్నం, గౌతమ్ మేనన్ లాంటి దర్శకులతో పనిచేశా. అక్కడ చేసిన నాయికా ప్రాధాన్య చిత్రం 'కణ'కు పది అవార్డులు వచ్చాయి. అదే నా తొలి తెలుగు సినిమా అవ్వడం నా అదృష్టం" అన్నారు. రాశీఖన్నా మాట్లాడుతూ "కణ' ఓ గొప్ప కథ. ఓ అమ్మాయి కష్టపడి ఎలా పైకి వచ్చిందన్నదే కథ. ఐశ్వర్య చాలా కష్టపడింది. ఇలాంటి పాత్ర దక్కడం తన అదృష్టం" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఈ సినిమాలో తండ్రీకూతుళ్ల అనుబంధం ఆకట్టుకుంటుంది. ప్రతి ఒక్కరికీ నచ్చే కథ ఇది" అన్నారు.

దర్శకుడు రంగారావు కన్నుమూత

సీనియర్ దర్శకుడు యెర్నేని రంగారావు(92) అనారోగ్యంతో ఆదివారం తన స్వగ్రామం కృష్ణా జిల్లా గురజలో కన్నుమూశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిత్ర పరిశ్రమలోకి పెయింటర్‌గా అడుగుపెట్టి 'పాతాళభైరవి' సహా పలు చిత్రాలకి పనిచేశారు. తర్వాత హెచ్.ఎమ్.రెడ్డి, కె.వి.రెడ్డిల దగ్గర సహాయ దర్శకుడిగా పనిచేశారు. జయరామిరెడ్డితో కలిసి బాపు ఫిలింస్ సంస్థని ఏర్పాటు చేసిన ఆయన మొదట అనువాద చిత్రాల్ని నిర్మించారు. ఆ తర్వాత స్వీయనిర్మాణంలో ఎన్టీఆర్, షావుకారు జానకి జంటగా 'సవతి కొడుకు' చిత్రాన్ని రూపొందించారు. కొత్త నటులతో 'అర్చన', 'మాయావి' చిత్రాల్ని తెరకెక్కించారు. ఆయన భార్య రఘుమాదేవి 2014లో మరణించారు. తనయుడు పూర్ణచంద్రరావు అమెరికాలో వైద్య వృత్తిలో స్థిరపడ్డారు. బుధవారం గురజలో రంగారావు అంత్యక్రియలు నిర్వహిస్తారు.

పైకి రావాలనే తపన ఉంటే సరిపోదు. దానికి తగ్గ కృషి ఉండాలి.

చిత్రం: నా ఆటోగ్రాఫ్

– పంపిన వారు: ఆరుద్ర శ్రీవిద్య, ములకలపల్లి, మహబూబ్‌నగర్

సంగీత ప్రియుల అమృతభాండం



ఖయ్యామ్

ఖయ్యామ్ అంటే అమృతం సేవించేవాడని అర్థమట. అంటే వారికి మరణమే ఉండదు. మరి ఆ పేరే పెట్టుకుని బాలీవుడ్ సంగీత దర్శకుడిగా మరపురాని పాటలందించిన ఖయ్యామ్ ఈలోకాన్ని ఎలా వదిలివెళ్లాడు? లేదు లేదు.. తనెక్కడికీ వెళ్లలేదు. తన స్వరాలతో జనాల నోళ్లలో వీనుల విందుగా వినిపిస్తూనే ఉన్నాడు. తన మధురమైన మెలోడీలు వింటూ పరవశించే శ్రోతల హృదయాలలో కనిపిస్తూనే ఉన్నాడు. పాట ఉన్నంతవరకూ ఖయ్యామ్‌కు మరణం లేదు. అందుకు రుజువు అన్నట్టేమో ఆరు పదుల సంవత్సరాల్లో ఆయన అందించిన పదిలమైన పాటలెన్నో మదిలో మెదులుతూనే ఉన్నాయి. 'ఉమ్రావ్ జాన్'లో రేఖను ఎంత సేపైనా ఎలా చూడబుద్ధేస్తుందో.. అందులోని పాటలనూ ఎన్నిసార్లైనా వినబుద్ధేస్తుంది. 'ఇన్ ఆంఖో కీ మస్తీ కే..' పాట అయితే ఓ క్లాసిక్‌గా నిలిచింది. ఖయ్యామ్‌కే కాదు.. ఆశా భోంస్లేకు, రేఖకూ వారి కెరీర్లోని అత్యుత్తమ గీతాల్లో ఒకటిగా నిలిచింది. ఆ పాటతో పాటు ఆశానే పాడిన 'యే క్యా జగాహై దోస్తో..' గీతం కూడా గుర్తుండిపోతుంది. ఓ సంగీత కచేరీలో హైదరాబాదీ గాయకుడు తలత్ అజీజ్ గాత్రం విని ఆయనతో 'జిందగీ జబ్‌బీ..' పాట పాడించారు ఖయ్యామ్. 'కభీ కభీ'లో 'కభీ కభీ మేరే దిల్ మే..' అంటూ లతా మంగేష్కర్ ఆర్తి నిండిన గాత్రంతో పాడిన పాట అయితే ఇప్పుడు విన్నా మనసు మెలితిప్పుతుంది. 'బజార్'లో భూపిందర్ సింగ్ పాడిన 'కరోగే యాద్ తో హర్ బాత్..' పాట వింటే అందులో స్మితా పాటిల్ ఊయల ఊగుతున్నట్లే మనమూ జ్ఞాపకాల ఊయల్లో ఊగుతాం. కిషోర్ కుమార్‌కూ అత్యుత్తమ పాటలు ఇచ్చారు ఖయ్యామ్. మచ్చుకు 'థోడీ సీ బెవాఫై'లోని 'హజార్ రహే ముడ్ కే దేఖీ..' ఒక్కటి చాలు. 'యే దిలే నాదాన్..'(రజియా సుల్తాన్), 'శామే ఘమ్ కీ కసమ్..'(ఫుట్‌పాత్), 'బహారో మేరా జీవన్..'(ఆఖ్‌రీ ఖట్), 'ఆజా రే ఓ మేరా..'(నూరీ) ఇలా సంగీత ప్రియులకు ఎన్నో అమృత భాండాలను అందించిన ఖయ్యామ్ 92 ఏళ్ల వయసులో సోమవారం అర్ధరాత్రి అమరులయ్యారు. ఆయన కీర్తికి పద్మభూషణ్, సంగీత నాటక అకాడెమీ లాంటి అవార్డులు శాశ్వత గుర్తులుగా మిగిలాయి.

ఎంబ్రాయిడరీ లోలాకుల తళుక్కు

ఎంబ్రాయిడరీ అనగానే పట్టుదారాలతో దుస్తులపై చేసే డిజైన్లే ఎక్కువగా గుర్తొస్తాయి. ఇప్పుడు ఆ అందాలు చెవి పోగులపైనా అమరిపోతున్నాయి. ఇదే నయా స్టైల్. వస్త్రంతో నేసిన, అచ్చంగా దారాలతో అల్లేసిన ఎంబ్రాయిడరీ స్టడ్స్, హ్యాంగింగ్స్ ఆన్‌లైన్‌లోనే కాదు, బజార్లోనూ దొరుకుతున్నాయి. కాస్త ఆసక్తి, తీరిక ఉంటే నచ్చింది ఎంచుకోవచ్చు. అలాంటివే ఈ డిజైన్లు.

మనమే నిరూపించుకోవాలి

విధుల్లో చేరిన కొత్తల్లో ఇక్కడి భాష, సంప్రదాయం పరిశీలించేదాన్ని. మొదట్లో అర్థంకాక ఇబ్బందిపడ్డా... తోటి ఉద్యోగులు సహకరించారు. లింగ వివక్ష ప్రతిచోట ఉంటుంది. దాన్ని దాటి మనల్ని మనం నిరూపించుకోవాలి. ఈ ఏడాది ఫిబ్రవరిలో సంపత్‌తో పెళ్లైంది. మాది ప్రేమ వివాహం. తను చెన్నైలో ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగిగా ఉన్నారు.

కశ్మీరు లోయలో... ఉద్రిక్త పరిస్థితులు తరచూ వినిపించే వార్త! కర్ఫ్యూ విధింపు.. తరచూ కనిపించే దృశ్యం! ఉగ్రవాదుల దుశ్చర్యలు, తుపాకుల మోతలు పతాక శీర్షికల్లో వస్తూనే ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగమంటే... అదీ ఆ పరిస్థితులను అదుపు చేసే పనంటే... లక్షలిచ్చినా... ధైర్యం చేయం. తెలుగింటి బిడ్డ ఐపీఎస్ నిత్య మాత్రం మహిళా పోలీసు అధికారిగా... కశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తోంది. ఉద్రిక్తతల మధ్య ఉత్సుకతతో పనిచేస్తున్న నిత్య తన అనుభవాలు వసుంధరతో ప్రత్యేకంగా పంచుకుంది.

కశ్మీరు అంటే...

అమ్మ భయపడింది

పక్షం రోజులుగా కశ్మీర్‌లో కర్ఫ్యూ నడుస్తోంది. కమ్యూనికేషన్ లేదు. ఎప్పుడేం జరుగుతుందో తెలియదు. గస్తీకి వెళ్లిన చోట... ఎప్పుడు పరిస్థితులు ఉద్రిక్తంగా మారతాయో చెప్పలేం. స్థానికులు ఎవరో వస్తారు.. 'అమ్మా! మావాళ్లకు ఫోన్ చేయాలి?' అని అడుగుతారు. వారి పిల్లలతో మాట్లాడాలని అంటారు. నా ఫోన్‌లో మాట్లాడిస్తా. కన్నీళ్లు పెట్టుకుంటారు. అలాంటి సమయాల్లో గుండె బరువెక్కుతుంది. ఎక్కడ విజయవాడ... ఎక్కడ కశ్మీర్ లోయ!

ప్రశాంతత నుంచి ఉద్రిక్తం వైపు

అమ్మ శాంతి, నాన్న వెంకటరత్నం. నేను పుట్టింది గుడివాడ పామర్రు మధ్య జమీ గొల్లేపల్లి గ్రామంలో. నా చిన్నప్పుడే నాన్న వ్యాపారరీత్యా మేం చండీగఢ్‌లో స్థిరపడ్డాం. నేను అక్కడే పెరిగా. కెమికల్ ఇంజినీరింగ్ చేశా. అన్నయ్య నేవీలో పని చేస్తున్నాడు. చదువు పూర్తయ్యాక ఓ సిమెంటు సంస్థలో మేనేజరుగా చేరా. ఏదైనా ఛాలెంజింగ్‌గా చేయాలనిపించింది. సివిల్స్ రాశా. రెండోసారి అర్హత సాధించా. 2016 బ్యాచ్‌లో ఐపీఎస్ శిక్షణకు హైదరాబాద్ వచ్చా. రెండేళ్ల శిక్షణ తరువాత గతేడాది కశ్మీర్‌లో పోస్టింగ్ వచ్చింది. శ్రీనగర్‌లోని నెహ్రూపార్క్ పోలీస్ స్టేషన్‌లో చేరా. చండీగఢ్‌లో మా ఊరు ప్రశాంతతకు మారుపేరు. అక్కడ పెరిగిన నేను... కశ్మీర్‌లో పని చేస్తున్నా.

నేనొక్కదాన్నే...

ఇక్కడ రోజూ ఏదో సందర్భంలో ఉద్రిక్తతలు చోటు చేసుకుంటూనే ఉంటాయి. అలజడులు, అల్లర్లు, కర్ఫ్యూలు, 144 సెక్షన్, దోపిడీలు, కిడ్నాప్‌లు ఇలా ఎప్పుడూ ఏదో ఒక టెన్షన్. మొదట్లో నా బాధ్యతలు నిర్వర్తించడంలో చాలా కష్టపడినా... నెమ్మదిగా అలవాటుపడ్డా. నేరపరిశోధక విభాగంలో సబ్ డివిజనల్ అధికారిగా పనిచేస్తున్నా. నా పరిధిలో మూడు పోలీస్ స్టేషన్లుంటాయి. ఈ లోయలో నేన్కొదాన్నే మహిళా పోలీసు అధికారిని. 40 కిలోమీటర్ల పరిధిని పర్యవేక్షించాలి. పెట్రోలింగ్ నిర్వహించాలి. రామ్‌మున్షీ బాగ్, హర్వాన్ దగ్గి గ్రామాల మధ్య ప్రాంతమంతా నా అధీనంలో ఉంటుంది. దాల్ సరస్సు పరిసరాల్లో నివసించేవారంతా వీవీఐపీలే. రాజ్‌భవన్ ఉండేదీ ఇక్కడే. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తగా పర్యవేక్షిస్తుండాలి. ఒక్కోసారి ప్రజలు రోడ్లపైకి వచ్చి, నిరసనల్లో పాల్గొంటారు. అలాంటి సమయాల్లో మాపై తిరగబడిన సందర్భాలూ ఉంటాయి. వారికి మెల్లగా నచ్చజెప్పి పరిస్థితులను అదుపు చేయాల్సి వస్తుంది.

ప్రతి క్షణం థ్రిల్లింగే...

ఇక్కడ ఉద్యోగం అనగానే అమ్మ చాలా భయపడింది. నేను విధుల్లో చేరిన కొన్నాళ్లకే... రాష్ట్రంలో గవర్నర్ పాలన వచ్చింది. దాంతో పరిస్థితులు మారుతూ వచ్చాయి. సాధారణ ఎన్నికలు ఆ వెంటనే అమర్‌నాథ్ యాత్రతో ఊపిరి సలపని పని. దీనికి తోడు 370 అధికరణ రద్దు, కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించడం ఊహించని మలుపు. ఈ ప్రభావాలన్నీ మాపై ఉంటాయి. వీఐపీలకు భద్రత కల్పించడం మా బాధ్యత. ప్రజల ఆందోళనలు సరేసరి. ఒక్కోసారి మమ్మల్ని టార్గెట్ చేస్తారు. మిలటరీ వాహనాల్లో, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ధరించి ఆయుధాలతో విధులు నిర్వర్తించాల్సి వస్తుంది. ఒక రోజును ప్రారంభించేటప్పుడు ఈ రోజు ఫలానా పనులు చేయాలని అనుకుంటాం కదా! గంటల్లోనే అన్నీ మారిపోతాయి. ఊహించని సంఘటనలు ఎదురవుతాయి. అన్నిటినీ ఎదుర్కోవాలి. ధైర్యంగా ముందుకుసాగాలి. నేను కోరుకున్న థ్రిల్ ఇక్కడ టన్నులకొద్దీ దొరుకుతోంది.

నిద్రలేని రాత్రులెన్నో...

కర్తవ్య నిర్వహణలో పట్టుదలతో పాటు ధైర్యం ఉండాలి. ఏ క్షణంలో ఫోన్ వస్తుందో చెప్పలేం. అర్ధరాత్రైనా వెళ్లాల్సి వస్తుంది. ఓసారి ఓ ప్రాంతంలో తీవ్రవాదులు ఉన్నట్లు సమాచారం వచ్చింది. సీనియర్లతో కలిసి వెళ్లా. సీఆర్‌పీఎఫ్ దళాలూ మాతో ఉన్నాయి. వేకువజామున రహస్య మార్గాల్లో తీవ్రవాదుల అడ్డాకు చేరుకున్నాం. ఆ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తీవ్రవాదులను మన బలగాలు హతమార్చాయి. ఇలాంటి సమయాల్లో ప్రతి సెకనూ విలువైనదే. ఇటీవల 370 రద్దు పరిణామాలు, ప్రజాప్రతినిధుల గృహ నిర్బంధం నేపథ్యంలో చాలా ఆందోళనలు చోటు చేసుకున్నాయి.

ఆ కళ్లల్లో కృతజ్ఞత

నేర పరిశోధనలోనూ సవాళ్లు మామూలే. దోపిడీలు, హత్యలు, ఘర్షణలు, కిడ్నాప్ కేసులు వస్తూనే ఉంటాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ నేరాలకు పాల్పడే వారూ ఉంటారు. వారిని పట్టుకోవడం కోసం వేరే రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటి వరకూ నేను చేపట్టిన కేసుల్లో దాదాపు అన్నింటినీ పరిష్కరించా. కిడ్నాప్ కేసులో బాధితులను దుండగుల చెర నుంచి విడిపించి.. వారింటికి వెళ్లి దిగబెట్టిన సందర్భాలెన్నో. అప్పుడు ఆ కుటుంబీకుల కళ్లల్లో కనిపించే కృతజ్ఞతను ఎన్నటికీ మరచిపోలేను.

లాఠీతో రంగంలోకి..

ఓసారి స్థానిక ఆసుపత్రిలో ఓ తల్లీబిడ్డ చనిపోయారు. అక్కడి రోగులే కాదు స్థానికులూ ఆందోళనకు దిగారు. సమాచారం అందగానే అక్కడికి చేరుకున్నా. భారీగా ట్రాఫిక్ జామ్. ఎంత నచ్చజెప్పినా ఎవరూ వినకపోవడంతో లాఠీ చేత పట్టుకొని రంగంలోకి దిగా. అందరూ చెదిరి పోయారు. కొన్ని సమయాల్లో దండోపాయమే కరెక్ట్. లేదంటే పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారతాయి. ఇలాంటి సవాళ్లు ఎన్ని ఉన్నా... వాటిని ఎదుర్కోవడంలోనే అసలైన ఆనందం ఉంటుందని నమ్ముతా.

వసుంధర

? నాకు ఇరవై ఎనిమిదేళ్లు. పాప పుట్టాక ఉద్యోగం మానేశా. ఇంట్లో ఉండి సొంతంగా ఏదైనా ఉపాధి మార్గం వెతుక్కోవాలనుకుంటున్నా. ఆహార పదార్థాలు తయారు చేసి ఆన్‌లైన్‌లో అమ్మొచ్చని విన్నా. ఇందుకోసం ప్రత్యేకించి అనుమతులు తీసుకోవాలా... పెట్టుబడి ఎంతవరకు పెట్టాల్సి ఉంటుంది... సలహా ఇవ్వగలరు?

- నవ్య, హైదరాబాద్

ఇంట్లో వండి... ఆన్‌లైన్‌లో అమ్మొచ్చా?

✔ పాపని చూసుకుంటూ ఇంటి నుంచే ఉపాధి పొందాలనుకుంటోన్న మీ ఆలోచన మంచిదే. ఇలా ఇంటి నుంచి లేదా ప్రత్యేకంగా కిచెన్ ఏర్పాటు చేసుకుని ఆహారం అమ్మేవాటిని క్లౌడ్ కిచెన్‌లుగా పిలుస్తారు. ఆన్‌లైన్‌లో ఆహారం అమ్మడానికి ఫుడ్ లైసెన్స్ ఉంటే సరిపోతుంది. ఇందుకోసం www.fssai.gov.in లో దరఖాస్తు చేసుకోవాలి. లైసెన్స్ తీసుకున్న తరువాత స్విగ్గీ, జొమాటో, ఊబెర్ ఈట్స్ వంటి హోం డెలివరీ యాప్స్‌తో రిజిస్టర్ అవ్వొచ్చు. ముందు మీరు చేయబోయే వ్యాపారానికి ఓ మంచి పేరుని ఎంచుకోండి. ఎలాంటి ఆహారాన్ని అందివ్వాలనుకుంటున్నారో ఓ మెనూని తయారు చేసుకుని, ఆ సంస్థలను సంప్రదించాలి. వాటి ప్రమాణాలకి తగ్గట్లు మీ కిచెన్ ఉందో లేదో వారు గమనించుకున్నాక మీతో ఒప్పందం చేసుకుంటారు. తరువాత ఆ యాప్‌ల ద్వారా మీరు ఆర్డర్లు అందుకుని మీ బ్రాండ్‌తోనే వినియోగదారులకు ఆహారం సరఫరా చేయవచ్చు. లైసెన్స్, లోగో, వంటగది ఏర్పాటు, ఆహారం తయారీ, సహాయకుల నియామకం వంటివాటికి పాతిక వేల నుంచి లక్షల రూపాయల వరకూ పెట్టుబడి అవసరం అవ్వొచ్చు. అది మీరు తయారుచేయాలనుకునే ఆహారపదార్థాల జాబితాపై ఆధారపడి ఉంటుంది. లోగో, మెనూ తయారీ కోసం ఫుడ్ కన్సల్టెన్సీల సాయం తీసుకోవచ్చు.

డియర్ వసుంధర

మోజేష్ కుమార్
బ్రాండ్ కన్సల్టెంట్

ఇంటి దగ్గరే ఉండి ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలనుకున్న మహిళలకు ఇది చక్కని అవకాశం. వ్యాపారం చేయాలనుకున్నా, మార్కెటింగ్‌లో మెలకువలు తెలుసుకోవాలనుకున్నా, కొత్త అంశాల్లో శిక్షణ తీసుకోవాలనుకున్నా... మీకున్న సందేహాలను మాకు పంపించండి. వాటికి సమాధానాలు అందించే ప్రయత్నం మేం చేస్తాం! మా చిరునామా... email: vasundhara@eenadu.net

బంగారం వెండి

20న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	3,604	3,584
వెండి (గ్రా)	48.20	47.60

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	38,900	38,800	38,780	38,720	37,350	37,450	39,030	38,740	38,530	38,560
ఆర్నమెంట్	36,330	36,250	35,920	35,860	34,450	34,550	35,850	35,390	35,840	35,870
వెండి(కిలో)	45,100	44,758	45,000	44,900	43,500	43,500	45,000	44,700	45,500	45,500

లక్ష్యాన్ని నమ్మితేనే గెలుపు

పనిలో చేసే చిన్నచిన్న పొరపాట్లే మానసికంగా కుంగిపోయేలా చేస్తాయి. లక్ష్యాన్ని చేరుకోకుండా వెనక్కి లాగుతాయి. అలాంటివాటి నుంచి ఎలా బయటపడాలంటే...

- పని వాతావరణంలో అనవసర విషయాల్లో తలదూర్చకపోవడమే ఉత్తమం. ముఖ్యంగా గాసిప్స్‌కి దూరంగా ఉండాలి. ఇవి ఏకాగ్రతను దెబ్బతీస్తాయి.
- చాలా మంది 'నో' చెప్పడానికి మొహమాటపడుతుంటారు. అన్యమనస్కంగానే ఒప్పుకుంటారు. ఇది ఇబ్బందులకు గురి చేస్తుంది. పనిఒత్తిడినీ పెంచుతుంది. దానికి అడ్డుకట్ట వేయండి. మీకు సాధ్యంకాని పనులు ఎవరైనా చెబితే వెంటనే నో చెప్పండి. మొహమాటానికి తావు ఇవ్వకండి.

- మానసికంగా దృఢంగా ఉండాలంటే మీరు పెట్టుకున్న లక్ష్యాన్ని గట్టిగా నమ్మాలి. తరచూ లక్ష్యాన్ని మార్చుకోకూడదు. నిత్యం కొత్తకొత్త విషయాలు నేర్చుకుంటూ ముందుకు సాగాలి.
- సవాళ్లను సమస్యలుగా కాకుండా అవకాశాలుగా స్వీకరించాలి. వాటిని ధైర్యంగానే ఎదుర్కోవాలి. ఓటమి ఎదురైనప్పుడు కుంగిపోకుండా ఎక్కడ తప్పులు జరిగాయో గుర్తించాలి. సానుకూల దృక్పథాన్ని పెంచుకోవాలి.
- బలహీనతల్ని అధిగమించేలా చూసుకోవాలి. బలాన్ని ఎప్పటికప్పుడు పెంచుకునేందుకు ప్రయత్నించాలి. చిన్న చిన్న విజయాలే అసలైన లక్ష్యాన్ని చేరుకోవడానికి ఉపయోగపడతాయని గుర్తుంచుకోవాలి.

ఆర్థిక పాఠాలు... కాలేజీ నుంచే!

కౌమార దశ నుంచే ఆర్థిక పాఠాలను ఒంటబట్టించుకుంటే ఉద్యోగం చేసే సమయానికి మీకంటూ ఓ స్పష్టత వస్తుంది. అందుకు ఇప్పటి నుంచి మీరేం చేయాలంటే...

సమయమే పెట్టుబడి... మీరు ఈ వయసులో ఒకేసారి ఎక్కువ మొత్తంలో డబ్బును అప్పటికప్పుడు జమచేయలేరు. కొంత కాలం పాటు క్రమంతప్పకుండా పొదుపు చేస్తేనే అది సాధ్యమవ్వొచ్చు. కొన్నేళ్లపాటు పోస్టాఫీసు రికరింగ్ డిపాజిట్, బ్యాంకు ఖాతా, సిప్... ఇలా రకరకాల పద్ధతుల్లో ఆదా చేయడం అలవాటు చేసుకోండి. మీకు చదువు కాకుండా ఇంకేదైనా విద్య వచ్చి ఉంటే... ఖాళీ సమయంలో ఉద్యోగంచేసి ఎంతోకొంత సంపాదించుకోవచ్చు.

అలవాటుగా... కౌమారం నుంచే పొదుపుపై అవగాహన పెంచుకోవాలి. మీరు ఇప్పుడు ఆదా చేసే ప్రతి రూపాయి భవిష్యత్తులో మీకు ఆర్థిక భరోసాను కలిగిస్తుంది. మీకు కానుకలు, బహుమతి, చెక్కులు... ఇలా ఏ రూపంలో డబ్బు అందుకున్నా దాన్ని వృథాగా ఖర్చు చేసే ప్రయత్నం వద్దు.

అప్రమత్తత అవసరం... మీ ఖాతాలో ఎల్లప్పుడు కొంత మొత్తం ఉండేలా చూసుకోవాలి. ఎప్పుడైనా అందులోంచి తీసినా... దాన్ని భర్తీ చేయడం అవసరం. మీ దగ్గర ఉన్న మొత్తాన్ని రెండు రకాలుగా పొదుపు చేయండి. ఒకటి కరెంట్ ఖాతా, మరొకటి కొన్ని సంవత్సరాలపాటు కదపకుండా ఉండేలా చూసుకోండి. నగదు కాకుండా వీలైన చోట్ల డెబిట్ కార్డును ఉపయోగించండి. దేనికి ఎంత ఖర్చు చేస్తున్నారో అనేదానిపై మీకు స్పష్టత వస్తుంది.

అవగాహన తప్పనిసరి... డబ్బును ఎలా పొదుపు చేయాలో ఎక్కడా నేర్పించరు. పొదుపు గురించి పాటించాల్సిన నియమాలు, చిట్కాలు... ఇలా సమస్త సమాచారాన్ని మీరు అంతర్జాలం ద్వారా తెలుసుకోవచ్చు. కొన్ని రకాల యాప్‌లు, పుస్తకాలనూ పరిశీలించవచ్చు. అవసరం అనుకుంటే... ఓ సారి నిపుణులను సంప్రదించండి.

పెద్దవాళ్ల సలహాతో... ఇంట్లో అమ్మానాన్నతోనూ మాట్లాడండి. ఇంటి అవసరాల కోసం వారెలా ఖర్చు చేస్తున్నారో అడగండి. ప్రత్యక్షంగా చూడండి. చిన్నప్పటి నుంచే ఆర్థిక పాఠాలను తల్లిదండ్రుల నుంచి నేర్చుకుంటే పెద్దయ్యాక చాలా సమస్యల్ని అధిగమించగలుగుతారు. ఒకవేళ ఏవైనా సమస్యలు వచ్చినా... ఎలా తట్టుకోవాలనే స్పష్టత మీకు వస్తుంది.

జుట్టు రాలకుండా..!

జట్టురాలే సమస్య చాలామందిని ఇబ్బందిపెడుతుంది. దానికి పరిష్కారం ఏదో షాంపూ వాడటం కాదు. ఇంట్లో లభించే పదార్థాలతోనే ఇలా చేసి చూడండి.

- రెండు కప్పుల నీటిని వేడిచేసి అందులో మూడు గ్రీన్‌టీ బ్యాగులను వేయాలి. తల స్నానం చేశాక ఈ నీటిని జుట్టుకు పట్టించి మర్దన చేయాలి. దీంట్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు రాలడాన్ని నివారిస్తాయి.
- రెండు గుడ్ల తెల్లసొనలో రెండు చెంచాల చెక్కర కలిపి నురగ వచ్చే వరకు గిలకొట్టాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కుదుళ్ల వరకు పట్టించి మర్దన చేయాలి. అరగంట తరువాత శుభ్రం చేసుకుంటే జుట్టు రాలే సమస్య అదుపులోకి వస్తుంది. ఈ మిశ్రమాన్ని చర్మ సంరక్షణకూ వాడొచ్చు.
- ఉల్లిపాయ రసాన్ని జుట్టుకు పట్టిస్తే ఈ సమస్య అదుపులోకి వస్తుంది. ఉల్లిపాయలో ఉండే సల్ఫర్ జుట్టు రాలిపోకుండా చేస్తుంది. దీంట్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు తల్లో ఉండే క్రిములను నశింపజేస్తాయి. రక్తప్రసరణ పెరగడంతో తల్లో పేరుకొనే మురికి చాలామటుకూ తగ్గుతుంది. సమస్య ఎక్కువగా ఉన్నవారు వారంలో రెండుసార్లు ఈ రసాన్ని వాడొచ్చు.
- ఒక గుడ్డు తెల్లసొనలో ఒక్కో చెంచా చొప్పున ఆలివ్ నూనె, తేనె కలపాలి. దీన్ని తలకు పట్టించి 20 నిమిషాల తరువాత కడిగేసుకోవాలి. దీంట్లో ఉండే సల్ఫర్, ఫాస్పరస్, ఇతర ప్రొటీన్లు జుట్టు రాలడాన్ని నిరోధిస్తాయి.
- కొబ్బరి పాలల్లో ఉండే నియాసిన్, ఫోలేట్లు, విటమిన్ బి3 రక్తప్రసరణ పెరగడానికి తోడ్పడతాయి. ఇవి జుట్టుకు ప్రాణవాయువు అందేలా చేస్తూ రాలే సమస్యను అదుపులో ఉంచుతాయి.



ఏ దేశమేగాలి.. ఏం చదవాలి?

విదేశీవిద్య

విదేశాలకు వెళ్లి చదువుకోవడం ఇప్పుడు కల కాదు... కామన్ అయిపోతోంది. అయితే ఏ దేశానికి వెళ్లాలి అనేది మొదట ఎదురయ్యే ప్రశ్న. అందరూ అమెరికా అంటున్నారు.. యూకే ఓకే.. కాకుంటే కెనడా.. ఆలోచిస్తే ఆస్ట్రేలియా.. పోనీ జర్మనీ.. కొత్తగా న్యూజిలాండ్.. సరాసరి సింగపూర్.. ఇలా ఎక్కడికైనా మనవాళ్లు వెళ్లిపోతున్నారు. ఈ సంఖ్య ఏటా పెరిగిపోతోంది. ఇప్పుడు వెళ్లాలనుకునే వాళ్లు ముందుగా ఆయా దేశాల ప్రత్యేకతలపై స్థూల అవగాహన తెచ్చుకోవాలి. అడ్మిషన్ల సమయానికి ఒక సంవత్సరం లేదా తొమ్మిది నెలల ముందు నుంచే ప్రయత్నాలు ప్రారంభించాలి.

ప్రపంచవ్యాప్తంగా విదేశాల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య బాగా పెరుగుతోంది. 2000 సంవత్సరంలో కేవలం పది లక్షల మందే విదేశాలకు వెళ్లి చదివేవారు. 2007 నాటికి ఆ సంఖ్య రెట్టింపై 2015 నాటికి అరకోటి దాటింది. 2020కి ఇది డెబ్బై లక్షలకు చేరుతుందని అంచనా. విదేశాల్లో చదువుతోన్న విద్యార్థుల్లో చైనా ముందుండగా, తర్వాతి స్థానంలో భారత్ దూసుకుపోతోంది. వృద్ధి విషయంలో భారత్ మొదటి స్థానంలో ఉంది. మనదేశం ఏటా 10 శాతం పెరుగుదల కనబరుస్తుండగా, చైనాలో ఇది 8 శాతంగా నమోదవుతోంది. ఏటా 3.5 లక్షలకుపైగా భారతీయ విద్యార్థులు చదువుల నిమిత్తం విదేశాలకు వెళ్తున్నారు. వీరిలో దాదాపు 85 శాతం మంది యూఎస్, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లోని విద్యా సంస్థల్లో చేరుతున్నారు. సగం మంది అమెరికాలో కాలుమోపుతున్నారు. వీరిలో 80 శాతం మంది స్టెమ్ కోర్సుల్లో చేరడానికి ప్రాధాన్యమిస్తున్నారు. విదేశీ విద్య అభ్యసించే భారతీయుల్లో 10 శాతం అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో, 75 శాతం మాస్టర్స్ డిగ్రీలోనూ చేరుతున్నారు.

ఓపీటీ ఒక వరం — అమెరికా

ఫార్చూన్ గ్లోబల్ 500 కంపెనీల్లో కనీసం సగం సంస్థలకు ప్రధాన కార్యాలయాలు అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఉన్నాయి. ప్రపంచ గమనాన్ని మార్చేసిన స్టార్టప్‌లకు పుట్టినిల్లు యూఎస్. టెక్నాలజీ, సైంటిఫిక్ రిసెర్చ్, మ్యూజిక్, మూవీస్, కాలేజీల ర్యాంకులు...ఏవైనాసరే టాప్ స్థానంలో అమెరికా ఉంటుంది. అందువల్లే అక్కడి పేరొందిన సంస్థల్లో ట్యూషన్ ఫీజు ఏడాదికి అక్షరాలా రూ. అరకోటి. అయితే బడ్జెట్ ప్రకారం ఎంచుకోవడానికి ఆ దేశంలో నాలుగు వేల విద్యాసంస్థలు ఉన్నాయి. ఏఆర్‌డబ్ల్యు, క్యూఎస్, టైమ్స్ సంస్థలు ప్రకటిస్తోన్న ప్రపంచ టాప్- 100 విశ్వవిద్యాలయాల జాబితాల్లో కనీసం 40 నుంచి 50 వరకు ఈ ఒక్క దేశం నుంచే నమోదవుతున్నాయి. అందువల్ల మెరిట్ విద్యార్థుల మొదటి ఎంపిక యూఎస్‌గానే ఉంటోంది. ప్రపంచ ప్రసిద్ధ స్టాన్‌ఫర్డ్, హార్వర్డ్ విశ్వవిద్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నవారిలో 5 శాతం మందికే అవకాశం లభిస్తుంది.

- స్టెమ్ కోర్సులకు మూడేళ్లు, మిగిలిన కోర్సులకు ఏడాదిపాటు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ఉంటుంది.
- మూడు సీజన్లలో ప్రవేశాలు. ప్రధానమైన ఫాల్ సీజన్ సెప్టెంబరులో మొదలవుతుంది.

నాణ్యమైన జీవనం — కెనడా

యూఎస్ తర్వాత ఎక్కువ మంది విద్యార్థుల లక్ష్యం కెనడా. ట్యూషన్, వసతి కోసం యూఎస్‌లో వెచ్చించే మొత్తంతో చూసుకుంటే దాదాపు 50-60 శాతంతో కోర్సు పూర్తవుతుంది. ప్రపంచంలో నాణ్యమైన జీవన ప్రమాణాలున్న దేశాల్లో కెనడానే ముందుంటోంది. వాతావరణం బాగా చల్లగా ఉన్నప్పటికీ విదేశీ విద్యార్థులు చదువుకోవడానికి అనుకూల పరిస్థితులు ఇక్కడ ఎక్కువ. ఈ దేశ జనాభాలో దాదాపు 4 శాతం మంది భారతీయులే ఉన్నారు. అలాగే ఇక్కడ ఎక్కువమంది మాట్లాడే భాషల్లో పంజాబీది నాలుగో స్థానం. ఇంజినీరింగ్, ఐటీ, బయోసైన్సెస్, ఫైనాన్స్ విభాగాల్లో ఉద్యోగాలు ఎక్కువగా, కొంచెం సులువుగా లభిస్తాయి. ఇక్కడ రెండేళ్ల పని అనుభవంతో శాశ్వత నివాస యోగ్యతకు దరఖాస్తు చేసుకోవచ్చు. మూడేళ్ల తర్వాత పౌరసత్వానికి ప్రయత్నించుకోవచ్చు. వీసా ప్రాసెసింగ్ వ్యవధిని కెనడా 60 నుంచి 45 రోజులకు తగ్గించింది. ఈ దేశంలో ఉద్యోగావకాశాలూ, ఎంచుకోవడానికి విద్యా సంస్థలూ ఎక్కువే. భిన్న సంస్కృతులు దర్శనమిస్తాయి. ఇక్కడి విదేశీ విద్యార్థుల్లో దాదాపు 28 శాతం మంది చైనీయులు. భారతీయుల వాటా 25 శాతం. ప్రవేశాలు ఎక్కువగా సెప్టెంబరు, జనవరిలో ఉంటాయి.



- ఈ దేశ జనాభాలో దాదాపు 4 శాతం మంది భారతీయులే ఉన్నారు.
- ప్రవేశాలు ఎక్కువగా సెప్టెంబరు, జనవరిలో ఉంటాయి.

ఏడాదిలో పీజీ — యూకే

సుప్రసిద్ధ ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయాలు, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, యూనివర్సిటీ కాలేజ్ లండన్... ఈ దేశానికి చెందిన ప్రపంచస్థాయి సంస్థలు. ఇక్కడ సాధారణ చదువులతో పాటు నాణ్యమైన వైద్యవిద్య విదేశీ విద్యార్థులకు అందుతుంది. ఇక్కడ ఏడాది వ్యవధితో పూర్తయ్యే పీజీ కోర్సులున్నాయి. వీటిని పరిశ్రమలు గుర్తించాయి. అయితే వీటిని పూర్తిచేసుకున్నవారికి భారత్‌లో ఉపాధి పొందడానికి ప్రతికూలతలు ఉన్నాయి. విదేశీ విద్యార్థులకు కామన్‌వెల్త్, గ్రేట్, రోడ్స్ స్కాలర్‌షిప్పులు అందుబాటులో ఉంటాయి. సెప్టెంబరు/ అక్టోబరులో విద్యాసంవత్సరం మొదలవుతుంది. వారానికి 20 గంటలు పనిచేసుకోవచ్చు.

- సెప్టెంబరు/ అక్టోబరులో విద్యా సంవత్సరం మొదలవుతుంది.
- వారానికి 20 గంటలు పనిచేసుకోవచ్చు.

అక్కడే ఉద్యోగం మంచిది — ఆస్ట్రేలియా

ప్రపంచంలో నివాసానికి మెరుగైన మొదటి పది దేశాల్లో ఆస్ట్రేలియా ఒకటి. ఇక్కడి వాతావరణం చాలా సహజంగా ఉంటుంది. ఒక చదరపు కిలోమీటరు పరిధిలో కేవలం ముగ్గురే ఉంటారు (భారత్‌లో ఇదే విస్తీర్ణంలో 455 మంది నివసిస్తున్నారు). క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. జీవన ప్రమాణాలు బాగుంటాయి. ఫీజులు దాదాపు యూఎస్‌లో మాదిరిగానే ఉంటాయి. ఈ దేశంలో చదువుకున్నవారు అక్కడే ఉద్యోగం పొందితేనే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. భారత్‌లో ఈ డిగ్రీలను ప్రత్యేకంగా పరిగణించరు. ఇక్కడి జనాభాలో 2 శాతం భారతీయులే. ఇమిగ్రేషన్‌ను ఈ దేశం ప్రోత్సహిస్తుంది. పీఆర్ (పర్మనెంట్ రెసిడెన్సీ) మాదిరి అయిదేళ్ల స్కిమ్డ్ మైగ్రేషన్ ప్రోగ్రాం ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డాక్టర్లు, నర్సులు, ఫిజియోథెరపిస్టులు, వెబ్ డెవలపర్లు, సేల్స్ ప్రొఫెషనల్స్‌కు అనుకూలం. నాలుగేళ్ల పీఆర్ తర్వాత పౌరసత్వానికి ప్రయత్నించవచ్చు. ఎక్కువ కోర్సులు ఫిబ్రవరి, మార్చిల్లో మొదలవుతాయి.

- ఇమిగ్రేషన్‌ను ఈ దేశం ప్రోత్సహిస్తుంది.
- నాలుగేళ్ల పీఆర్ తర్వాత పౌరసత్వానికి అవకాశం.

అందుబాటులో ఫీజులు — న్యూజిలాండ్

ఇటీవలి కాలంలో న్యూజిలాండ్ వెళ్లి చదువుకునే భారతీయ విద్యార్థుల సంఖ్య బాగా పెరుగుతోంది. హార్టికల్చర్, డెయిరీ టెక్నాలజీ, ఫోరెన్సిక్ సైన్స్, మెరైన్ ఇంజినీరింగ్, జియోథర్మల్ ఎనర్జీ అండ్ బయోటెక్నాలజీ కోర్సులు ఈ దేశంలో ప్రసిద్ధి చెందాయి. ఇక్కడ ఉన్నత విద్యా ప్రమాణాలు పాటిస్తున్నారు. ప్రశాంతంగా చదువుకోవడానికి అనువైన పరిస్థితులు, శిక్షణలో అడ్వాన్స్‌డ్ టూల్స్ వినియోగం, అందుబాటులో ఫీజు ఈ దేశం ప్రత్యేకతలుగా చెప్పుకోవచ్చు. కోర్సు అనంతరం మూడేళ్లు పోస్టు స్టడీ ఓపెన్ వర్కింగ్ వీసా సౌలభ్యం ఈ దేశంలో చదువుతోన్న విదేశీ విద్యార్థులకు కల్పించారు. జులై, ఫిబ్రవరిలో ప్రవేశాలు ఎక్కువగా ఉంటాయి.

- కోర్సు అనంతరం మూడేళ్లు పోస్టు స్టడీ ఓపెన్ వర్కింగ్ వీసా సౌలభ్యం
- జులై, ఫిబ్రవరిల్లో ప్రవేశాలు.

ఆరు నెలల్లో శాశ్వత నివాసం — సింగపూర్

ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్టుల్లో సింగపూర్ రెండోది. దీనిద్వారా 188 దేశాలకు వీసా ఫ్రీ యాక్సెస్/ వీసా ఆన్ అరైవల్ అవకాశం లభిస్తోంది. ఫైనాన్స్, టెక్నాలజీ హబ్‌లు ఎక్కువ. బహుళజాతి కంపెనీల్లో దాదాపు సగం సంస్థలకు ప్రాంతీయ కేంద్ర కార్యాలయాలు ఇక్కడే నెలకొల్పారు. నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్, సింగపూర్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీలు పేరున్న సంస్థలు. భారత్‌తోపాటు ఇతర ఆసియా దేశస్థులు ఇక్కడ చదువులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మేనేజ్‌మెంట్ విద్యలో వినూత్న కోర్సులకు సింగపూర్ ప్రసిద్ధి పొందింది. ప్రవేశాలు ఆగస్టు, జనవరిల్లో ఉంటాయి. ఉద్యోగం పొందినవారు 6 నెలల్లో శాశ్వత నివాసానికి అర్హత సాధిస్తారు. పీఆర్ వచ్చిన రెండేళ్ల తర్వాత పౌరసత్వం నిమిత్తం ప్రయత్నించవచ్చు.

- మేనేజ్‌మెంట్ విద్యలో వినూత్న కోర్సులకు సింగపూర్ ప్రసిద్ధి.
- ప్రవేశాలు ఆగస్టు, జనవరిల్లో.

తక్కువ ఖర్చుతో వసతి — జర్మనీ

ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. విదేశీ విద్యార్థులకు ఉచితంగా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు అందించడం ఈ దేశం ప్రత్యేకత. తక్కువ ఖర్చుతో వసతి పొందవచ్చు. స్టెమ్, ఫైనాన్స్ కోర్సులకు ప్రసిద్ధి. ఏడాదిలో 120 రోజులు పనిచేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. పీజీ స్థాయిలో వెయ్యికి పైగా, యూజీలో 150 కోర్సులను ఆంగ్లంలో చదువుకోవచ్చు. అయితే ఎలాంటి ఇబ్బందులూ ఎదుర్కోకుండా ఉండడానికి జర్మన్ భాష నేర్చుకోవడం మంచిది. ఆ భాషతో పరిచయం ఉంటేనే ప్రవేశం లభిస్తుంది. ఇందుకోసం పరీక్ష నిర్వహిస్తారు. ఇంజినీరింగ్, ఐటీ, మెడిసిన్, నర్సింగ్, సైంటిఫిక్ రిసెర్చ్‌లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయి. ఉద్యోగంలో మూడేళ్లు కొనసాగిన తర్వాత శాశ్వత నివాసానికి దరఖాస్తు చేసుకోవచ్చు. సమ్మర్ కోర్సులు ఏప్రిల్‌లో, వింటర్ అడ్మిషన్లు అక్టోబరులో జరుగుతాయి.

- స్టెమ్, ఫైనాన్స్ కోర్సులకు ప్రఖ్యాతి.
- విదేశీ విద్యార్థులకు ఉచితంగా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు అందిస్తారు.

వీసా సరళం — చైనా

చైనాలో ప్రసిద్ధ విద్యాసంస్థలు హాంకాంగ్‌లో నెలకొన్నాయి. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక శక్తి. బహుళజాతి సంస్థలకు చెందిన దాదాపు మూడోవంతు ప్రాంతీయ కేంద్ర కార్యాలయాలు చైనాలో ఉన్నాయి. మాండరిన్ వచ్చినవారు దూసుకుపోవచ్చు. హాంకాంగ్ విశ్వవిద్యాలయం లిబరల్ ఆర్ట్స్ కోర్సులకు ప్రసిద్ధి. హాంకాంగ్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ స్టెమ్, బిజినెస్, ఫైనాన్స్ కోర్సుల్లో పేరొందింది. వీసా ప్రక్రియ సరళంగా ఉంటుంది. గ్రాడ్యుయేషన్ తర్వాత ఏడాది ఉండవచ్చు. హాంకాంగ్‌లో ఏడేళ్లు ఉన్నవారు శాశ్వత నివాస యోగ్యత కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

- మాండరిన్ భాష వస్తే ప్రయోజనకరం.
- హాంకాంగ్ విశ్వవిద్యాలయం లిబరల్ ఆర్ట్స్ కోర్సులకు ప్రసిద్ధి.

విదేశీ విద్య కోసంఐర్లాండ్, యూఏఈ, జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ, టర్కీ, ఫ్రాన్స్ దేశాలను సైతం మనవాళ్లు పరిగణనలోకి తీసుకుంటున్నారు

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్

ముంబయిలోని జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా... ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: అసిస్టెంట్ మేనేజర్ (స్కేల్ 1)
ఖాళీలు: 25
అర్హత: ఇంజినీరింగ్/ ఫైనాన్స్/ కామర్స్/ లా/ ఐటీ తదితరాల్లో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత.
వయసు: 21-30 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: రాతపరీక్ష, గ్రూప్ డిస్కుషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తు: ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 11 వరకు.
వెబ్‌సైట్: https://www.gicofindia.com/

యంగ్ ప్రొఫెషనల్స్

భారత సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ... మినిస్ట్రీ, ఇతర మీడియా యూనిట్లలో కాంట్రాక్టు ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: యంగ్ ప్రొఫెషనల్
ఖాళీలు: 35 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ/ డిప్లొమా, అనుభవం. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.
దరఖాస్తు: ఈమెయిల్/ ఆఫ్‌లైన్ **చివరితేది:** సెప్టెంబరు 14
వెబ్‌సైట్: https://mib.gov.in/

ప్రాజెక్టు స్టాఫ్

సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ డాక్) కాంట్రాక్టు ప్రాజెక్టు స్టాఫ్ భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు-ఖాళీలు: మేనేజర్-02, ఇంజినీర్-115, అసోసియేట్ (ఫ్రెషర్)-46. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్/ ఎంసీఏ, ఎంటెక్, అనుభవం. **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** సెప్టెంబరు 3
వెబ్‌సైట్: www.cdac.in

అంబేడ్కర్ నేషనల్ లా యూనివర్సిటీ

హరియాణాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ లా యూనివర్సిటీ.. నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు-ఖాళీలు: కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్-01, డిప్యూటీ రిజిస్ట్రార్-01, అసిస్టెంట్ రిజిస్ట్రార్-01, అసిస్టెంట్ లైబ్రేరియన్-01, సూపరింటెండెంట్-02, ప్రైవేట్ సెక్రటరీ-01, అసిస్టెంట్-03, పర్సనల్ అసిస్టెంట్-01, జూనియర్ ప్రోగ్రామర్-01, టెక్నికల్ అసిస్టెంట్-01, స్టోర్ కీపర్-01, ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్-01, క్లర్క్-03, డ్రైవర్-02, డాఫ్టీ-01.
అర్హత: పదోతరగతి, ఇంటర్, డిప్లొమా, బీఈ/ బీటెక్/ బీఎస్సీ/ బీసీఏ, ఎంఎస్సీ/ ఎంసీఏ, పీహెచ్‌డీ, నెట్/ సెట్, అనుభవం.
ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ/ స్కిల్ టెస్ట్ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: సెప్టెంబరు 6
హార్డు కాపీలను పంపడానికి చివరితేది: సెప్టెంబరు 13
వెబ్‌సైట్: http://dbranlu.ac.in/

ఫెలోషిప్స్

నేషనల్ ఓవర్‌సీస్ ఫెలోషిప్స్

న్యూఢిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్... విదేశాల్లో ఉన్నత విద్య చదవాలనుకునే ఎస్సీ విద్యార్థులకు ఫెలోషిప్స్ అందిస్తోంది. 2019-20 సంవత్సరానికిగానూ దరఖాస్తులు కోరుతోంది.
★ డాక్టర్ అంబేడ్కర్ పోస్ట్-డాక్టొరల్ నేషనల్ ఓవర్‌సీస్ ఫెలోషిప్స్
ఉపకారవేతనాల సంఖ్య: 100
కాలవ్యవధి: పీహెచ్‌డీ - నాలుగేళ్లు, మాస్టర్స్ డిగ్రీ - మూడేళ్లు.
అర్హత: సంబంధిత విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత. **విభాగాలు:** ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ప్యూర్ సైన్సెస్ అండ్ అప్లయిడ్ సైన్సెస్, అగ్రికల్చరల్ సైన్సెస్ అండ్ మెడిసిన్, ఇంటర్నేషనల్ కామర్స్, అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ జస్టిస్ తదితరాలు.
వయసు: 35 ఏళ్లు మించకూడదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: అక్టోబరు 10
వెబ్‌సైట్: www.nosmsje.gov.in

మరిన్ని నోటిఫికేషన్లు www.eenadupratibha.net లో

ఇంటర్‌తో నావిక్ కొలువులు

భారతీయ తీర గస్తీ దళం (ఇండియన్ కోస్టు గార్డు) నావిక్ (జనరల్ డ్యూటీ) 10+2 ఎంట్రీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలచేసింది. ఇంటర్ అర్హతతో వీటికి పోటీ పడవచ్చు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రాతపరీక్ష, శరీరదార్ఢ్య, వైద్య పరీక్షల ద్వారా నియామకాలు చేపడతారు. ఎంపికైనవారికి ఫిబ్రవరి నుంచి శిక్షణ మొదలవుతుంది. ఉద్యోగంలో చేరిన మొదటి నెల నుంచే రూ.35,000 వరకు వేతన రూపంలో పొందవచ్చు.

యాభై శాతం మార్కులతో ఇంటర్మీడియట్ (ఎంపీసీ గ్రూప్) ఉత్తీర్ణులైనవారు నావిక్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. మ్యాథ్స్, ఫిజిక్స్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలైతే 45 శాతం సరిపోతుంది.

వయసు కనిష్ఠంగా 18 ఏళ్లు, గరిష్ఠంగా 22 ఏళ్లు ఉండాలి. అంటే ఫిబ్రవరి 1, 1998- జనవరి 31, 2002ల మధ్య అభ్యర్థులు జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు ఉంది.

పరీక్షల్లో నెగ్గి ఎంపికైనవారికి ప్రాథమిక శిక్షణ ఐఎన్ఎస్ చిల్కాలో ప్రారంభమవుతుంది. ఇక్కడ మరోసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారికి పోస్టింగు ఇస్తారు. విధుల్లో చేరినవారికి రూ.21,700 మూలవేతనం చెల్లిస్తారు. దీనికి డీఏ, హెచ్ఆర్ఏ ఇతర అలవెన్సులు అదనం. వేతనంతోపాటు ఇతర ప్రయోజనాలు (క్యాంటీన్, వసతి, దుస్తులు, ఎల్‌టీసీ...మొదలైనవి) ఉంటాయి. అన్ని ప్రోత్సాహకాలూ కలుపుకుని రూ.35 వేల వరకు వేతన రూపంలో పొందవచ్చు. భవిష్యత్తులో ప్రధానాధికారి హోదా వరకూ చేరుకోవచ్చు.

రాత పరీక్ష ఇలా..

సెప్టెంబరులో పరీక్షలు ఉంటాయి. ఈ పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇంటర్ మ్యాథ్స్, ఫిజిక్స్, బేసిక్ కెమిస్ట్రీలతోపాటు ఆంగ్ల భాషా పరిజ్ఞానం అంశాల్లో ప్లస్ 2 (ఇంటర్మీడియట్) స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్‌ల నుంచీ ప్రశ్నలు వస్తాయి. రాత పరీక్షలో అర్హత సాధించినవారికి శరీరదార్ఢ్య పరీక్షలు నిర్వహిస్తారు.

అభ్యర్థుల వివరాలను రాతపరీక్ష సమయంలో పరిశీలిస్తారు. పరీక్షకు వెళ్లేటప్పుడే పదోతరగతి, ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫొటోలు, ఏదైనా ఐడీ, సర్టిఫికెట్ల నకళ్లు తీసుకెళ్లాలి.

శరీరదార్ఢ్య పరీక్ష (పీఈటీ)

ఎత్తు కనీసం 157 సెం.మీ. ఉండాలి. ఊపిరి పీల్చకముందు, పీల్చిన తర్వాత ఛాతీ కొలత వ్యత్యాసం కనీసం 5 సెం.మీ. ఉండాలి. ఈ విభాగంలో అర్హత సాధించడానికి 7 నిమిషాల్లో 1.6 కి.మీ. దూరం పరుగెత్తాలి. 20 గుంజీలు, 10 పుష్‌అప్‌లు తీయగలగాలి. పీఈటీలో అర్హత పొందితే వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. స్పష్టమైన కంటిచూపు ఉండాలి, వినికిడి లోపం ఉండకూడదు.

తుది ఎంపిక

రాతపరీక్ష, పీఈటీ, మెడికల్ టెస్టుల్లో ఉత్తీర్ణులైనవారితో తుది నియామకాలు చేపడతారు. ఎంపికైనవారి వివరాలను కోస్ట్‌గార్డు వెబ్‌సైట్‌లో ఉంచుతారు.

ముఖ్యమైన తేదీలు

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం: 26.08.2019
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 01.09.2019
పరీక్ష కేంద్రం: ఏపీ విద్యార్థులకు విశాఖపట్నం. తెలంగాణ అభ్యర్థులకు సికింద్రాబాద్.
వెబ్‌సైట్: www.joinindiancoastguard.gov.in

పట్టుబడిన డీఈ శ్రీనివాస్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహేందర్, నగదు

అనిశా వలలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్

మిషన్ భగీరథ బిల్లులకు గుత్తేదారు నుంచి లంచం డిమాండ్

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: గుత్తేదారు నుంచి లంచం తీసుకుంటున్న అధికారిని అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో మంగళవారం చోటుచేసుకుంది. గుత్తేదారు గురవయ్య నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటూ డీఈ శ్రీనివాస్ అనిశా అధికారులకు చిక్కారు. గురవయ్య పెద్దేముల్, బషీరాబాద్ మండలాల్లోని గ్రామాల్లో రూ.1.5 కోట్ల విలువైన మిషన్ భగీరథ పనులు చేపట్టారు. వీటికి సంబంధించి రూ.22 లక్షల బిల్లు చెల్లింపు ప్రక్రియ పూర్తి చేసేందుకు డీఈ రూ.30 వేల లంచం డిమాండ్ చేశారు. గతంలో పాతబిల్లులకు గురవయ్య రూ.65 వేలు లంచమిచ్చారు. తాజాగా మళ్లీ డబ్బులు అడగడంతో అనిశాను ఆశ్రయించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం గుత్తేదారు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి చేరుకుని వర్క్‌ఇన్‌స్పెక్టర్ మహేందర్‌కు రూ.30 వేలు అందజేసి, విషయాన్ని డీఈకి తెలిపారు. అనంతరం డీఈ వర్క్‌ఇన్‌స్పెక్టర్ నుంచి నగదు తీసుకుంటుండగా అనిశా డీఎస్పీ సూర్యనారాయణ పట్టుకున్నారు.

ఖనిజాభివృద్ధి సంస్థ వెబ్‌సైట్‌లోకి చొరబాట్లు

పోలీసులకు ఎండీ ఫిర్యాదు

ఈనాడు,హైదరాబాద్: కొందరు సైబర్ నేరగాళ్లు ఖనిజాభివృద్ధి సంస్థ వెబ్‌సైట్‌లోకి చొరబడి, నేరుగా ఇసుక వేలంలో పాల్గొంటున్నారు. ఈ మేరకు బాధిత వినియోగదారుల ఫిర్యాదు అందుకున్న ఉన్నతాధికారులు 'చొరబాట్లు నిజమే' అని తేల్చారు. సంస్థ ఉపాధ్యక్షుడు-ఎండీ మల్‌సుర్ నుంచి సమాచారం చేరిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. భవనాల, ఇళ్ల నిర్మాణాల కోసం కొన్నేళ్లుగా ఇసుకను విక్రయిస్తున్నామని, పారదర్శక విధానాలు అనుసరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పేర్లు, వాహనాల నంబర్ల నమోదు లేకుండానే కొంతమంది వేలం పర్యవేక్షణ వ్యవస్థలోకి పదేపదే ప్రవేశించడాన్ని పోలీసుల దృష్టికి తెచ్చామన్నారు. వెబ్‌సైట్ అంశాలను పరిశీలిస్తున్నామని, నేరగాళ్లను పట్టుకుంటామని సైబర్ క్రైమ్ అదనపు డీసీపీ రఘువీర్ తెలిపారు.

భాషా పండితుల పోస్టులు ఉన్నతీకరించాలి

ఈనాడు, హైదరాబాద్: భాషాపండితుల పోస్టుల ఉన్నతీకరణకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రప్రభుత్వం తప్పక అమలుచేయాలని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం(ఎస్‌జీటీయూ) డిమాండ్ చేసింది. సంఘ అధ్యక్షుడు సంకినేని మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర సమావేశంలో మాట్లాడారు.

వచ్చేసింది డయేరియా టీకా

- రాష్ట్రంలో ఏటా 3.5 లక్షల నీళ్ల విరేచనాల కేసులు
- ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల్లో 13 శాతం దీంతోనే
- తొలిసారిగా ప్రభుత్వ వైద్యంలో ప్రవేశం
- వచ్చే నెల తొలివారంలో రాష్ట్రంలో అమలుకు సన్నాహాలు

ఈనాడు, హైదరాబాద్: కలుషిత నీరు, ఆహారం కారణంగా రాష్ట్రంలో ఏటా సుమారు 3.5 లక్షల మంది నీళ్ల విరేచనాల (డయేరియా) బారినపడుతున్నారు. ఐదేళ్ల లోపు చిన్నారుల మరణాల్లో 13 శాతం దీనికారణంగానే చోటుచేసుకుంటున్నాయి. డయేరియా సోకడానికి అనేక రకాల సూక్ష్మక్రిములు కారణమైనా.. ప్రధానంగా 'రోటా వైరస్' వల్ల సోకే డయేరియా ప్రమాదకరంగా పరిణమిస్తోందని నిపుణులు గుర్తించారు. విరేచనాల బారినపడి ఆసుపత్రుల్లో చేరే చిన్నారుల్లో దాదాపు 40 శాతం మంది పిల్లలు రోటా వైరస్ ఇన్‌ఫెక్షన్‌తోనే బాధపడుతుండటం ఆందోళనకర అంశం. ఈ వైరస్ కారణంగా వచ్చే డయేరియాను నివారించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా 96 దేశాల్లో ఇప్పటికే సార్వత్రిక రోగ నిరోధక టీకాల అమలు ప్రక్రియలో 'రోటా వైరస్ వ్యాక్సిన్(ఆర్‌వీవీ)'ను అమలు చేస్తుండగా.. భారత్‌లోనూ కొన్నేళ్లుగా ప్రైవేటు ఆసుపత్రుల్లో అమలు చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వ వైద్యంలోనూ ఉచితంగా రోటా వైరస్ టీకాకు సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల జాబితాలో కేంద్ర ప్రభుత్వం చోటు కల్పించింది. రాష్ట్రంలోనూ తొలిసారిగా ప్రభుత్వ వైద్యంలో డయేరియా నివారణ టీకాను వచ్చేనెల తొలి వారంలో ప్రవేశపెట్టడానికి వైద్యఆరోగ్యశాఖ సన్నాహాలు చేస్తోంది. వారం రోజులుగా రాష్ట్రంలోని వైద్య సిబ్బందికి ఈ టీకా ఇచ్చే విధానంపై శిక్షణ ఇస్తున్నారు. వచ్చే 10 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా డయేరియా టీకాను రాష్ట్రంలో ప్రారంభించాలని ఆరోగ్యశాఖ భావిస్తోంది.

రోటా వైరస్ ముఖ్య లక్షణాలు

- తీవ్ర నీళ్ల విరేచనాలు.. జ్వరం, వాంతులు.. కడుపునొప్పి

రక్షణ ఎలా?

- టీకాను ఇప్పించడం.. తరచూ చేతులు కడుక్కోవడం.. శుభ్రమైన నీటిని తాగడం.. సురక్షిత ఆహారాన్ని తీసుకోవడం.. ఆర్నెల్ల వరకూ తల్లిపాలు పట్టడం.. విటమిన్ ఎ ఆహారాన్ని ఇవ్వడం..

ఎవరికి వేయొచ్చు

- శిశువుకు 6..10..14 వారాల వయస్సున్నప్పుడు ఇతర టీకాలతో పాటు రోటా వైరస్ టీకా వేస్తారు.
- 2.5 ఎం.ఎల్ టీకా ద్రావణాన్ని సిరంజి ద్వారా శిశువుకు వేస్తారు.
- ఈ టీకాకు బూస్టర్ డోసు అవసరం లేదు. మూడు మోతాదులు సరిపోతాయి.

నిబంధనల్ని విస్మరించిన జెన్‌కో

- సంబంధం లేని కారణాలతో పోలవరం జల విద్యుత్తు ప్రాజెక్టు ఒప్పందాన్ని రద్దు చేసింది
- ఏపీ హైకోర్టులో వాదనలు వినిపించిన నవయుగ
- పనుల నిర్వహణలో ఆ సంస్థ వెనుకబడింది: ఏజీ
- మధ్యంతర ఉత్తర్వుల జారీపై నిర్ణయం వాయిదా

ఈనాడు, అమరావతి: 'పోలవరం జల విద్యుత్తు ప్రాజెక్టు' (పీహెచ్‌ఈపీ) పనుల ఒప్పందాన్ని ఏపీ జెన్‌కో రద్దు చేయడంమీద మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలంటూ నవయుగ సంస్థ చేసిన అభ్యర్థనపై నిర్ణయాన్ని ఏపీ హైకోర్టు వాయిదా వేసింది. సంబంధం లేని కారణాలతో ఒప్పందాన్ని జెన్‌కో రద్దు చేసిందని, నిబంధనలను విస్మరించిందని నవయుగ తెలిపింది. ఈ వ్యాజ్యానికి విచారణార్హత లేదని ప్రభుత్వం-జెన్‌కోల తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ పేర్కొన్నారు. ఉభయపక్షాల వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్‌ఎస్ సోమయాజులు.. ధర్మాసనం నిర్ణయాన్ని వాయిదా వేశారు. మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు.

కొనసాగిస్తే ఒప్పందం ప్రకారం పూర్తిచేస్తాం

పనులు చేపట్టాల్సిన ప్రాంతాన్ని ఇప్పటివరకు తమకు అప్పగించలేదని నవయుగ స్పష్టం చేసింది. తాజాగా పిలిచిన రీటెండర్‌లో విద్యుత్తు ప్రాజెక్ట్ పనుల పూర్తికి 58 నెలల గడువిచ్చారని, తమనే కొనసాగిస్తే ఒప్పందం ప్రకారం 2021 నవంబర్ నాటికి పూర్తిచేస్తామని తెలిపింది. ఈ అంశాల్ని పరిగణనలోకి తీసుకొని, విద్యుత్ ప్రాజెక్ట్ పనులను ఇతరులకు అప్పగించకుండా నిలువరించాలని, తమనే కొనసాగించేలా మధ్యంతర ఉత్తర్వులివ్వాలని నవయుగ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ కోరారు. 'సంబంధం లేని కారణాలతో ఒప్పందాన్ని రద్దు చేశారు. జల విద్యుత్ ప్రాజెక్ట్ నిర్మాణానికి జెన్‌కోతో 2017 డిసెంబర్ 20న ఒప్పందం చేసుకున్నాం. 2018లో నీటిపారుదల శాఖతో.. 'ఇరిగేషన్ ప్రాజెక్ట్'కు ఒప్పందం చేసుకున్నాం. నిబంధనల మేరకే మొబిలైజేషన్ అడ్వాన్స్ చెల్లింపులు జరిగాయి. అంతకుమించి నయాపైసా చెల్లించలేదు. తీసుకున్న అడ్వాన్స్ సొమ్ముకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. దానికి సమానమైన బ్యాంక్ గ్యారంటీ ఇచ్చాం. నిర్మాణ పనులు నిర్వహించాల్సిన ప్రాంతాన్ని అప్పగించాల్సిన బాధ్యత జెన్‌కోపై ఉంది. ప్రాంతాన్ని అప్పగించకుండా నిర్మాణం సాధ్యం కాదని సమాచారం ఇచ్చాం. నీటిపారుదల శాఖతో 2018 మే 28న రాళ్ల తవ్వకం ఒప్పందం చేసుకున్నాం. ఆ పని పూర్తి చేయడానికి మాకు ఆగస్టు 2019 వరకు గడువుంది. జులై 29నే ఒప్పందాన్ని రద్దు చేశారు. రాతి తవ్వకానికి అనుమతించకుండా ముందస్తుగానే కాంట్రాక్ట్‌ను రద్దు చేసి.. రాతి తవ్వకాన్ని పూర్తి చేయలేదని ఆరోపణ చేయడం తగదు' అని స్పష్టం చేశారు.

ఆ రెండు ఒప్పందాలకు సంబంధం లేదు

'నీటిపారుదల శాఖతో చేసుకున్న ఒప్పందానికి.. జెన్‌కోతో చేసుకున్న ఒప్పందానికి సంబంధం లేదు. ఏపీ జెన్‌కో, నవయుగకు మధ్య ఒప్పందం ఇది. ఈ కాంట్రాక్టు విషయంలో రాష్ట్ర సర్కారు మూడో పార్టీ మాత్రమే. కానీ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. జెన్‌కో మాతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దుచేసింది. మేం ఎలాంటి నిబంధనలను ఉల్లంఘించలేదు. కాలపరిమితిని అధిగమించలేదు. మావైపు నుంచి ఎలాంటి లోపాలు లేవు. పనులు పూర్తి చేయడానికి 2021 నవంబర్ వరకు గడువుంది. పనులు నిర్వహించే ప్రాంతాన్ని అప్పగించడంలో జెన్‌కో విఫలమైన నేపథ్యంలో గడువు పొడిగించమని అడిగే వెసులుబాటు మాకుంది. నిబంధనలను ఉల్లంఘిస్తూ ఏపీజెన్‌కో ముందుగానే టెండర్లను రద్దుచేసింది. ఒప్పందాల్ని రద్దు చేయడానికి ఓ విధానం ఉంది. నోటీసులు ఇవ్వాలి, వివరణ తీసుకోవాలి, అందుకు కొంత సమయం ఇవ్వాలి. ఇవేమి పాటించకుండా ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దు చేశారు. రీటెండరింగ్‌కు వెళ్లాల్సిన పరిస్థితులు కనిపించడం లేదని పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ.. రాష్ట్ర సర్కారుకు లేఖ రాసినా పట్టించుకోలేదు. రీ టెండరింగ్‌కు వెళ్లాలన్న ఉద్దేశంతో ఒప్పందాన్ని రద్దు చేశారు' అని దమ్మాలపాటి తెలిపారు.

హైకోర్టులో వ్యాజ్యానికి వీల్లేదు: ఏజీ

బ్యాంక్ పూచీకత్తుగా ఉంచిన సొమ్మును నగదుగా మార్చుకోకుండా నిలువరించాలని అభ్యర్థిస్తూ విజయవాడ కోర్టులో నవయుగ సంస్థ మధ్యవర్తిత్వ దావాను దాఖలు చేసి ఉత్తర్వులు పొందిందని ఏజీ శ్రీరాం ధర్మాసనం దృష్టికి తెచ్చారు. జిల్లా కోర్టును ఆశ్రయించిన పిటిషనర్ సంస్థ.. ఇదే అంశంతో ముడిపడిన వ్యవహారంపై హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేయడానికి వీల్లేదన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో పిటిషనర్ సంస్థ వెనకబడిందన్నారు. మధ్యంతర ఉత్తర్వులివ్వొద్దని కోరారు. 'మొబిలైజేషన్ అడ్వాన్స్ కింద నవయుగకు రూ.700 కోట్లకు పైగా చెల్లించాం. నీటిపారుదల పనులు చేపట్టేందుకు సమయం పడుతుందన్న కారణంగా జల విద్యుత్ ప్రాజెక్ట్‌ను ఆలస్యం చేయడం తగదు. అడ్వాన్స్ తీసుకోవడం తప్ప నిర్మాణ పనుల్లో పురోగతి లేదు. పని నిర్వహించాల్సిన ప్రాంతాన్ని అప్పగించలేదని జెన్‌కోపై ఆరోపణ చేస్తున్న పిటిషనర్ సంస్థ.. ఇరిగేషన్ ప్రాజెక్ట్ విషయంలో తన బాధ్యతల్ని ఎందుకు నిర్వర్తించలేదు? ప్రాథమిక దశలోనే ఒప్పందాన్ని ఉల్లంఘించింది. పనులు పూర్తి చేయాలన్న ఉద్దేశం వారికి లేదు. పనుల్లో జాప్యంపై ప్రభుత్వం ప్రశ్నిస్తూనే ఉంది. పిటిషనర్ సంస్థ పనుల నిర్వహించడంలో వెనుకబడిందని ఏపీ జెన్‌కోకు సమాచారం ఇచ్చింది మేమే. అందుకే రద్దు ఉత్తర్వులు జారీచేశారు. జల విద్యుత్ ప్రాజెక్ట్ విషయంలో ఇప్పటికే రీటెండరు పిలిచాం. ముందుకెళ్లనీయండి. పూర్తి వివరాలతో ప్రమాణ పత్రం దాఖలు చేస్తాం, మధ్యంతర ఉత్తర్వులివ్వొద్దు' అని కోరారు.

భారతావనికి గర్వకారణం

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం మరో నాలుగు కీలక విన్యాసాలు జరగనున్నాయని, సెప్టెంబరు 7న చంద్రుని ఉపరితలంపై చంద్రయాన్-2 అనుబంధ ల్యాండర్- విక్రం అడుగుపెట్టనున్నదని తెలిపింది. చంద్రయాన్-1 ఈ దశను చేరుకోకపోవటం ప్రస్తావనార్హం. ఆ పాఠాల నుంచే ఈసారి మరిన్ని జాగ్రత్తలతో లక్ష్యాన్ని చేరుకోగలమన్న విశ్వాసాన్ని ఇస్రో వ్యక్తం చేసింది.

కక్ష్య వైపు మళ్లిన తీరు

ప్రయోగించిన నాటి నుంచి 54వ రోజున చంద్రుడి ఉపరితలంపై చంద్రయాన్-2ను అడుగుపెట్టాలి. అవసరానికి తగ్గట్లుగా కక్ష్య దూరాల్ని పెంచుతూ సెప్టెంబరు 7న లక్ష్యాన్ని చేరుకునేలా ఇస్రో ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. కక్ష్య దూరాలతో పాటు ఆర్బిటర్ చక్కర్లు కొట్టే కాలాన్ని తగ్గిస్తూ మంగళవారానికి కీలక దశకు చేరుకునేలా చేశారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు అపోజీ (భూమికి అతి దగ్గరగా 170 కి.మీ.) నుంచి వ్యతిరేక దిశగా చంద్రుని కక్ష్య వైపు మళ్లిన చంద్రయాన్-2 చంద్రుని గురుత్వాకర్షణకు లోనవుతూ వచ్చింది. ఇదే క్రమంలో గమన వేగాన్ని 2.4 కిలోమీటర్ల నుంచి 2.1 కిలోమీటర్లకు తగ్గించిన ఇస్రో యంత్రాంగం చంద్రుడి కక్ష్యలోకి అది విజయవంతంగా అడుగుపెట్టేలా చేసింది.

గుండె ఆగిపోయినంత పనయింది: శివన్

చంద్రయాన్-2 చంద్రుడి కక్ష్యలో చేరిందన్న ఆనందం కంటే ఆందోళనే అధికమని ఇస్రో అధ్యక్షుడు కె.శివన్ చెప్పారు. బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో ఆయన చంద్రయాన్-2 పనితీరు, రానున్న రోజుల్లో తీసుకోనున్న సాంకేతికపరమైన జాగ్రత్తలపై విలేకరులకు వివరించారు. లక్ష్యం దిశగా ఇకపై చంద్రయాన్-2 వేసే ప్రతి అడుగు సవాళ్లతో కూడుకున్నదని చెప్పారు. చంద్రుడి కక్ష్యలోనికి చేరే ఆ 30 నిమిషాల పాటు గుండె ఆగిపోయినంత భావన కలిగిందని వ్యాఖ్యానించారు. ఇకపై ఇలాంటి ఉత్కంఠ తగ్గకపోగా మరింతగా పెరుగుతుందని చెప్పారు. కక్ష్యల కుదింపు, గమన వేగాల్లో ఏమాత్రం కచ్చితత్వం పాటించకపోయినా చంద్రయాన్-2 పూర్తిగా విఫలమయ్యే ప్రమాదముందని తెలిపారు. చంద్రుని గురుత్వాకర్షణ శక్తితో వ్యోమనౌక కక్ష్య నుంచి వేరుపడే అవకాశాలున్నాయన్నారు. ఆగస్టు 21, 28, 30, సెప్టెంబరు 1 తేదీల్లో మూడు రకాల విన్యాసాలు చేపడతామన్నారు. ఇందులో భాగంగానే చంద్రుని కక్ష్య దూరాన్ని 18000 కిలోమీటర్ల నుంచి 100 x 100కు తగ్గిస్తామన్నారు. సెప్టెంబరు ఒకటో తేదీ నాటికి విన్యాసాల్లో సాధారణ దశ ముగుస్తుందని వివరించారు.

బెంగళూరులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో 'చంద్రయాన్-2' ఆర్బిటర్, రోవర్ నమూనాలను చూపుతున్న ఇస్రో ఛైర్మన్ శివన్

సెప్టెంబరు 2న క్షణక్షణం ఉత్కంఠే

'ఇంతవరకు చంద్రయాన్-2 కోసం మేము చేపట్టిన విన్యాసాలన్నీ గతంలో చేసినవే. సెప్టెంబరు 2న అసలైన పరీక్ష ఎదురు కానుంది. అదే రోజున ఆర్బిటర్ నుంచి ల్యాండర్ విక్రమ్ విడిపోతుంది. అప్పటి నుంచి ఇస్రో సాంకేతిక వ్యవస్థలన్నీ ల్యాండర్ వైపు దృష్టి సారిస్తాయి' అని శివన్ వివరించారు. 3న రెండు విన్యాసాలను చేపట్టి, ఆపై చంద్రుడిపై అడుగుపెట్టే కీలక దశకు చేరుకుంటామన్నారు. తర్వాతి మూడు రోజులపాటు ఎటువంటి ఆపరేషన్లు చేపట్టకుండా 7న ల్యాండర్ చంద్రుడిపై అడుగుపెట్టేందుకు ఏవైనా సాంకేతిక అవాంతరాలున్నాయా? అనే అంశాన్ని సరిచూసుకుంటామని చెప్పారు. చంద్రయాన్-1 సరిగ్గా ఈ దశలోనే విఫలమైనట్లు గుర్తుచేశారు. ఈసారి అత్యుత్తమ వ్యవస్థలను వినియోగించినట్లు తెలిపారు. 'మూడురోజుల పాటు కీలకమైన వ్యవస్థలను సరిచూసుకున్న తర్వాత 7న ల్యాండర్ పవర్ మిషన్లు పని చేయటం ప్రారంభిస్తాయి. ఆపై చంద్రుడి ఉపరితలంపై అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యే ల్యాండర్ సరిగ్గా అర్ధరాత్రి 1.55 గంటలకు చంద్రుడి దక్షిణ ధ్రువంలో మునుపెన్నడూ దిగని చోట పాదం మోపుతుంది. ఆపై రెండు గంటల తర్వాత ల్యాండర్ ర్యాబ్‌లు చంద్రుడి ఉపరితలంపై అడుగులు వేస్తాయి. మరో మూడు గంటల పది నిమిషాల తర్వాత రోవర్‌పైనున్న సోలార్ ప్యానల్స్ విడిపోతాయి. ఆపై.. 3.50 గంటల తర్వాత రోవర్, మరో నాలుగు గంటల తర్వాత ల్యాండర్‌లు చంద్రుడి బిలంలో అసలైన పరీక్షలకు సిద్ధమవుతాయి' అని వివరించారు. ఈ ప్రాజెక్టులో మానవ ప్రయత్నమంతా చేశామని శివన్ చెప్పారు. ఇప్పటివరకు ఏ దేశం సాధించని రీతిలో చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-2 అడుగుపెడుతోందన్నారు. చివరి 15 నిమిషాల కీలక దశలో అడ్డంకి రాకుండా చంద్రునిపై అడుగుపెట్టేలా జాగ్రత్తలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ అరుదైన క్షణాన్ని వీక్షించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించామని శివన్ చెప్పారు.

ప్రధాని హర్షం

దిల్లీ: చంద్రయాన్-2 ప్రస్థానంలో కీలకమైన మరో దశ విజయవంతం కావడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం వ్యక్తం చేశారు. చరిత్రాత్మక పయనంలో ఇదో ముఖ్యమైన అడుగుగా పేర్కొన్నారు. శాస్త్రవేత్తల బృందాన్ని అభినందించారు.

సనత్‌నగర్ ఈఎస్ఐసీలో రూ.150 కోట్లతో కొత్త బ్లాక్

నేడు శంకుస్థాపన

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి.. కార్మికులకు వరమని, దీన్ని కేంద్ర ప్రభుత్వం అన్నిరకాలుగా తీర్చిదిద్దుతుందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ ఆసుపత్రి ప్రాంగణంలో రూ.150 కోట్ల వ్యయం, 27 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో బయటి రోగులకు కొత్త బ్లాక్ నిర్మించాలని కేంద్రం నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. ఈఎస్ఐసీ(ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) అధికారులతో హైదరాబాద్ దిల్‌కుషా అతిథిగృహంలో మంగళవారం కిషన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొత్త బ్లాక్‌కు కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ బుధవారం శంకుస్థాపన చేస్తారని చెప్పారు. అనంతరం ఆసుపత్రిని, వైద్యకళాశాలను తెలంగాణ కార్మికులకు అంకితమిస్తారన్నారు. రూ.600 కోట్లతో వైద్యకళాశాల, రూ.400 కోట్లతో సూపర్‌స్పెషాలిటీ భవనాలను కేంద్రం నిర్మించిందని కిషన్‌రెడ్డి వివరించారు. తెలంగాణలో మిగిలిన ప్రాంతాల్లోనూ కార్మికుల కోసం కొత్త దవాఖానలు, ఉన్నవాటి ఆధునికీకరణకు సంబంధించి కేంద్ర కార్మికమంత్రికి ప్రతిపాదనలు అందజేస్తామని చెప్పారు.

నడ్డా ఎవరో లక్ష్మారెడ్డిని అడిగితే తెలుస్తుంది

భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జె.పి.నడ్డాపై తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన వ్యాఖ్యల విషయంలో కిషన్‌రెడ్డి స్పందిస్తూ.. గతంలో తెలంగాణ వైద్యమంత్రిగా ఉన్న లక్ష్మారెడ్డిని అడిగితే నడ్డా ఎవరన్నది కేటీఆర్‌కు తెలుస్తుందని వ్యంగ్యంగా అన్నారు.

సమస్త సమాచారంతో పర్యాటక యాప్!

ఈనాడు, దిల్లీ: పర్యాటక రంగానికి సంబంధించి ఆతిథ్యం, రవాణా, ఇతర అన్నిరకాల సమాచారంతో ఒక యాప్ రూపొందించాలని రాష్ట్రాల పర్యాటక శాఖ మంత్రులు అభిప్రాయపడ్డారు. దేశంలో పర్యాటక రంగం అభివృద్ధి, ప్రోత్సాహంపై దిల్లీలో మంగళవారం కేంద్ర పర్యాటక మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ ఆధ్వర్యంలో రాష్ట్రాల పర్యాటక శాఖ మంత్రుల సమావేశం నిర్వహించారు. సాహస పర్యాటకం, పర్యాటకులకు ఇళ్లలో ఆతిథ్యం కల్పించే విధానం, ప్రసాద్, స్వదేశీ దర్శన్ పథకాలపై రాష్ట్రాల మంత్రుల సూచనలు, సలహాలు స్వీకరించారు. పర్యాటక రంగం అభివృద్ధికి సాంకేతికత వినియోగంలో దేశంలో ప్రత్యేకంగా నిలిచిన టీహబ్ సేవలను పరిశీలించాలని తెలంగాణ పర్యాటక శాఖ ఇన్‌ఛార్జి ముఖ్యకార్యదర్శి పార్థసారథి సూచించారు. సమావేశానికి తెలంగాణ రాష్ట్రం నుంచి పార్థసారథి, పర్యాటక శాఖ ఎండీ బి.మనోహర్‌రావు హాజరయ్యారు. సంగారెడ్డి-కామారెడ్డి-మెదక్ పర్యాటక సర్క్యూట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కోరారు.

కనిష్ఠ స్థాయికి నదుల ప్రవాహాలు

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా, గోదావరుల్లో ప్రవాహాలు కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. వర్షాలు పూర్తిగా తగ్గిపోవడంతో నదుల్లో వరద పారడం లేదు. ఆలమట్టి నుంచి దిగువకు 5 వేల క్యూసెక్కులే వదులుతున్నారు. జూరాల, శ్రీశైలం జలాశయాల నుంచి మాత్రమే లక్ష క్యూసెక్కులకు పైగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు రోజుల వరకు పోటెత్తిన వరద మంగళవారం నాటికి పులిచింతల ప్రాజెక్టు వరకే పరిమితమైంది. గోదావరిలోనూ వరద పూర్తిగా తగ్గుముఖం పట్టింది.

సోమవారం నాటి నీటి నిల్వలు, ప్రవాహాల వివరాలు..

ప్రాజెక్టు పేరు	పూర్తిస్థాయి నీటినిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నీటినిల్వ (టీఎంసీల్లో)	వస్తున్న ప్రవాహం (క్యూసెక్కుల్లో)	దిగువకు విడుదల (క్యూసెక్కుల్లో)
కృష్ణా పరీవాహకం				
ఆలమట్టి	129.72	122.45	82,000	5,000
నారాయణపూర్	37.64	36.28	40,000	5,650
జూరాల	9.66	9.30	1,70,000	1,61,375
తుంగభద్ర	100.86	100.86	30,950	29,797
శ్రీశైలం	215.81	213.40	2,03,800	1,10,366
నాగార్జునసాగర్	312.05	304.99	53,109	53,109
పులిచింతల	45.77	36.18	25,370	--
గోదావరి పరీవాహకం				
సింగూరు	29.91	0.45	00	20
నిజాంసాగర్	17.80	0.14	--	10
శ్రీరామసాగర్	90.31	17.32	00	400
కడెం	7.60	6.87	572	762
శ్రీపాద ఎల్లంపల్లి	20.18	17.56	00	00
ధవళేశ్వరం	2.93	2.92	4,41,166	3,87,337

గాయత్రి పంపుహౌస్‌లో టీఎంసీ నీటి ఎత్తిపోత ప్రారంభం

రామడుగు, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టు ఎనిమిదో ప్యాకేజీలోని గాయత్రి పంపుహౌస్‌లో మూడు పంపులతో ఒక టీఎంసీ నీటి ఎత్తిపోత మొదలైంది. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ వద్ద గాయత్రి పంపుహౌస్‌లో మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఒకటో నంబరు పంపును నడపటం మొదలుపెట్టారు. మొదట వెట్‌రన్ నిర్వహించిన నాలుగు, ఐదో పంపుల సామర్థ్యం పెంచి మొత్తం మూడు పంపులతో రోజుకు ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. మూడు రోజులుగా రెండు పంపులు నిరాటంకంగా నడుస్తున్నాయి. ఒక్కో పంపు 3150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండటంతో గురుత్వాకర్షణ కాలువ సగం నిండి ఎస్సారెస్పీ వరదకాలువ వరకు ప్రవహిస్తోంది. తాజాగా ఒకటో నంబరు పంపు వెట్‌రన్ నిర్వహించి నిరంతరాయంగా నీటిని ఎత్తిపోసేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ సలహాదారు పెంటారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఈ నూనె శ్రీధర్, డీఈఈ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

లక్ష్మీ బ్యారేజీ నుంచి 1.06 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల

మహదేవ్‌పూర్, కాళేశ్వరం, న్యూస్‌టుడే: భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీ(మేడిగడ్డ) బ్యారేజీ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. బ్యారేజీలో 85 గేట్లకుగాను 20 గేట్లను తెరిచి ఉంచారు. 1.06 లక్షల క్యూసెక్కుల నీరు పైనుంచి వస్తుండగా అదే స్థాయిలో దిగువకు పంపుతున్నారు. సరస్వతీ(అన్నారం) బ్యారేజీకి 4300 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా ఒక గేటును తెరిచి 4,531 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. లక్ష్మీ బ్యారేజీలో 5.9, సరస్వతి బ్యారేజీలో 7.9 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

రాష్ట్రపతితో గవర్నర్ నరసింహన్ భేటీ

రక్షణ మంత్రితోనూ చర్చలు

ఈనాడు, దిల్లీ: తెలంగాణ గవర్నర్ నరసింహన్ మంగళవారం మధ్యాహ్నం దిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రపతి భవన్‌లో గంటసేప

ఈనాడు బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ
74	37
37328	11017

డోజోన్స్	నాస్‌డాక్
85	30
26051	7973

అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి	ముడిచమురు
71.71 పైసలు 28	60.24
(ఒక అమెరికా డాలరుకు)	(బ్రెంట్ ధర డాలర్లలో)

ఘనం (+)			గ్రహణం (-)		
నిఫ్టీ	20న	మార్పు%	నిఫ్టీ	20న	మార్పు%
MARUTI SUZUKI	6190.95	3.48	YES BANK	71.20	-7.11
TATA MOTORS	123.85	2.52	BRITANNIA INDU	2393.50	-3.43
INFOSYS	792.75	1.94	ULTRATECH CEM	4033.05	-3.01
HCL TECHNO	1084.00	1.87	INDIABULLS HSG	521.40	-2.88
DR. REDDYS LABO	2554.60	1.81	EICHER MOTORS	15895.75	-2.71
HERO MOTOCORP	2669.25	1.43	INDUSIND BANK	1404.85	-2.61
M& M	527.80	1.39	ITC LTD	246.50	-2.01

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం			
అమెరికా డాలరు	65.16	75.55	థాయ్ బాత్/100	211.34	252.68
పౌండ్ స్టెర్లింగ్	79.05	91.67	కువైట్ దీనార్	194.82	242.19
యూరో	72.23	83.75	ఒమన్ రియాల్	172.56	197.68
జపనీస్ యెన్/100	61.14	70.91	సౌదీ రియాల్	17.28	20.53
ఆస్ట్రేలియా డాలరు	44.15	51.08	యూఏఈ దిర్హమ్	17.69	20.74
సింగపూర్ డాలరు	47.02	55.71	మలేషియా రింగిట్	15.26	18.76

మంగళవారం నిఫ్టీ కదలికలు



కోడిగుడ్లు

20న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	341	గోదావరి	343
చిల్లరగా (ఒక గుడ్డు)	4.00	వరంగల్	344
బెంగళూరు	355	విశాఖపట్నం	361
21వ తేదీకి...		చెన్నై	365
		చిత్తూరు	358
విజయవాడ	348	నమక్కల్	368

పర్లేదు.. పసిడి కొనేయండి

- పెట్టుబడుల్లో 10% కేటాయించండి
- ఏ స్థాయిలోనైనా సరే
- కేంద్ర బ్యాంకుల వైఖరి వల్లే పైపైకి
- క్రిప్టోకరెన్సీల ధోరణి కూడా కారణమే
- ప్రముఖ పెట్టుబడిదారు మార్క్ మొబియస్

బంగారాన్ని ఏ స్థాయిలోనైనా సరే కొనుగోలు చేయవచ్చని ప్రముఖ పెట్టుబడిదారు మార్క్ మొబియస్ సూచిస్తున్నారు. మొత్తం పెట్టుబడుల్లో 10 శాతాన్ని బంగారంపై పెట్టుకోవాలని ఆయన తెలిపారు. అంతర్జాతీయంగా పలు కేంద్ర బ్యాంకులు పరపతి విధానాలను సడలిస్తుండడం; క్రిప్టో కరెన్సీల సంఖ్య పెరుగుతుండటం వంటివి పసిడికి గిరాకీ పెంచుతాయని ఆయన అంటున్నారు.

'దీర్ఘకాలంలో బంగారానికి ఢోకా లేదు. ధర పెరుగుతూనే ఉంటుంద'ని మొబియస్ క్యాపిటల్ పార్టనర్స్ వ్యవస్థాపకుడు మొబియస్ పేర్కొన్నారు. ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో మూడు దశాబ్దాలు కొనసాగిన అనంతరం ఆయన ఈ కంపెనీని ఏర్పాటు చేశారు. దీర్ఘకాలిక దృక్పథంతోపసిడిని ఏ ధర వద్ద అయినా కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ నెలలో బంగారం ధర ఆరేళ్ల గరిష్ఠ స్థాయికి చేరిన విషయం తెలిసిందే. ఆగస్టు 13న అంతర్జాతీయంగా స్పాట్ బంగారం ధర ఔన్సు 1535.11 డాలర్లుగా పలికింది. ఈ ఏడాదిలో 17 శాతం మేర పెరిగినట్లయింది. అమెరికా, చైనాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం కారణంగా ప్రపంచ వృద్ధి మందగమనం పాలైన నేపథ్యంలో ఫెడరల్ రిజర్వ్, ఇతర కేంద్ర బ్యాంకులు వృద్ధికి ఊతమిచ్చేందుకు పరపతి విధానాలను సడలించాయి. ముఖ్యంగా ఫెడరల్ రిజర్వ్ గత నెలలో దశాబ్దంలోనే తొలిసారిగా కీలక రేట్లను తగ్గించింది. చైనా, ఇతర దేశాల కేంద్ర బ్యాంకులు కూడా ఇదే దారిలో నడిచే అవకాశం కనిపిస్తోంది. ఈ పరిణామం కాస్తా బంగారం ధర పెరగడానికి కారణమైంది. బంగారం ఆధారిత ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్‌ల వైపు మదుపర్లు మళ్లుతుండడం చూస్తుంటే.. ఆర్థిక సంక్షోభం దగ్గరలోనే ఉందన్న సంకేతాలూ కనిపిస్తున్నాయి. కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గిస్తున్న నేపథ్యంలో తమ పెట్టుబడుల్లో 10 శాతాన్ని బంగారానికి కేటాయించుకోవచ్చని మొబియస్ సిఫారసు చేశారు. అయితే పసిడి లక్ష్యిత ధరను మాత్రం ఆయన చెప్పలేదు. బిట్ కాయిన్ వంటి క్రిప్టో కరెన్సీల పాత్ర పెరుగుతున్న కొద్దీ సంప్రదాయ బులియన్ వినియోగం పెరుగుతుందని కూడా ఆయన అభిప్రాయపడ్డారు.

ఆభరణాలకు హాల్‌మార్కింగ్ తప్పనిసరి

త్వరలో నోటిఫై చేయనున్న ప్రభుత్వం

కోల్‌కతా: పసిడి ఆభరణాలకు హాల్‌మార్క్ తప్పనిసరి చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వచ్చే వారం రోజుల్లో ప్రపంచ వాణిజ్య సమాఖ్య (డబ్ల్యూటీఓ)లో నిబంధనలను నోటిఫై చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. పరిశ్రమ ప్రతినిధులతో చర్చలు జరిపిన తర్వాతే ఈ ప్రక్రియ పూర్తవుతుందని ఆభరణాల వర్తకులకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) డైరెక్టర్ జనరల్ సురీనా రాజన్ హామీ ఇచ్చారు. హాల్‌మార్క్ తప్పనిసరి నిబంధనలను ప్రవేశపెట్టాలంటే డబ్ల్యూటీఓకు నోటిఫై చేయడం అవసరమని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 800 హాల్‌మార్కింగ్ కేంద్రాలు ఉండగా, కేవలం 40 శాతం ఆభరణాలు మాత్రమే హాల్‌మార్క్ ముద్ర పొందుతున్నాయి.

15% పెరిగిన దిగుమతి

ఈ ఏడాది ఏప్రిల్-జులైలో దేశంలోకి రూ. 92,000 కోట్ల (13.16 బిలియన్ డాలర్ల) విలువైన బంగారం దిగుమతి అయ్యింది. గత ఏడాది ఇదే కాలంలో 11.41 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 80,000 కోట్ల) విలువైన బంగారమే దిగుమతి చేసుకున్నారు. అంటే ఏడాది కాలంలో దిగుమతులు 15.4 శాతం పెరిగాయి. ఫలితంగా కరెంటుఖాతా లోటు కూడా అధికమైంది.

2024కు డిజిటల్‌దే హవా!

- ప్రకటనల్లో టీవీని అధిగమిస్తుంది
- 2019-20లో మీడియా ఆదాయ వృద్ధి 12 శాతమే
- కేపీఎంజీ నివేదిక

ముంబయి: ప్రసార మాధ్యమాల్లో డిజిటల్ వాటా శరవేగంగా వృద్ధి చెందుతోంది. 2024కు ఇతర మాధ్యమాల కంటే పెద్దదిగా డిజిటల్ అవతరిస్తుందని, 39.5 శాతం వాటా పొందుతుందని కేపీఎంజీ అంచనా వేస్తోంది. డిజిటల్ వినియోగదార్లలో వృద్ధి, ప్రాంతీయ భాషల్లో పెరుగుతున్న డిమాండు కారణంగా మీడియా, వినోద పరిశ్రమ 2018-19లో 13 శాతం వృద్ధితో రూ.1,63,100 కోట్లకు చేరిందని నివేదిక వెల్లడించింది. అయితే 2019-20లో ఈ రంగం 12 శాతం వృద్ధితో రూ.1.88 లక్షల కోట్లకు పరిమితం అవుతుందని అంచనా వేసింది.. ట్రాయ్ కొత్త టారిఫ్‌లు సృష్టించిన అనిశ్చితులు, ఆర్థిక మందగమనం ప్రభావం లేకుంటే పరిశ్రమ మరో 1-2 శాతం అధికంగా వృద్ధి చెందేదని పేర్కొంది. కేపీఎంజీ రూపొందించిన ఈ నివేదిక ప్రకారం.. 'ఏప్రిల్- మేలో సార్వత్రిక ఎన్నికలు, క్రికెట్ ప్రపంచకప్ కారణంగా ప్రకటన వ్యయాల రూపేణా పరిశ్రమకు బాగానే ఆదాయం వచ్చింది. ఆ ఆదాయం కూడా రాకుంటే ఈ ఏడాది పరిశ్రమ వృద్ధి 12 శాతం కంటే కూడా తక్కువగానే ఉండేద'ని తెలిపింది. ఆయా విభాగాలపై నివేదిక ఇంకా ఏం చెప్పిందంటే..

టెలివిజన్..

- కొత్త టారిఫ్ ఆదేశాల అమలులో జాప్యంతో 2018-19లో టీవీ విభాగ ఆదాయంపై ప్రభావం పడింది.
- 2018-19లో టీవీ విభాగ ఆదాయం 9.5 శాతం వృద్ధితో రూ.71,400 కోట్లుగా నమోదైంది.
- ట్రాయ్ కొత్త టారిఫ్‌ల నేపథ్యంలో నికరంగా చందాదారుల సంఖ్య ఎంత ఉండొచ్చన్న లెక్క తేలేవరకు మార్కెటర్లు ఆగడం వల్ల, టీవీ ప్రకటనల వ్యయం స్తబ్దుగా నమోదవుతోంది.
- టీవీ కేబుల్ బిల్లులు పెరగడంతో వినియోగదారు ద్వారా సగటు ఆదాయం రూ.150 నుంచి రూ. 200కి పెరిగింది.
- 2024కు టీవీ పరిశ్రమ రూ.1,21,500 కోట్ల స్థాయికి చేరనుంది.

డిజిటల్...

- టీవీ హవాను తగ్గిస్తున్న డిజిటల్ విభాగం 20 శాతం వాటాతో మీడియా, వినోద పరిశ్రమలో రెండో అతి పెద్ద విభాగంగా 2022కు అవతరించనుంది.
- ప్రకటనల వ్యయాల ఆదాయంలోనూ వాటాను గణనీయంగా పెంచుకుంటుంది.
- 2023-24 కల్లా ప్రకటనల వ్యయాల వాటాల్లో 39.5 శాతం వాటాతో టీవీ విభాగాన్ని అధిగమిస్తుంది.

ముద్రణా మాధ్యమం..

- ప్రస్తుతం రెండో అతిపెద్ద విభాగంగా ఉన్న ముద్రణా మాధ్యమంలో ఆంగ్ల పత్రికల సర్క్యులేషన్ తగ్గుతున్నా, ప్రాంతీయ భాషల్లో పెరుగుతోంది. 2018-19లో ఈ విభాగం 4.5 శాతం వృద్ధితో రూ.33,320 కోట్లకు చేరింది.
- 2023-24 కల్లా 4.2 శాతం వార్షిక వృద్ధితో ఈ రంగం రూ.40,850 కోట్లకు చేరే అవకాశం ఉంది.

2023-24 నాటికి రూ.3.07 లక్షల కోట్లకు

2023-24 నాటికి మీడియా, వినోద పరిశ్రమ 13.5 శాతం వార్షిక వృద్ధితో రూ.3.07 లక్షల కోట్లకు చేరొచ్చని నివేదిక పేర్కొంది. కొత్త డిజిటల్ వ్యాపార విధానాలను అందిపుచ్చుకునేందుకు పరిశ్రమ అధిక ప్రాధాన్యం ఇస్తుండటం, ప్రాంతీయంగా వృద్ధి అవకాశాలు పుష్కలంగా ఉండటం, నియంత్రణపరమైన సానుకూలతలు లాంటివి ఇందుకు దోహదం చేస్తాయని పేర్కొంది.

హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్‌తో కంపెనీ ప్రతినిధులు

హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్

ధరల శ్రేణి రూ.4.99-7.99 లక్షలు

దిల్లీ: హ్యుందాయ్ 'గ్రాండ్ ఐ10 నియోస్'ను మంగళవారం విపణిలోకి విడుదల చేసింది. ధరల శ్రేణి రూ.4.99-7.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్). పెట్రోల్, డీజిల్ వెర్షన్లలో లభ్యమవుతుంది. పెట్రోల్ వేరియంట్‌లో మాన్యువల్, ఆటోమేటిక్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ (ఏఎంటీ) కార్ల ధరలు రూ.4.99 లక్షల నుంచి రూ.7.14 లక్షలు కాగా, డీజిల్ వేరియంట్‌లో రూ.6.7- 7.99 లక్షల మధ్య ఉన్నాయి. 1.2 లీటర్ పెట్రోల్ మాన్యువల్ వేరియంట్ లీటరుకు 20.7 కి.మీ మైలేజీ, ఏఎంటీ వెర్షన్ లీటరుకు 20.5 కి.మీ మైలేజీ వస్తుందని, అదే డీజిల్ మాన్యువల్, ఏఎంటీ వేరియంట్లు లీటరుకు 26.2 కి.మీ మైలేజీ ఇస్తాయని కంపెనీ పేర్కొంది. ఈ కొత్త మోడళ్లు భారత్‌లో తయారైనవి కావడం విశేషం. గ్రాండ్ ఐ10కి కొనసాగింపుగా వీటిని తీసుకొచ్చారు.

ఇసుజు వీ-క్రాస్ రూ.19.99 లక్షలు

దిల్లీ: ఇసుజు మోటార్స్ ఇండియా నుంచి పరిమిత శ్రేణి వేరియంట్ స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) వీ-క్రాస్ విపణిలోకి విడుదలైంది. ధర రూ.19.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్). 1.9 లీటర్ డీజిల్ ఇంజిన్, సిక్స్-స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో వీ-క్రాస్ జెడ్-ప్రెస్టీజ్‌ను రూపొందించారు. ఇంజిన్ చిన్నదైనప్పటికీ మరింత శక్తిమంతమైన, ఇంధన సామర్థ్యంతో తయారైందని కంపెనీ వెల్లడించింది. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, బ్రేక్-ఓవర్‌రైడ్ సిస్టమ్ (బీఓఎస్) తదితర భద్రతా ప్రమాణాలు దీని సొంతం. ఈ మోడల్‌కు బుకింగ్‌లు ప్రారంభించినట్లు కంపెనీ తెలిపింది.

59 నిమిషాల్లో గృహ, వాహన రుణం!

ప్రభుత్వ రంగ బ్యాంకుల సన్నాహాలు

దిల్లీ: రుణ మంజూరు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ) సిద్ధమవుతున్నాయి. 'పీఎస్‌బీలోన్స్‌ఇన్59 మినిట్స్' పోర్టల్‌లో గృహ, వాహన.. ఇతర రిటైల్ రుణాలు కూడా భాగం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ పోర్టల్‌లో సూక్ష్మ, చిన్న, మధ్య శ్రేణి సంస్థల (ఎంఎస్‌ఎంఈలు)కు రూ.కోటి వరకు రుణాలను 59 నిమిషాలు లేదా గంట కంటే తక్కువ సమయంలోనే సూత్రప్రాయ ఆమోదం ఇస్తున్నారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), యూనియన్ బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్ సహా మరికొన్ని పీఎస్‌బీలు ఈ మొత్తాన్ని రూ.5 కోట్ల వరకు పెంచాలని నిర్ణయించాయి. కొన్ని రిటైల్ రుణాలను పోర్టల్ ద్వారా సులభంగా మంజూరు చేసేందుకు బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌లు కూడా సన్నాహాలు చేస్తున్నాయి. పోర్టల్‌లో సూత్రప్రాయ ఆమోదం లభించాక, నచ్చిన బ్యాంక్‌ను ఎంచుకునే సౌలభ్యం రుణగ్రహీతకు ఉంది. రుణ ఆమోద లేఖ అందిన తర్వాత.. 7-8 పని దినాల్లో రుణ మొత్తాన్ని మంజూరు చేస్తున్నారు.

డాక్టర్ రెడ్డీస్ దువ్వాడ ప్లాంటుపై

8 అభ్యంతరాలు

ఈనాడు, హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు ఆంధ్రప్రదేశ్ దువ్వాడలో ఉన్న ప్లాంటులో అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) తనిఖీలు మంగళవారం పూర్తయ్యాయి. మొత్తం 8 అభ్యంతరాలను యూఎస్ఎఫ్‌డీఏ వ్యక్తం చేసిందని డాక్టర్ రెడ్డీస్ పేర్కొంది. ఎఫ్‌డీఏ పేర్కొన్న వ్యవధిలోపు వాటిని పూర్తిస్థాయిలో సరిదిద్దేందుకు ప్రయత్నిస్తామని సంస్థ తెలిపింది.

మూర్ఛ చికిత్సా ఔషధం విడుదల: పలు రకాల మూర్ఛ వ్యాధి చికిత్సలో ఉపయోగించే విగాబాట్రిన్ ఔషధాన్ని అమెరికా విపణిలో విడుదల చేసినట్లు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ తెలిపింది. నోటి ద్వారా తీసుకునే ఈ పొడి మందు లండ్‌బెక్స్ సాబ్రిల్ పౌడర్‌కు జనరిక్ రూపం.

విమానాశ్రయ వ్యాపారం విభజన: జీఎంఆర్

హైదరాబాద్: విమానాశ్రయ విభాగంలోకి వ్యూహాత్మక పెట్టుబడులను ఆహ్వానించిన జీఎంఆర్ ఇన్‌ఫ్రా, దీన్ని ఇతర వ్యాపారాల నుంచి వేరు చేసేందుకు ప్రయత్నిస్తోంది. మొత్తం వ్యాపారాన్ని రెండు విభాగాలుగా మార్చనుంది. విమానాశ్రయ వ్యాపారాన్ని ఒక గ్రూపుగా మార్చి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ కిందకు తీసుకురానుంది. ఇంధనం, జాతీయ రహదారులు, ప్రత్యేక ఆర్థిక మండలి, ఇంజినీరింగ్ కాంట్రాక్టుల విభాగాలన్నింటినీ కలిపి మరో కంపెనీగా ఏర్పాటు చేయబోతోంది. తాజాగా జీఎంఆర్ ఇన్‌ఫ్రా ఈ విభాగాలను విడదీసేందుకు అనుమతినిచ్చిందని సంస్థ తొలి త్రైమాసిక ఫలితాల సందర్భంగా పెట్టుబడిదారులకు ఇచ్చిన ప్రెజెంటేషన్‌లో తెలిపింది. సంస్థను విడగొట్టి, రెండింటిగా మార్చడం ద్వారా వృద్ధిని పెంచుకోవడంతో పాటు, అవసరమైన మూలధన సమీకరణ కూడా సులువవుతుందని పేర్కొంది. ఐదు కంపెనీలుగా విడిపోయిన తర్వాత కొత్త సంస్థలో జీఎంఆర్ ఇన్‌ఫ్రాకు 53.49శాతం వాటా ఉండనుందని సంస్థ తెలిపింది. కొత్త కంపెనీగా ఏర్పడబోయే జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ విలువ రూ.22,480 కోట్లుగా ఉంటుందని ప్రజెంటేషన్‌లో పేర్కొంది. రెండు కంపెనీలుగా ఏర్పాటు చేయడానికి ఇప్పటికే ఎన్‌సీఎల్‌టీ అనుమతిని తీసుకున్నట్లు చెప్పింది.

ప్లాస్టిక్ నీటి సీసాలతో దుస్తులు

విస్తరణ దిశగా క్లాసిక్ పోలో

ఈనాడు, హైదరాబాద్: క్లాసిక్ పోలో బ్రాండ్ పేరుతో దుస్తులను ఉత్పత్తి చేస్తున్న రాయల్ క్లాసిక్ మిల్స్ విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఈ సంస్థకు 135 ప్రత్యేక విక్రయశాలలు ప్రధానంగా దక్షిణ భారతంలోనే ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 65 కొత్త రిటైల్ విక్రయ కేంద్రాలను దేశంలోని ఇతర ప్రాంతాల్లో ప్రారంభించేందుకు చూస్తున్నామని సంస్థ రిటైల్ డైరెక్టర్ రమేశ్ వి.ఖేని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో సంస్థ నుంచి రాబోతున్న 1,000కి పైగా కొత్త డిజైన్లను ప్రదర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 6,000లకు పైగా స్టోర్లలో తమ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. క్లాసిక్ పోలో బిజినెస్ డెవలప్‌మెంట్ జనరల్ మేనేజర్ జి.శ్రీకాంత్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఉత్పత్తి కేంద్ర ప్రతిపాదన ఉందన్నారు. పత్తి, ప్లాస్టిక్ సీసాలను కరిగించి తీసిన పదార్థంతో డెనిమ్ జీన్స్, వెదురు నారతో ఉత్పత్తి చేసిన కాటన్ చొక్కాలను ప్రదర్శించారు.

రేపటి నుంచి గెలాక్సీ నోట్ 10, 10+ విక్రయాలు

దిల్లీ: శామ్‌సంగ్ గెలాక్సీ నోట్ 10, నోట్ 10+ స్మార్ట్‌ఫోన్లను ఈనెల 23 నుంచి దేశీయంగా విక్రయించనుంది. 12 జీబీ ర్యామ్-256-512 జీబీ మెమొరీలతో లభించే నోట్ 10+ ధర రూ.79,999 నుంచి ప్రారంభమవుతుంది. 8జీబీ ర్యామ్, 256 జీబీ మెమొరీతో లభించే నోట్ 10 ధర రూ.69,999 అని సంస్థ తెలిపింది.

లాభాలకు అడ్డుకట్ట

- 6 నెలల కనిష్ఠస్థాయికి రూపాయి
- బ్యాంకింగ్ షేర్లకు అమ్మకాలు
- ఉద్దీపన కోసం ఎదురుచూపులు

సమీక్ష

వరుస లాభాలకు అడ్డుకట్ట పడింది. బ్యాంకింగ్ షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తడం, ప్రభుత్వ ఉద్దీపన ప్రకటన కోసం మదుపర్లు ఎదురుచూడటం ప్రతికూల ప్రభావం చూపింది. అమెరికా ఫెడ్ ఛైర్మన్ ప్రసంగం నేపథ్యంలో మదుపర్లు కొంత అప్రమత్తత పాటించారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారక విలువ 28 పైసలు తగ్గి 71.71 వద్ద ముగిసింది. రూపాయికిది 6 నెలల కనిష్ఠం. అంతర్జాతీయంగా చూస్తే.. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా షేర్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 37,441.75 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 37,511.55 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అనంతరం అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్న సూచీ.. 37,219.90 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 74.48 పాయింట్ల నష్టంతో 37,328.01 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 36.90 పాయింట్లు తగ్గి 11,017 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,985.30- 11,076.30 పాయింట్ల మధ్య కదలాడింది.

- రిలయన్స్ ఇండస్ట్రీస్‌ను మరోసారి వెనక్కి నెట్టి, స్టాక్ మార్కెట్‌లో అత్యంత విలువైన కంపెనీగా టీసీఎస్ అవతరించింది. మంగళవారం ట్రేడింగ్ ముగిసేసరికి టీసీఎస్ మార్కెట్ విలువ రూ.8.20 లక్షల కోట్లుగా నమోదైంది. ఆర్ఐఎల్ మార్కెట్ విలువ రూ.8.08 లక్షల కోట్లుగా ఉంది.
- స్టెర్లింగ్ అండ్ విల్సన్ సోలార్ షేరు స్టాక్ మార్కెట్లలో నమోదైన తొలి రోజే నిరుత్సాహపరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధరైన రూ.780తో పోలిస్తే 10.25 శాతం తక్కువగా రూ.700 వద్ద షేరు నమోదైంది. ఇంట్రాడేలో షేరు రూ.755.50 వద్ద గరిష్ఠాన్ని, రూ.691 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 7.01 శాతం నష్టంతో రూ.725.35 వద్ద ముగిసింది. ఇక ఎన్ఎస్ఈలో 6.90 శాతం కోల్పోయి రూ.726.20 దగ్గర స్థిరపడింది. బీఎస్ఈలో 3.09 లక్షల షేర్లు, ఎన్ఎస్ఈలో 45 లక్షలకు పైగా షేర్లు చేతులు మారాయి. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేనాటికి కంపెనీ మార్కెట్ విలువ రూ.11,631.71 కోట్లుగా నమోదైంది.
- ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నాయన్న వార్తల నేపథ్యంలో సీజీ పవర్ అండ్ ఇండస్ట్రియల్ షేరు పతనమైంది. 19.83 శాతం కుప్పకూలిన షేరు.. రూ.14.75 వద్ద కనిష్ఠాన్ని తాకింది. షేరుకు ఇది 52 వారాల కనిష్ఠం. కంపెనీ మార్కెట్ విలువ రూ.206.8 కోట్లు తగ్గి రూ.946.20 కోట్లకు చేరింది.
- సీజీ పవర్‌కు ఇచ్చిన రుణాలపై ఆందోళనల నేపథ్యంలో యెస్ బ్యాంక్ షేరు కుదేలైంది. ఇంట్రాడే 8 శాతం కోల్పోయిన షేరు.. చివరకు 7.11 శాతం నష్టంతో రూ.71.25 వద్ద ముగిసింది. బ్యాంక్ మార్కెట్ విలువ రూ.3035.31 కోట్లు తగ్గి రూ.16,524.69 కోట్లకు చేరింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 18 నష్టాలు చవిచూశాయి. ఇండస్ఇండ్ బ్యాంక్ 2.36%, ఐటీసీ 2.01%, యాక్సిస్ బ్యాంక్ 1.87%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.48%, వేదాంతా 1.35%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.25%, సన్‌ఫార్మా 1.17%, హెచ్‌డీఎఫ్‌సీ 1.10%, ఎస్‌బీఐ 1.06% చొప్పున డీలాపడ్డాయి. మారుతీ సుజుకీ 3.75%, టాటా మోటార్స్ 2.53%, ఇన్ఫోసిస్ 1.94%, హెచ్‌సీఎల్ టెక్ 1.87%, ఎం అండ్ ఎం 1.44%, హీరో మోటోకార్ప్ 1.39%, హెచ్‌యూఎల్ 1.12% మేర రాణించాయి. రంగాల వారీ సూచీల్లో లోహ, ఇంధన, స్థిరాస్తి, విద్యుత్, చమురు- గ్యాస్, ఫైనాన్స్, ఎఫ్ఎమ్‌సీజీ, బ్యాంకింగ్, టెలికాం 1.71% వరకు నష్టాలు నమోదు చేశాయి. ఐటీ, టెక్, వాహన, మన్నికైన వినిమయ వస్తువుల షేర్లు రాణించాయి. బీఎస్ఈలో 1577 స్క్రిప్‌లు ప్రతికూలంగా, 875 షేర్లు సానుకూలంగాను ముగిశాయి. 131 షేర్లలో ఎటువంటి మార్పు లేదు.

ప్రణయ్ అదుర్స్

- లిన్ డాన్‌కు షాక్
- ప్రిక్వార్టర్స్‌లో సాయిప్రణీత్

ప్రపంచ బ్యాడ్మింటన్

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత ఆటగాడు హెచ్.ఎస్.ప్రణయ్ అదరగొట్టాడు. రెండు సార్లు ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత.. ఐదు మార్లు ప్రపంచ ఛాంపియన్ లిన్ డాన్ (చైనా)కు షాకిచ్చి ప్రిక్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లాడు. వరుసగా రెండో విజయంతో 16వ సీడ్ భమిడిపాటి సాయిప్రణీత్ కూడా ప్రిక్వార్టర్స్ చేరుకున్నాడు.

ఛాంపియన్

బాసెల్ (స్విట్జర్లాండ్)

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు సత్తాచాటుతున్నారు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో ప్రణయ్ 21-11, 13-21, 21-7తో 11వ సీడ్ లిన్ డాన్ (చైనా)పై సంచలన విజయం సాధించాడు. సాయిప్రణీత్ 21-16, 21-15తో లీ డాంగ్ క్యున్ (కొరియా)పై గెలుపొందాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో సుమీత్‌రెడ్డి- మను అత్రి 21-13, 21-13తో టామ్- లాబర్ (ఫ్రాన్స్)పై నెగ్గారు. అరుణ్ జార్జ్- సాన్యం శుక్లా 18-21, 11-21తో తకుతొ- యుకి (జపాన్) చేతిలో ఓడారు. మహిళల డబుల్స్ తొలి రౌండ్లో సిక్కిరెడ్డి- అశ్విని పొన్నప్ప జోడీకి వాకోవర్ లభించింది. పూజ దండు- సంజన సంతోష్ 15-21, 14-21తో యా చింగ్- లింగ్ ఫాంగ్ (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం చవిచూశారు.

తన కెరీర్‌లో లిన్ డాన్‌ను మూడోసారి ఓడించిన ప్రణయ్ అతనిపై 3-2తో మెరుగైన గెలుపోటముల రికార్డును నమోదు చేశాడు. ఒక గంటా 2 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో ప్రణయ్ గొప్పగా ఆడాడు. తొలి గేమ్ నుంచే దూకుడుగా ఆడుతూ డాన్‌కు చెమటలు పట్టించాడు. 11-5తో ఆధిక్యంలోకి వెళ్లిన ప్రణయ్.. డాన్‌పై పూర్తి ఆధిపత్యం కనబరిచాడు. కొద్దిసేపటికే 21-11తో తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. 5-2తో రెండో గేమ్‌ను మొదలుపెట్టిన ప్రణయ్‌ను డాన్ నిలువరించాడు. 5-5తో పాయింట్లు సమం చేసిన డాన్.. 11-8తో ఆధిక్యం సంపాదించాడు. అక్కడ్నుంచి డాన్ ఆధిపత్యం కొనసాగింది. నిర్ణయాత్మక మూడో గేమ్ హోరాహోరీగా ఆరంభమైంది. 6-5తో ముందంజ వేసిన ప్రణయ్ ఒక్కసారిగా టాప్ గేర్‌లోకి వెళ్లాడు. వరుసగా 8 పాయింట్లు రాబట్టి మ్యాచ్‌ను డాన్‌కు దూరం చేశాడు. 19-6తో మరింత ముందుకెళ్లిన ప్రణయ్.. 21-7తో గేమ్‌ను సొంతం చేసుకున్నాడు.

మరో మ్యాచ్‌లో సాయిప్రణీత్ సంపూర్ణ ఆధిపత్యంతో ప్రత్యర్థిపై పైచేయి సాధించాడు. 56 నిమిషాల పోరులో తొలి గేమ్ ఆరంభంలో సాయిప్రణీత్ తడబడ్డాడు. 4-8తో వెనుకంజ వేశాడు. కొద్దిసేపటికే పుంజుకున్న సాయి 11 పాయింట్ల వద్ద ప్రత్యర్థిని అందుకున్నాడు. 12 పాయింట్ల వద్ద స్కోరును సమం చేసిన సాయి అక్కడ్నుంచి చెలరేగాడు. 13-12తో గేమ్‌లో తొలిసారిగా ఆధిక్యంలోకి వెళ్లాడు. 18-16తో ముందంజ వేసిన సాయి.. 21-16తో తొలి గేమ్ గెలుచుకున్నాడు. రెండో గేమ్‌లో 12 పాయింట్ల వరకే ప్రత్యర్థి నుంచి సాయికి పోటీ ఎదురైంది. ఆ తర్వాత ఆధిపత్యమంతా సాయిదే.

ప్రాక్టీస్ మ్యాచ్ డ్రా

కూలిడ్జ్ (అంటిగ్వా): భారత్, వెస్టిండీస్-ఎ మధ్య మూడు రోజుల సన్నాహక మ్యాచ్ డ్రాగా ముగిసింది. చివరి రోజు 305 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ టీ విరామానికి 3 వికెట్లకు 47 పరుగులు చేసింది. ఆ దశలో రెండు జట్లు డ్రాకు అంగీకరించాయి. మ్యాచ్ డ్రాగా ముగిసినా భారత్ మంచి ఆధిపత్యాన్నే ప్రదర్శించింది. ఆటగాళ్లకు మంచి ప్రాక్టీసే లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో పుజారా సెంచరీ (100) కొట్టగా.. రోహిత్ (68) కూడా సత్తా చాటుకున్నాడు. హనుమ విహారి (37 నాటౌట్, 64) రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ రాణించాడు. రహానె.. రెండో ఇన్నింగ్స్‌లో అర్ధశతకం (54)తో ఫామ్‌ను అందుకున్నాడు. విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో ఇషాంత్, ఉమేశ్, కుల్‌దీప్ యాదవ్ తలో మూడు వికెట్లు తీశారు.

తుది జట్టులోకి వస్తా... ఉమేశ్: వార్మప్ మ్యాచ్‌లో ఆకట్టుకున్న భారత ఫాస్ట్‌బౌలర్ ఉమేశ్ యాదవ్.. విండీస్‌తో తొలి టెస్టుకు తుది జట్టులో వస్తానని ఆశాభావం వ్యక్తం చేశాడు. "లెంగ్త్ విషయంలో నాకు కొన్ని సమస్యలు తలెత్తాయి. విరామం లేకుండా ఆడుతున్నపుడు ఫాస్ట్‌బౌలర్లందరికీ ఉండే ఇబ్బందే ఇది. దీనిపై కసరత్తు చేశా. తొలి టెస్టుకు తుది జట్టులో ఉంటాననుకుంటున్నా" అన్నాడు.

ఆ రికార్డులపై విరాట్ కన్ను

నార్త్ సౌండ్ (అంటిగ్వా): బ్యాటింగ్‌లో ఒక్కో రికార్డు బద్దలు కొట్టుకుంటూ వెళుతున్న కోహ్లి.. ఈసారి కెప్టెన్సీలో ఒక పెద్ద రికార్డుకు చేరువయ్యాడు. టెస్టుల్లో భారత్‌కు అత్యధిక విజయాలు సాధించిపెట్టిన మహేంద్రసింగ్ ధోని (60 మ్యాచ్‌ల్లో 27) రికార్డుకు కోహ్లి (46 మ్యాచ్‌ల్లో 26) సమీపంగా ఉన్నాడు. వెస్టిండీస్‌తో తొలి టెస్టులో భారత్ గెలిస్తే.. విరాట్.. మహిని సమం చేస్తాడు. ఈ జాబితాలో సౌరభ్ గంగూలీ (49 మ్యాచ్‌ల్లో 21) మూడో స్థానంలో ఉన్నాడు. ఓవరాల్‌గా టెస్టుల్లో విజయవంతమైన కెప్టెన్లలో గ్రేమ్ స్మిత్ (దక్షిణాఫ్రికా, 109 మ్యాచ్‌ల్లో 53 విజయాలు) ముందున్నాడు.

ఒక్క సెంచరీ చేస్తే..: వెస్టిండీస్‌తో తొలి టెస్టులో కోహ్లి కోసం మరో రికార్డు వేచి చూస్తోంది. కెప్టెన్ అయ్యాక ఈ ఫార్మాట్లో ఇప్పటికే 18 సెంచరీలు సాధించిన విరాట్.. తొలి టెస్టులో శతకం సాధిస్తే 19 సెంచరీలతో ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్న పాంటింగ్‌ను అందుకోనున్నాడు. కెప్టెన్‌గా టెస్టుల్లో అత్యధిక సెంచరీలు సాధించిన బ్యాట్స్‌మెన్‌లో గ్రేమ్ స్మిత్ (25) అగ్రస్థానంలో ఉన్నాడు.

టెస్టుల్లో పోటీ రెట్టింపైంది: టెస్టు క్రికెట్లో పోటీ ఇప్పుడు రెట్టింపు అయిందని భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లి అన్నాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగంగా బుధవారం వెస్టిండీస్‌తో తొలి టెస్టు మ్యాచ్ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో విరాట్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "ప్రస్తుతం టెస్టు క్రికెట్లో పోటీ మరింత పెరిగింది. దీంతో టెస్టులకు కూడా ప్రయోజనం చేకూరుతోంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ సరైన సమయంలో జరుగుతోంది. టెస్టు క్రికెట్ ప్రభావం తగ్గుతుందని కొందరు భావిస్తున్నారు. నా దృష్టిలో గత రెండేళ్లలో సుదీర్ఘ ఫార్మాట్‌లో పోటీ బాగా పెరిగింది" అని విరాట్ చెప్పాడు.

శ్రీశాంత్‌పై నిషేధం ఇంకో ఏడాదే

జీవితకాల శిక్షను ఏడేళ్లకు తగ్గించిన బీసీసీఐ అంబుడ్స్‌మన్

దిల్లీ: స్పాట్‌ఫిక్సింగ్ కుంభకోణానికి సంబంధించి జీవితకాల నిషేధానికి గురైన కళంకిత ఫాస్ట్‌బౌలర్ శ్రీశాంత్‌కు ఊరట. వచ్చే సెప్టెంబరు నుంచి అతడు మళ్లీ క్రికెట్ ఆడొచ్చు. శ్రీశాంత్ నిషేధాన్ని బీసీసీఐ అంబుడ్స్‌మన్ డీకే జైన్ ఏడేళ్లకు తగ్గించారు. ఆరేళ్ల శిక్ష అనుభవించిన అతడు ఇప్పటికే తన ఉచ్ఛ స్థితిని దాటేశాడని అన్నారు. రాజస్థాన్ రాయల్స్‌కు ఆడుతూ స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డందుకు శ్రీశాంత్‌తో పాటు అజిత్ చండీలా, అంకిత్ చవాన్‌లపై బీసీసీఐ 2013లో జీవితకాల నిషేధం విధించింది. అయితే బీసీసీఐ క్రమశిక్షణ సంఘం నిర్ణయాన్ని ఈ ఏడాది మార్చి 15న సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. శిక్షను తిరిగి సమీక్షించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అంబుడ్స్‌మన్ తాజా తీర్పును ఇచ్చారు. అతడి ఏడేళ్ల శిక్ష 2013లో అతడు నిషేధానికి గురైన తేదీ నుంచి అమలులోకి వస్తుందని అన్నారు. వచ్చే ఏడాది ఆగస్టుతో శ్రీకాంత్ శిక్ష ముగుస్తుంది. బీసీసీఐ కొత్త రాజ్యాంగం ప్రకారం శిక్షపై పూర్తి నిర్ణయాధికారం అంబుడ్స్‌మన్‌దే. ఐపీఎల్‌లో ఒక ఓవర్లో ఉద్దేశపూర్వకంగా 14 పరుగుల ఇచ్చినందుకు రూ.10 లక్షలు అందుకున్నాడన్నది శ్రీశాంత్‌పై ఆరోపణ. అవన్నీ తప్పుడు ఆరోపణలని అతడు మొదటి నుంచీ వాదిస్తూ వస్తున్నాడు. 36 ఏళ్ల శ్రీశాంత్ భారత జట్టు తరపున 27 టెస్టులు, 53 వన్డేలు, 10 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. చివరిసారి 2011లో టీమ్ ఇండియాకు ప్రాతినిధ్యం వహించాడు.

కేరళ తరపున రంజీలు ఆడతా.. శ్రీశాంత్: అంబుడ్స్‌మన్ నిర్ణయం పట్ల శ్రీశాంత్ సంతోషం వ్యక్తం చేశాడు. నిషేధం ముగిశాక కేరళ తరపున రంజీ క్రికెట్ ఆడతానని చెప్పాడు. "అంబుడ్స్‌మన్ నిర్ణయం ఎంతో సంతోషాన్నిచ్చింది. కేరళ రంజీ జట్టులోకి పునరాగమనం చేయాలనుకుంటున్నా. వచ్చే నెల నుంచి సాధన మొదలెడతా" అని శ్రీశాంత్ అన్నాడు. భారత జట్టులోకి కూడా పునరాగమనం చేస్తానని ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు.

ఎవరు?

వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు ఫేవరెట్‌గా సిద్ధమవుతున్న టీమ్ ఇండియాకు కూర్పు విషయంలో చిక్కొచ్చిపడింది. ఐదో బౌలర్‌ను ఎంచుకుంటే రోహిత్ శర్మ, అజింక్య రహానేల్లో ఎవరిని తుది జట్టులోకి తీసుకోవాలన్నది కెప్టెన్ విరాట్ కోహ్లికి పరీక్షగా మారింది. భారత్ నలుగురు బౌలర్లతోనే దిగితే తప్ప రోహిత్, రహానేల్లో ఒకరు పెవిలియన్‌కు పరిమితం కాక తప్పదు. ఇటీవల ఫామ్ ప్రకారం చూస్తే ఆ ఒక్కడు రహానేనే కావొచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోహ్లి, రవిశాస్త్రి.. అదనంగా ఆరో బ్యాట్స్‌మన్ వైపు మొగ్గుచూపుతారా లేదా అదనపు బౌలర్ (ఐదో బౌలర్)ను తీసుకుంటారా అన్నది ఆసక్తికరం.

తుది జట్టులో రోహితా.. రహానేనా?

కూర్పుపై డైలమా ● విండీస్‌తో రేపట్నుంచే తొలి టెస్టు

అంటిగ్వా

భారత జట్టు దాదాపు ఎనిమిది నెలల తర్వాత టెస్టు క్రికెట్ ఆడబోతోంది. వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ గురువారమే ఆరంభం కాబోతోంది. ఈ మ్యాచ్‌కు భారత తుది జట్టు ఎలా ఉంటుందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముందు ఓపెనింగ్ సంగతి తేలాల్సి ఉంది. సాధారణంగా అయితే మయాంక్ అగర్వాల్, కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్ ఆరంభించాలి. అయితే ఆస్ట్రేలియా పర్యటనలో చివరి రెండు టెస్టులకు రాహుల్‌ను తప్పించి అతడి స్థానంలో విహారిని పంపిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. అక్కడ విహారి ఎక్కువ పరుగులేమీ చేయకపోయినా.. కొత్త బంతిని సమర్థంగా ఎదుర్కొన్నాడు. దాని పదును తగ్గించాడు. మయాంక్, పుజారా బాగా బ్యాటింగ్ చేసేందుకు అది ఉపయోగపడింది. వెస్టిండీస్-ఎతో సన్నాహక మ్యాచ్‌లో విహారి అర్ధశతకం చేశాడు. ఈ నేపథ్యంలో తొలి టెస్టులో అతడు మరోసారి ఓపెనింగ్ చేస్తే ఆశ్చర్యపోనక్కర్లేదు. మూడు, నాలుగులో పుజారా, కోహ్లి రూపంలో భారత్‌కు బలమైన బ్యాట్స్‌మెన్ ఉన్నారు. ఆ తర్వాతే సమస్య. రిషబ్ పంత్ ఆరో స్థానంలో వచ్చే అవకాశాలు మెండు. హార్దిక్ పాండ్య గాయంతో దూరమైన నేపథ్యంలో ఆల్‌రౌండర్ జడేజా ఏడో స్థానంలో బ్యాటింగ్‌తో జట్టుకు సమతూకాన్నిస్తాడు. ఐదో స్థానంలో ఎవరిని ఆడించాలన్నదే ప్రశ్న. రహానె, రోహిత్‌లలో ఒకరిని పక్కన పెట్టక తప్పదు. రోహిత్ తానాడిన చివరి టెస్టులో అర్ధశతకం చేశాడు. విండీస్-ఎతో సన్నాహక మ్యాచ్‌లోనూ అర్ధశతకం సాధించాడు. రెండో ఇన్నింగ్స్‌లో అర్ధశతకం చేసినప్పటికీ కొంతకాలంగా రహానె పెద్దగా ఫామ్‌లో లేడు. కౌంటీ క్రికెట్లో హాంప్‌షైర్ తరఫునా అతడు మరీ గొప్పగా ఏమీ రాణించలేకపోయాడు. నలుగురు బౌలర్లతో దిగడం ఒక్కటే వీళ్లిద్దరినీ ఆడించడానికి మార్గం. అప్పుడు పేసర్లు బుమ్రా, షమి, ఇషాంత్ శర్మలతో పాటు ఏకైక స్పిన్నర్‌గా అశ్విన్ లేదా కుల్‌దీప్ యాదవ్ జట్టులో ఉండొచ్చు. జడేజా సమీకరణంలో ఉండడు. అయితే టెస్టు క్రికెట్లో 20 వికెట్లు పడగొట్టాలంటే ఐదుగురు బౌలర్లు ఉండాలన్నది కోహ్లి బలమైన విశ్వాసం. ఒకవేళ పిచ్ సజీవంగా ఉంటే అతడు నాలుగో పేసర్‌గా ఉమేశ్ యాదవ్ (ఒక స్పిన్నర్‌తోపాటు)ను ఆడించడానికి సందేహించకపోవచ్చు. మొత్తం మీద తొలి టెస్టు వేదిక వివియన్ రిచర్డ్స్ స్టేడియంలో పిచ్ ఎలా ఉంటుందన్నదానిపైనే కూర్పు ఆధారపడి ఉంటుంది. నలుగురు భారత బౌలర్లు కూడా 20 వికెట్లు పడగొట్టగలరన్న అభిప్రాయం ఉంది. కానీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో తమ తొలి మ్యాచ్‌లో కోహ్లి ఆ సాహసం చేస్తాడా?

ఒలింపిక్స్ హాకీ టెస్టు ఈవెంట్

ఫైనల్లో భారత జట్లు

టోక్యో: ఒలింపిక్స్ హాకీ టెస్టు ఈవెంట్లో భారత పురుషులు, మహిళల జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. మన్‌దీప్‌సింగ్ హ్యాట్రిక్ సాధించడంతో మంగళవారం పురుషుల లీగ్ మ్యాచ్‌లో భారత్ 6-3తో ఆతిథ్య జపాన్‌ను ఓడించి ముందంజ వేసింది. మూడో నిమిషంలో నీలకంఠ శర్మ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యం అందించగా, ఆ వెంటనే సందీప్ (7వ ని) గోల్ కొట్టి స్కోరు రెట్టింపు చేశాడు. అక్కడ నుంచి మన్‌దీప్ జోరు షురూ అయింది. 9, 29, 30 నిమిషాల్లో బంతిని నెట్‌లోకి పంపి హ్యాట్రిక్ సాధించిన మన్‌దీప్.. భారత్‌ను విజయపథంలో నడిపించాడు. జపాన్ తరఫున కెంటారో (25వ ని), టనాకా (36వ ని), కజుమా (52వ ని) గోల్స్ కొట్టారు. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచిన భారత్.. బుధవారం జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌తో పోటీపడనుంది. మహిళల ఆఖరి లీగ్ మ్యాచ్‌లో చైనాతో మ్యాచ్‌ను 0-0తో డ్రా చేసుకున్న రాణీ రాంపాల్ బృందం పట్టికలో అగ్రస్థానంలో నిలిచి ముందంజ వేసింది. ఫైనల్లో జపాన్‌తో భారత్ తలపడనుంది.

మూడో టెస్టుకు స్మిత్ దూరం

లండన్: ఆస్ట్రేలియా స్టార్ బ్యాట్స్‌మన్ స్టీవ్ స్మిత్ గాయం కారణంగా ఇంగ్లాండ్‌తో యాషెస్‌తో మూడో టెస్టుకు దూరయ్యాడు. రెండో టెస్టు సందర్భంగా జోఫ్రా ఆర్చర్ బంతి బలంగా తగలడంతో అతడికి మెదడు గాయమైన సంగతి తెలిసిందే. '30 ఏళ్ల స్మిత్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. తొలి టెస్టులో రెండు శతకాలు సాధించిన అతడు.. రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 92 పరుగులు చేశాడు. తొలి టెస్టులో గెలిచిన ఆస్ట్రేలియా సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో ఉంది. రెండో టెస్టు డ్రాగా ముగిసింది. మూడో టెస్టు గురువారం ఆరంభమవుతుంది.

నెక్‌గార్డ్స్ వాడడం ఆటగాళ్ల ఇష్టం: బీసీసీఐ

బౌన్సర్ల నుంచి రక్షించుకోవడానికి నెక్‌గార్డ్స్ వాడడం పూర్తిగా బ్యాట్స్‌మన్ ఇష్టమని బీసీసీఐ పేర్కొంది. యాషెస్ సందర్భంగా ఆస్ట్రేలియా ఆటగాడు స్మిత్ మెదడు గాయంతో కొన్ని రోజులు ఆటకు దూరమైన నేపథ్యంలో నెక్ గార్డ్స్ వాడకంపై చర్చ మొదలైంది. బుధవారం వెస్టిండీస్‌తో భారత్ తొలి టెస్టు ప్రారంభం సందర్భంగా బౌన్సర్ల దెబ్బ నుంచి తప్పించుకునే నెక్‌గార్డ్స్ వాడడంపై బీసీసీఐ ఆటగాళ్లకు అవగాహన కల్పించింది. "ధావన్ లాంటి కొందరు ఇప్పటికే భిన్నమైన హెల్మెట్లు వాడుతున్నారు. నెక్‌గార్డ్స్ వాడకం వారి ఇష్టానికే విడిచిపెట్టాం. ఎందుకంటే మెడ దగ్గర గార్డ్ అమర్చడం వల్ల కొంతమంది బ్యాట్స్‌మెన్ ఇబ్బంది పడతారు. అందుకే ఐసీసీ ఇప్పటిదాకా నెక్‌గార్డ్స్ వాడకాన్ని తప్పనిసరి చేయలేదు" అని బీసీసీఐ పేర్కొంది.

ప్రపంచ రెజ్లింగ్‌కు సుశీల్

దిల్లీ: టోక్యో ఒలింపిక్స్‌లో పోటీపడాలని తహతహలాడుతున్న భారత దిగ్గజ రెజ్లర్ సుశీల్ కుమార్ ఆ దిశగా మరో అడుగు ముందుకేశాడు. ఈ మెగా ఈవెంట్‌కు ముందు ప్రతిష్టాత్మక ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పోటీపడేందుకు అతను అర్హత సాధించాడు. మంగళవారం జరిగిన సెలక్షన్ ట్రయల్స్‌లో 74 కేజీల విభాగం ఫైనల్లో అతను 4-2తో జితేందర్ కుమార్‌ను ఓడించాడు. ఈ పోరు ఆరంభం నుంచి దూకుడు ప్రదర్శించిన సుశీల్ 4-0తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత ప్రత్యర్థికి రెండు పాయింట్లు ఇచ్చుకున్నా.. చివరిదాకా ఆధిక్యాన్ని కాపాడుకుని విజయం సొంతం చేసుకున్నాడు. ఏడాది విరామం తర్వాత సుశీల్‌కు ఇదే తొలి టోర్నీ కావడం విశేషం.

అంకిత ముందంజ

దిల్లీ: యుఎస్ ఓపెన్ క్వాలిఫయర్స్‌లో భారత అమ్మాయి అంకిత రైనా రెండో రౌండ్లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్లో అంకిత 6-1, 1-6, 6-2తో యాస్లిన్ (బెల్జియం)పై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఆరు బ్రేక్ పాయింట్లలో ఐదింటిని సద్వినియోగం చేసుకున్న అంకిత విజయాన్ని సొంతం చేసుకుంది. పురుషుల సింగిల్స్‌లో రామ్‌కుమార్ రామనాథన్ ఓడిపోయాడు. తొలి రౌండ్లో రామ్‌కుమార్ 5-7, 6-7 (9)తో ఫిలిప్పో బాల్డీ (ఇటలీ) చేతిలో ఓడాడు.

ఉద్దేశపూర్వకంగానే భారత సంతతిపై దాడి

బ్రిటన్ ప్రధాని జాన్సన్‌తో మోదీ

దిల్లీ: స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా లండన్‌లో భారతీయ హైకమిషన్ కార్యాలయం వద్ద భారతీయ సంతతి ప్రజలపై జరిగిన దాడిని ప్రధాని నరేంద్ర మోదీ బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌తో ప్రస్తావించారు. జాన్సన్‌తో మంగళవారం ఆయన టెలిఫోన్‌లో మాట్లాడుతూ 'కేవలం ఒక అజెండాతో, స్వప్రయోజనాలకు పెద్ద మూక బరితెగించి హింసాత్మకదాడికి దిగింది' అని వ్యాఖ్యానించారు. 'తీవ్రవాదం భారత్, యూరప్ సహా ప్రపంచమంతా వ్యాపించింది. ఐసిస్ అడుగుజాడల్లో ప్రపంచమంతా తీవ్రవాద సంస్థలు విస్తరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హింస, అసహనం పెచ్చుమీరాయి' అని ప్రధాని మోదీ జాన్సన్‌తో అన్నారు. హింసాత్మక సంఘటనలపై బోరిస్ జాన్సన్ విచారం వ్యక్తం చేశారు. కశ్మీర్ అంశం భారత్-పాక్‌ల మధ్య ద్వైపాక్షిక అంశం అన్నారు.

ఆకట్టుకునేలా ఉన్న ఈ కళాత్మక రూపాలు.. వెన్నతో చేసినవి. 800 పౌండ్ల నవనీతాన్ని ఉపయోగించి, ఒకే శిల్పానికి రెండు పార్శ్వాలుగా వాటిని తీర్చిదిద్దారు. న్యూయార్క్ రాష్ట్రంలోని సిరక్యూస్‌లో మంగళవారం ఓ ప్రదర్శనలో అవి అందరి చూపును ఆకర్షించాయి.

మహారాష్ట్రలోని సంగ్లీలో ఇటీవల కృష్ణా నది ఉప్పొంగడంతో ఓ పాఠశాలలోకి వరద నీరు చేరింది. పుస్తకాలు, బల్లలు అన్నీ తడిసిపోయాయి. వాటిని పాఠశాల ఆవరణలో మంగళవారం ఇలా ఆరబెట్టారు.

భాష అదుపులో పెట్టుకోండి

- **భారత్‌పై విమర్శల విషయంలో ఇమ్రాన్‌కు ట్రంప్ హితవు**

వాషింగ్టన్: భారత్‌కు వ్యతిరేకంగా వాడుతున్న పదజాలం తీవ్రత పరిధి దాటనివ్వకుండా చూసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్థాన్ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్‌కు సూచించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో నెలకొన్న సంక్లిష్ట పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా రెండు పక్షాలూ సంయమనం పాటించాలని కోరారు. రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలోపేతం కోసం కృషి చేయాలని ఇద్దరు నేతలు నిర్ణయించారు.

సోమవారం ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో ముచ్చటించారు. జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసిన నేపథ్యంలో భారత్, పాక్‌ల మధ్య చెలరేగిన ఉద్రిక్తతలను చల్లబరిచేందుకు ఆయన ప్రయత్నించారు. ఇమ్రాన్ పేరును ప్రస్తావించకుండానే ఆయన చేస్తున్న కవ్వింపు వ్యాఖ్యలను ట్రంప్ వద్ద మోదీ ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భాష విషయంలో సంయమనం పాటించాలని అమెరికా అధ్యక్షుడు ఇమ్రాన్‌కు హితవు పలికారు. 'నా స్నేహితులు మోదీ, ఇమ్రాన్‌తో మాట్లాడా. వాణిజ్యం, వ్యూహాత్మక భాగస్వామ్యాలు, మరీ ముఖ్యంగా భారత్, పాకిస్థాన్‌లు ఉద్రిక్తతలు తగ్గించుకునే అంశంపై చర్చించా. పరిస్థితి సంక్లిష్టమే. అయినా ఆ సంభాషణలు బాగా సాగాయి" అని ట్రంప్ ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు.

'కశ్మీర్'పై ఐసీజేని ఆశ్రయిస్తాం: పాక్

ఇస్లామాబాద్: కశ్మీర్ విషయంలో అంతర్జాతీయ న్యాయస్థానాన్ని (ఐసీజే) ఆశ్రయిస్తామని పాకిస్థాన్ మంగళవారం పేర్కొంది. జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు చేసిన నేపథ్యంలో రకరకాల వేదికలపై యాగీ చేయడానికి ప్రయత్నిస్తున్న పొరుగుదేశం చివరకు అంతర్జాతీయ న్యాయస్థానాన్నీ వదలకపోవడం గమనార్హం. "కశ్మీర్ విషయంలో అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూత్రప్రాయంగా నిర్ణయించాం" అని పాకిస్థాన్ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి షా మహ్మద్ ఖురేషీ మంగళవారం ఏఆర్‌వై న్యూస్ టీవీతో మాట్లాడుతూ వెల్లడించారు.

అభినందన్‌ను హింసించిన పాకిస్థాన్ సుబేదార్ హతం

దిల్లీ: పాకిస్థాన్ భూభాగంలో భారత వైమానికదళ వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్‌ను పట్టుకుని, ఘోరంగా హింసించిన పాకిస్థానీ సుబేదార్ అహ్మద్‌ఖాన్... ఈ నెల 17న భారత కాల్పుల్లో మరణించినట్టు సమాచారం! బాలాకోట్ దాడుల క్రమంలో గత ఫిబ్రవరి 27న పాకిస్థాన్‌పై భారత వైమానికదళం విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అభినందన్ నడుపుతున్న మిగ్-21ను పాక్ సైన్యం తమ భూభాగంలో కూల్చేసింది. గాయపడిన అభినందన్‌ను సుబేదార్ అహ్మద్ ఖాన్ పట్టుకుని తీవ్రంగా హింసించాడు. అప్పట్నుంచి పాకిస్థాన్ సైన్యం అతడిని భారత్‌కు వ్యతిరేకంగా ప్రోత్సహిస్తోంది. సైన్యం అండ చూసుకుని ఖాన్ కొంతకాలంగా కరడుగట్టిన జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రవాదులను భారత భూభాగంలోకి అక్రమంగా పంపుతున్నట్టు సమాచారం. కాగా- పూంఛ్‌లోని కృష్ణఘాటీ సెక్టార్‌లో భారత సైనిక శిబిరాలపై ఈనెల 17న పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడింది. మోర్టారు షెల్స్ వంటి చిన్నపాటి ఆయుధాలను ప్రయోగించింది. దీనికి భారత్ గట్టిగానే బదులిచ్చింది. ఈ కాల్పుల్లో అహ్మద్‌ఖాన్ మృతి చెందినట్టు తాజాగా తెలిసింది.

అహ్మద్‌ఖాన్

సైనిక పోస్టుపై కాల్పులకు తెగబడ్డ పాకిస్థాన్

జమ్మూ: నియంత్రణ రేఖ దగ్గర్లో ఉండే పూంఛ్ జిల్లాలోని రక్షణ పోస్టులు, గ్రామాలను లక్ష్యంగా చేసుకొని దాడి చేసేందుకు పాకిస్థాన్ మూకలు చేసిన ప్రయత్నాన్ని భారత్ సైన్యం బలంగా తిప్పికొట్టింది. మెందార్, కృష్ణఘాటీ సెక్టార్‌లో మంగళవారం ఉదయం కాల్పులు ప్రారంభమయ్యాయి. భారత్‌సైన్యం ధీటుగా ఎదుర్కోవడంతో పాకిస్థాన్ ఆర్మీ పోస్టుకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ దేశానికి చెందిన సైనికులు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. శత్రు సైన్యాన్ని నిలువరించేందుకు జరిగిన ప్రయత్నంలో భారత్‌కు చెందిన రవి రంజన్‌కుమార్ సింగ్(36) అనే జవాన్ కూడా ప్రాణాలు విడిచారు. మరో నలుగురు గాయపడ్డారు.

రంజన్‌కుమార్

సీఎం కమల్‌నాథ్ మేనల్లుడి అరెస్ట్

దిల్లీ: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి మోసపూరితంగా, అక్రమ మార్గంలో రూ.354 కోట్ల రుణం పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ మేనల్లుడు, వ్యాపారవేత్త రతుల్ పురిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. ఈ విషయాన్ని అధికారులు మంగళవారం వెల్లడించారు.

వేధింపులే సునంద ఆత్మహత్యకు కారణం!

దిల్లీ: భర్త శశిథరూర్ వేధింపులే సునందా పుష్కర్‌ను ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు దిల్లీ పోలీసులు ఆరోపించారు. భర్తతో వివాహబంధంలో తలెత్తిన సమస్యల మూలంగా సునందా పుష్కర్ తీవ్ర మానసిక ఆవేదనకు గురైనట్లు వారు మంగళవారం సంబంధిత న్యాయస్థానానికి తెలియచేశారు. ఈ కేసులో కేంద్రమాజీ మంత్రి శశిథరూర్ బెయిలుపై ఉన్న విషయం తెలిసిందే. పాకిస్థానీ పాత్రికేయురాలు మెహర్ తరార్‌తో శశిథరూర్ స్నేహం కూడా సునంద మానసిక వేదనను మరింత పెంచిందని ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 31వ తేదీకి వాయిదా పడింది.

జకీర్ ప్రసంగాలపై మలేసియాలో నిషేధం

కౌలాలంపూర్: వివాదాస్పద ఇస్లాం ప్రబోధకుడు జకీర్ నాయక్‌ను మలేసియాలో ఎక్కడా ప్రసంగాలు చేయకుండా అక్కడి పోలీసులు మంగళవారం నిషేధం విధించారు. భిన్న జాతులు గల మలేసియాలో ఆయన జాతి విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడటంతో నిషేధం విధించినట్లు పోలీస్ అధికారి అస్మావతి అహ్మద్ తెలిపారు.

ఆజాద్‌ను విమానాశ్రయంలో అడ్డుకున్న పోలీసులు

దిల్లీకి తిరుగు పయనం

దిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గులామ్ నబీ ఆజాద్‌ను జమ్మూ-కశ్మీర్‌లో పర్యటించనివ్వకుండా పోలీసులు మంగళవారం జమ్మూ విమానాశ్రయంలోనే ఆపివేశారు. అక్కడి నుంచే దిల్లీకి మరో విమానంలో వెనక్కి పంపారు. దిల్లీ నుంచి బయలు దేరిన ఆయన మధ్యాహ్నం 2.45గంటలకు జమ్మూ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనను బయటకి వెళ్లకుండా అడ్డుకొని 4గంటలకు దిల్లీ పంపించి వేశారని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవీందర్ శర్మ తెలిపారు.

ఇద్దరి ప్రాణాలు బలిగొన్న మూఢనమ్మకం

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: చేతబడి చేశారన్న అనుమానంతో ఇద్దరి ప్రాణాలు బలికొన్న అమానవీయ సంఘటన ఇది.. ఒడిశాలోని కేంఝర్ జిల్లా దమ్మెబారి ఠాణా నెకండపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రామముండా కుమార్తె(9) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆసుపత్రిలో చికిత్స చేయించినా కోలుకోలేదు. గ్రామంలో ఉంటున్న సుభాష్ ముండా(60), ఆమె తమ్ముడి కొడుకు కేతన్‌ముండా(27) చేతబడి చేయడం వల్లే బాలిక కోలుకోవడంలేదని రామముండా, గ్రామస్థులు అనుమానించారు. సోమవారం రాత్రి వారంతా కలిసి సుభాష్ ఇంటికి వెళ్లారు. నిద్రపోతున్న ఆమెను గొంతు నులిమి ప్రాణాలు తీశారు. అడ్డుకున్న కేతన్‌నూ కొట్టి చంపేశారు. పోలీసులు మంగళవారం రామముండాను అరెస్టు చేశారు.

తాంత్రిక వైద్యం పేరుతో కళ్లు పెకిలించారు

ఝార్ఖండ్‌లో దారుణం, మహిళ మృతి

రాంచీ: తాంత్రిక వైద్యం పేరుతో దంపతులు ఒక మహిళ ఉసురుతీశారు. ఝార్ఖండ్ రాష్ట్రం గర్వా ప్రాంతంలో కొండిర గ్రామంలో రుడానీ దేవి అనే మహిళ తీవ్ర అనారోగ్యానికి గురైంది. తాంత్రిక సాధనతో రోగాలను నయం చేస్తామని నమ్మబలికిన ఆలందేవి, సత్యేంద్ర ఓరన్ దంపతులను రుడానీ దేవి బంధువులు ఆశ్రయించారు. రుడానీదేవికి దుష్టశక్తులు ఆవహించాయని చెప్పి ఆ దంపతులు నమ్మించారు. త్రిశూలం లాంటి పదునైన సాధనంతో ఆమె కళ్లు పెకిలించారు. ఒళ్లంతా కుళ్లబొడిచారు. అసలే జబ్బుపడి బలహీనంగా ఉన్న రుడానీదేవి ఆ గాయాల బాధకు తాళలేక మృతిచెందింది. శవానికి పంచనామా చేయించకుండా ఖననం చేయడానికి యత్నించిన కుటుంబ సభ్యులను, మరణానికి కారణమయిన తాంత్రిక దంపతులను పోలీసులు అరెస్టు చేశారు.

'ఆధార్ అనుసంధానం'పై సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఫేస్‌బుక్!

దిల్లీ: అంతర్జాలంలో సామాజిక అనుసంధాన వేదికల ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించాలని అభ్యర్థిస్తూ మద్రాస్, బొంబాయి, మధ్యప్రదేశ్ హైకోర్టుల్లో దాఖలైన కేసులను సుప్రీంకోర్టుకు బదలాయించి విచారణ చేపట్టాలన్న ఫేస్‌బుక్ అభ్యర్థనపై సుప్రీంకోర్టు మంగళవారం సానుకూలంగా స్పందించింది. ఈ కేసులపై విచారణ చేపట్టేందుకు అంగీకరిస్తూ.. కేంద్ర ప్రభుత్వం, గూగుల్, ట్విటర్, యూట్యూబ్ తదితర సంస్థలకు, వ్యక్తులకు జస్టిస్ దీపక్‌గుప్తా, జస్టిస్ అనిరుద్ధబోస్‌లతో కూడిన ధర్మాసనం నోటీసులు జారీచేసింది.

లంచం అడిగిన ఎన్ఐఏ అధికారులపై బదిలీ వేటు

దిల్లీ: వారు ప్రతిష్ఠాత్మక సంస్థ అయిన జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు. నేరగాళ్లను గుర్తించి కోర్టు వరకు తీసుకెళ్లాల్సిన కీలక బాధ్యత వారిపై ఉంటుంది. అలాంటి అధికారులే లంచాల బాట పట్టినట్లు ఫిర్యాదులు వచ్చాయి. కరడుగట్టిన ఉగ్రవాది హఫీజ్ సయీద్ నిందితుడిగా ఉన్న కేసులో ఒక వ్యాపారి పేరును తొలగించేందుకు రూ.2కోట్లు లంచం అడిగినట్లుగా ముగ్గురు ఎన్ఐఏ అధికారులపై ఆరోపణలు వచ్చాయి. వీరిలో ఇద్దరిని మాతృ సంస్థకు బదిలీ చేశారు. మరొకరిని ప్రాధాన్యం లేని పోస్టుకు మార్చారు.

ప్రజలపై 'మమత' చూపండి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ... సినీ నిర్మాత అపర్ణా సేన్ సహా పది మంది ప్రముఖులు ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి బహిరంగ లేఖ రాశారు. 'సిటిజన్స్ స్పీక్ ఇండియా' పేరున రాసిన ఈ లేఖను సోమవారం ఆమెకు పంపారు. వేతనాల పెంపు, హక్కుల సాధన కోసం పోరాడుతున్న ఉపాధ్యాయులు, అమాయక పౌరులపైకి ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పడం తగదన్నారు. ప్రజా ఉద్యమాలను పోలీసులతో అణచివేయడం సరికాదన్నారు.

అరటి తొక్కలతో శానిటరీ నాప్‌కిన్స్

- **120 సార్లు వాడుకోవచ్చు**
- **తయారుచేసిన దిల్లీ అంకుర సంస్థ**

దిల్లీ: అరటి 'తొక్కలే'... అని చులకనగా చూడకండి. వాటితో 120 సార్లు వాడుకోదగ్గ శానిటరీ నాప్‌కిన్లను తయారుచేసింది... దిల్లీకి చెందిన అంకుర సంస్థ 'సన్పే'. ఐఐటీ-దిల్లీ అధ్యాపకుల సహకారంతో ఇది సాధ్యమయింది. చాలా సంస్థలు వీటి తయారీకి ప్లాస్టిక్, సింథటిక్ పదార్థాలను వాడుతున్నాయి. వాడి పారేసిన తర్వాత ఇవి పూర్తిగా నాశనం కావడానికి 50-60 ఏళ్లు పడుతుంది. ఐఐటీలో బీటెక్ చదువుతున్నప్పుడే అర్చిత్ అగర్వాల్, హ్యారీ సెహ్రావత్‌లు దీనిపై దృష్టి సారించారు. అరటి తొక్కలతో పర్యావరణహిత నాప్‌కిన్లను విజయవంతంగా తయారుచేశారు. 'సన్పే'ను స్థాపించి వీటి ఉత్పత్తిని ప్రారంభించారు. ఒక జత నాప్‌కిన్లను రూ.199కే అందిస్తామని, వీటిని రెండేళ్లపాటు వాడుకోవచ్చని అర్చిత్ చెప్పారు.

లాత్వియాతో బంధం బలోపేతం

ఆ దేశ అధ్యక్షుడు, ప్రధానితో వెంకయ్యనాయుడి చర్చలు

రిగా: భారత్, లాత్వియా మధ్య సంబంధాలు మరింత బలపడనున్నాయి. ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, లాత్వియా అధ్యక్షుడు ఎగ్లిస్ లెవిట్స్ మధ్య మంగళవారం జరిగిన విస్తృతస్థాయి చర్చల్లో ఈ మేరకు తీర్మానించుకున్నట్లు ఇరుదేశాలు సంయుక్త ప్రకటనలో వెల్లడించాయి. ఆయుర్వేదం, యోగాపై లాత్వియా ప్రజలు ఆసక్తి చూపిస్తుండటాన్ని వెంకయ్యనాయుడు అభినందించారు. లాత్వియా ప్రధాన మంత్రి క్రిస్‌జానిస్ కారిన్స్‌తోనూ ఉపరాష్ట్రపతి చర్చలు జరిపారు.

లాత్వియా ప్రధాని క్రిస్‌జానిస్ కారిన్స్‌తో వెంకయ్యనాయుడు

పంట దిగుబడులు ఆశాజనకం!

- పప్పులు మాత్రం ఉడకవ్..
- 2018-19 ముందస్తు అంచనాలు
- అయిదేళ్ల సగటుకు మించి ఉత్పత్తులు
- పత్తి దిగుబడులు తగ్గుముఖం

ఈనాడు - దిల్లీ

దేశవ్యాప్తంగా పంట దిగుబడులపై కేంద్ర వ్యవసాయ శాఖ అంచనాలు ఆశాజనకంగా ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి పప్పుదినుసులు, పత్తి దిగుబడులు మాత్రం తక్కువే. మిగతా పంటల దిగుబడులు గత అయిదేళ్ల సగటు కంటే మెరుగ్గా ఉన్నాయి. 2018-19లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 284.95 మిలియన్ టన్నుల మేరకు ఉండొచ్చని కేంద్ర వ్యవసాయశాఖ వెల్లడించింది. ముందస్తు అంచనాల ప్రకారం 2013-14 నుంచి 2017-18 మధ్యకాలంలో వచ్చిన సగటు దిగుబడుల కంటే ఇది 19.20 మిలియన్ టన్నులు అధికం.



పంట కొనుగోళ్లు ఆధార్‌తో అనుసంధానం

- **ఒడిశాలో కేంద్ర పైలట్ ప్రాజెక్టు!**

ఈనాడు, దిల్లీ: పంట కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ఫలం రైతులకు మాత్రమే దక్కేలా చేయడానికి కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా ఇకమీదట ప్రభుత్వ సంస్థలు సేకరించే అన్నిరకాల పంట ఉత్పత్తులను ఆధార్‌తో అనుసంధానించే పనికి శ్రీకారం చుడుతోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఒడిశాలోని నాలుగు జిల్లాల్లో దీన్ని పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టనున్నారు. అక్కడ ఎదురయ్యే అనుభవపూర్వక ఇబ్బందుల నుంచి పాఠాలు నేర్చుకున్న తర్వాత దేశవ్యాప్తంగా అన్ని మార్కెట్‌లకు విస్తరింపజేయాలని కేంద్రం యోచిస్తోంది. ఇప్పటివరకూ దళారులు.. రైతుల నుంచి తక్కువ ధరకు పంట ఉత్పత్తులు కొనుగోలుచేసి తర్వాత వాటిని ప్రభుత్వం కల్పించిన కనీసమద్దతు ధరకు అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. వీటికి చెక్ పెట్టేందుకే కేంద్రం ఈ ఆధార్ అస్త్రాన్ని ప్రయోగించడానికి సిద్ధమైంది. ప్రభుత్వ సంస్థలు సేకరించే ప్రతి పంట ఉత్పత్తికి దాని యజమాని అయిన రైతు ఆధార్ సంఖ్యను నమోదుచేయడం తప్పనిసరి చేయాలని నిర్ణయించింది. ఈ విధానం అమలుకోసం దేశవ్యాప్తంగా అన్ని సేకరణ కేంద్రాల్లో కంప్యూటర్ వ్యవస్థ ఏర్పాటుకు కేంద్రం రూ.లక్ష ఆర్థికసాయం అందించనుంది. ఈ మొత్తంతో ఒక ల్యాప్‌ట్యాప్, రైతుల వేలిముద్రల సేకరణకు ఒక పాయింట్ ఆఫ్ సేల్ మిషన్(పీవోఎస్) కొనుగోలుచేస్తారు. పీవోఎస్ మిషన్‌ను వేలిముద్రల సేకరణకోసం ఆధార్ డేటా కేంద్రంతో అనుసంధానిస్తారు. దీనివల్ల నిజమైన రైతుకు మాత్రమే కనీస మద్దతు ధర ప్రయోజనం దక్కుతుంది.

ఘనంగా రాజీవ్ జయంతి

- **మోదీ, మన్మోహన్, సోనియా తదితరుల ఘననివాళి**

దిల్లీ: రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ సహా పలువురు పార్టీ నేతలు మంగళవారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ స్మారకం 'వీర్‌భూమి' వద్ద నిర్వహించిన ప్రార్థనా సమావేశంలో రాహుల్, ప్రియాంకాగాంధీ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో విద్వేషం, మతప్రాతిపదికన చీలికలు, హింస పెట్రేగిపోయాయంటూ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

వీర్ భూమి వద్ద నివాళులర్పిస్తున్న సోనియా

'లడ్డూలు వద్దు.. విడాకులు కావాలి'!

మేరఠ్: "అయ్యా! మా ఆవిడ లడ్డూ తప్ప మరేమీ తినడానికి పెట్టడం లేదు. ఎంతచెప్పినా వినడం లేదు. ఈ బాధ పడలేను. విడాకులిప్పించండి" అంటూ ఓ భర్త న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఈ కారణాన్ని చూసి కుటుంబ కౌన్సెలింగ్ కేంద్రం అధికారులు అవాక్కయ్యారు. వివరాల్లోకి వెళితే భర్త గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో భార్య ఆయన క్షేమం కోసం ఏం చేయాలా? అని మదనపడింది. ఓ తాంత్రికుడిని సంప్రదించింది. నీ భర్త కలకాలం ఆరోగ్యంగా ఉండాలంటే ఆయనకు పొద్దున, సాయంత్రం నాలుగేసి లడ్డూలు మాత్రం తినిపించమని సదరు తాంత్రికుడు ఆ ఇల్లాలికి చెప్పాడు. ఆమె తాంత్రికుడి మాటలను అక్షరాలా పాటించింది. భార్యకు నచ్చచెప్పడానికి భర్త ఎంతో ప్రయత్నించాడు. ఆమె వినకపోవడంతో లడ్డూల కంటే విడాకులే మేలనుకుని న్యాయస్థానం తలుపుతట్టాడు.

చిటికెలో.. ఏ చెట్టు ఎక్కడో..

గుజరాత్: మీ ఊళ్లో చెట్లు ఎక్కడున్నాయో మీకు తెలుసా? అంటే చాలా మంది తెలీదనే అంటారు. గుజరాత్‌లోని విద్యానగర్‌లో మాత్రం కచ్చితంగా తెలుసుకోవచ్చు. ఇక్కడ నగరం మొత్తాన్ని 'డిజిటల్ ట్రీ మ్యాపింగ్' చేశారు మరి. ఒక్క క్లిక్ చేస్తే చాలు.. ఎక్కడ చెట్లున్నాయి? ఎన్ని రకాలున్నాయి? ఎప్పుడు నాటారు? ఒక టేమిటి.. సమస్త సమాచారం ప్రత్యక్షమైపోతుంది. 'వాలంటరీ నేచుర్ కన్సర్వేన్సీ' నేతృత్వంలో ఔత్సాహికులైన యువతీ యువకులంతా చేసిన ఈ ప్రయత్నం అందరి ప్రశంసలు పొందుతోంది. దేశంలోనే ఇలాంటి మ్యాపింగ్ చేసిన తొలి నగరంగా విద్యానగర్‌కు గుర్తింపు కూడా తెచ్చిపెడుతోంది. నగరంలో 3,404 చెట్లు, 72 వృక్ష జాతులు ఉన్నట్లు తేలింది. కాలానుగుణంగా దీనికి మార్పులు కూడా చేస్తుంటారు.

ఈ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే దగ్గరా డౌన్‌లోడ్ చేసుకోండి

కాపాడమ్మా.. సీపోతీ!

కేరళ: 'మా ఇంటికొచ్చి దీవించి పో తల్లీ!' అంటూ కేరళ వాసులు ఈ బాలికలకు మొక్కుతారు. 'సీపోతి'గా పిలిచే వీరంతా ఊళ్లలో తిరుగుతూ ఆశీర్వచనాలందిస్తుంటే.. జానపద గాయకులు గొంతు సవరిస్తుంటారు. ఏటా జరిగే ఈ 'సీపోతి తెయ్యం' ఉత్సవాలు నెల రోజులుగా వైభవంగా సాగుతున్నాయి. ఉత్తర కేరళలో కర్కిడకోం అనే మలయాళ మాసంలో జరిపే ఈ ఉత్సవాలకు ప్రజాదరణ అపరిమితం. ఈ మాసాన్ని ఇక్కడి ప్రజలు దుర్భరమైన నెలగా భావిస్తారు. భారీ వర్షాలు, వరదలే కాకుండా వ్యాధులు సోకే అవకాశమూ ఎక్కువగా ఉండే ఈ నెలలో తమను కాపాడాలని వారంతా దేవతలను వేడుకుంటారు. సీపోతి వారి ఇలవేల్పు.. ఈ నెలలో ఆమె ఏదో ఒక రూపంలో భక్తులను కనికరిస్తుందన్నది వారి విశ్వాసం. 'సీపోతి' బాలలు తెల్ల గౌనుపై, ఎర్రని రవిక, బంగారపు వర్ణంలోని నగలు, చిన్న కిరీటం, సంప్రదాయ గొడుగు ధరించి నిండుగా వీధుల్లో తిరుగుతారు. స్థానికులంతా సంప్రదాయబద్ధంగా దీపధూపాలతో వారికి ఆహ్వానం పలుకుతారు. దక్షిణ సమర్పిస్తారు. ఈ ఏడాది ఈ దక్షిణలో కొంత భాగం కేరళ వాయినాడ్‌లోని వరద బాధితులకు విరాళంగా ఇవ్వనున్నారు.

పందెంలో పావురాలు!

తమిళనాడు: కోళ్ల పందేలు.. ఎద్దుల పోటీలు చాలా చూశాం. మరి పావురాల పోటీ పెడితే ఎలా ఉంటుంది? చెన్నైలో అదే చేశారు. ఒక పావురం తక్కువ సమయంలో ఎంత దూరం చేరగలదన్నదే పోటీ. 'గుడ్‌విల్ పిజియన్ క్లబ్' నిర్వహించిన ఈ పోటీలో తర్ఫీదు పొందిన 300 పావురాలు తలపడ్డాయి. రత్నకుమార్ పావురం కేవలం 11 రోజుల్లో 1,750 కి.మీ.ల దూరం ఎగురుకుంటూ వెళ్లివచ్చి మొదటి బహుమతి కొట్టేసింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00